PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 98 | విజయవాడ, బుధవారం 8 నవంబర్ 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 8 November 2023 | Rs



అక్టోబర్ మహత్తర విప్లవ 106వ వార్షికోత్సవ సందర్భంగా బెలారస్ రాజధాని మిన్స్క్‌లో మహనీయుడు లెనిన్ విగ్రహం వద్ద పుష్ప గుచ్ఛాలుంచి నివాళులర్పిస్తున్న అధ్యక్షుడు లుకషెంకో, పౌర, సైనిక ఉన్నతాధికారులు



సంఘీభావ సదస్సులో ఏచూరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్న పాలస్తీనా దౌత్యవేత్త అబు అల్ హైజా

మారణహోమాన్ని ఆపాలి

- ఐరాస ఆధ్వర్యంలో కాల్పుల విరమణ పాటించాలి
- పాలస్తీనా సంఘీభావ సభలో వామపక్ష నేతలు డిమాండ్
- గాజాపై దాడులకు అమెరికా మద్దతుపై ఏచూరి ఆగ్రహం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

గాజాలో ఇజ్రాయెల్ సాగిస్తున్న మారణకాండకు ఆపాలని, అక్కడ చిక్కుకున్న మహిళలు, చిన్నారులను తక్షణమే ఆదుకోవాలని వామపక్షాలు డిమాండ్ చేశాయి. 2+2 సమావేశంలో పాల్గొనేందుకు అమెరికా రక్షణ, విదేశాంగ మంత్రులు మంగళవారం నాడిక్కడకు వచ్చిన సందర్భంగా నిరసన తెలపాలన్న వామపక్షాల పిలుపులో భాగంగా అయిదు లెఫ్ట్ పార్టీల ఆధ్వర్యాన సంఘీభావ సభ జరిగింది. హరికిషన్ సింగ్ సూర్జిత్ భవన్‌లో జరిగిన ఈ సభలో సిపిఎం, సిపిఐ, సిపిఐ- ఎంఎల్, ఆర్‌ఎస్‌పీ, ఫార్వర్డ్ బ్లాక్ పార్టీల ఆధ్వర్యంలో జరిగిన సదస్సుకు భారత్‌లోని పాలస్తీనా రాయబారి అద్నాన్ అబు అల్హైజా హాజరయ్యారు. ఆత్మరక్షణ ముసుగులో యూదు దురహంకార ప్రభుత్వం సాగిస్తున్న మారణహోమాన్ని వక్తలు ముక్తకంఠంతో ఖండించారు. ఈ సందర్భంగా సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మాట్లాడుతూ గాజాలో ప్రస్తుతం జరుగుతున్నది రెండు సైన్యాల మధ్య యుద్ధం కాదని, యూదు దురహంకార ఇజ్రాయిల్ సాగిస్తున్న అత్యంత భయానకమైన మారణకాండ అని అన్నారు. శరణార్థి శిబిరాలు, ఆసుపత్రులు, ఐరాస ఆధ్వర్యంలోని శరణార్థి శిబిరాలపైన బాంబులు కురిపించి, అంతులేని వినాశనాన్ని సృష్టిస్తోందని అన్నారు. అంతర్జాతీయ చట్టాలు, నియమాలను ఇజ్రాయిల్ కాలరాస్తోందని విమర్శించారు. హమాస్‌పై దాడి చేస్తున్నామని చెబుతున్నవారు హమాస్ ఉనికే లేని వెస్ట్ బ్యాంక్‌పై ఎందుకు బాంబులు వేస్తున్నారని ప్రశ్నించారు. అమెరికా, దాని మిత్రదేశాలు ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణహోమానికి ఆర్థిక, సైనిక సహకారాన్ని అందిస్తున్నాయని ఆయన విమర్శించారు. కాల్పుల విరమణ కోసం ఒత్తిడిని తీవ్రతరం చేసే పోరాటంలో భారతీయులందరూ పాల్గొనాలని ఏచూరి పిలుపునిచ్చారు. వామపక్షాల మద్దతుకు భారత్‌లో పాలస్తీనా దౌత్యవేత్త అద్నాన్ అబు అల్ హైజా కృతజ్ఞతలు తెలియజేశారు. పాలస్తీనా రాష్ట్రానికి చెందిన 73 శాతం భూమిని ఇజ్రాయెల్ స్వాధీనం చేసుకున్నదని ఆయన పేర్కొన్నారు. బెంజమిన్ నెతన్యాహు ఒక వలసదారు, రెండు దేశాల సిద్ధాంతాన్ని కూడా ధ్వంసం చేస్తున్నారని విమర్శించారు. తమ సొంత ఇంటిలోని ఒక్క గదిలోకి వెళ్లడానికి కూడా ఆక్రమిత బలగాలు అనుమతించవని అన్నారు. వారికి ఆత్మరక్షణ అంటే నరమేధమని అన్నారు. అల్-అక్సా మిగతా 2లో

స్కీములు లేవు...

అన్నీ స్కాములే

టిడిపి పాలనపై సిఎం వైఎస్ జగన్ విమర్శ

- పుట్టపర్తి వేదికగా రెండో విడత 'రైతు భరోసా'నిధులు జమ
- వారు చెప్పే మాటలు నమ్మవద్దని ప్రజలకు సూచన



రైతు భరోసా మెగా చెక్కును అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

తెలుగుదేశం పాలనలో ప్రజలకు ఉపయోగపడే ఒక్క పథకాన్ని కూడా అమలు చేయలేదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో రెండో విడత రైతు భరోసా కింద రూ.2,204.77 కోట్లను బటన్ నొక్కడం ద్వారా ఆయన రైతుల ఖాతాల్లో మంగళ వారం జమ చేశారు. అంతకుముందు జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతోందని, పెట్టుబడికి సకాలంలో నిధులు అందుతున్నాయని అన్నారు. '14 ఏళ్ల రాష్ట్రాన్ని పాలించానని చెప్పుకుంటున్న పెద్దమనిషికి ఈ ఆలోచన ఎందుకు రాలేదు?' అని ప్రశ్నించారు. 'టిడిపి పాలనలో స్కీముల్లేవు... అన్నీ స్కాములే' అని అన్నారు. స్కిల్ స్కామ్... ఇసుక స్కామ్, మద్యం స్కామ్ ఇలా స్కామ్‌లను ఆయన ప్రస్తావించారు. 'దోచుకోవడం, దాచుకోవడమే వారు పనిగా పెట్టుకున్నారు' అని విమర్శించారు. 'రాబోయే ఎన్నికలకు ముందు కూడా టిడిపి ముఠా మరోమారు మీ వద్దకు వస్తుంది. ప్రతి కుటుంబానికి కేజీ బంగారం, బెంజ్ కారు ఇస్తామంటూ మాయమాటలు చెబుతారు.వాటిని నమ్మి, మోసపోవద్దు.' అని అన్నారు. రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్న విమర్శలను ప్రస్తావిస్తూ టిడిపి ప్రభుత్వ హయాంలో కంటే ప్రస్తుత ప్రభుత్వంలో అప్పులు తక్కువే చేశామని వివరించారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులపై స్పందిస్తూ 'గత నాలుగేళ్లలో ఒక్కసారి కూడా కరువు రాలేదు. ఈ ఏడాది కొన్ని మండలాల్లో మాత్రమే కరువు ఉంది' అని చెప్పారు,. వైసిపి అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లలో రైతులకు అన్ని విధాలుగా అండగా నిలిచామన్నారు. టిడిపి హయాంలో ఐదేళ్లు కరువు ఉన్నప్పటికీ రైతులకు పంటల బీమా కింద రూ.3,400 కోట్లే ఇచ్చారన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో కరువు లేనప్పటికీ తమ ప్రభుత్వం రూ.7,802 కోట్లు పంటల బీమా ఇచ్చి రైతులను ఆదుకున్నామన్నారు. రైతు భరోసా, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ అన్నీ కలిపి ఈ నాలుగున్నరేళ్లలో రైతుల కోసం రూ.1.75 లక్షల కోట్లు ఖర్చు చేశామన్నారు. టిడిపి వ్యవసాయానికి రాత్రి, పగలు కలిపి కూడా తొమ్మిది గంటలు విద్యుత్ ఇవ్వలేక పోయిందన్నారు. తాము అధికారంలోకి వచ్చాక పగటి పూటే తొమ్మిది గంటలపాటు విద్యుత్‌ను వ్యవసాయానికి అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కాకాని గోవర్ధన్‌రెడ్డి, గుమ్మనూరు జయరాం, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉషశ్రీ చరణ్ శ్రీ, అనంతపురం, సత్యసాయి జిల్లాల ఎంపిలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు.

సిపిఎం నేతల ముందస్తు అరెస్టులు

పుట్టపర్తిలో సిఎం పర్యటన నేపథ్యంలో శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా సిపిఎం, ప్రజా సంఘాల నేతలను పోలీసులు ఎక్కడికక్కడే అక్రమంగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. సోమవారం రాత్రి నుంచే నాయకుల ఇళ్ల వద్దకు వెళ్లి అరెస్టులకు పాల్పడ్డారు. సిఎం పర్యటన అనంతరం వారిని విడుదల చేశారు. అక్రమ అరెస్టులపై సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

సత్యసాయి జిల్లాలో అసత్యాలా? 2

సిఎం ఉపన్యాసంపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు విమర్శ



చికిత్స చేసిన వైద్యులతో చంద్రబాబు

చంద్రబాబు కంటికి క్యాటరాక్ట్ సర్జరీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని ఎల్‌వి ప్రసాద్ ఆస్పత్రిలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు కుడికంటికి వైద్యులు క్యాటరాక్ట్ ఆపరేషన్ చేశారు. మూడు రోజుల క్రితం ఎల్‌వి ప్రసాద్ ఆస్పత్రి వైద్యులు చంద్రబాబుకు పరీక్షలు నిర్వహించి క్యాటరాక్ట్ సర్జరీకి సిఫార్సు చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం భువనేశ్వరితో కలిసి ఆయన ఆస్పత్రికి వచ్చారు. వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం సుమారు 40 నిమిషాల పాటు వైద్యులు సర్జరీ నిర్వహించారు. క్యాటరాక్ట్ ఆపరేషన్ విజయవంతంగా ముగిసినట్లు ఎల్‌వి ప్రసాద్ వైద్యులు తెలిపారు. సుమారు గంటసేపు అబ్జర్వేషన్‌లో ఉంచిన తర్వాత చంద్రబాబును డిశ్చార్జి చేశారు. ఆస్పత్రి నుంచి జూబ్లీహిల్స్‌లోని తన నివాసానికి ఆయన చేరుకున్నారు. బుధవారం మరోసారి ఆస్పత్రికి రావాలని వైద్యులు సూచించారు. మూడు నెలల క్రితం ఎడమ కంటికి కూడా ఎల్‌వి ప్రసాద్ ఆస్పత్రిలోనే ఆయనకు క్యాటరాక్ట్ ఆపరేషన్ చేయించుకున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్టై మధ్యంతర బెయిల్‌పై విడుదలైన చంద్రబాబు వైద్య పరీక్షల కోసం గత వారం హైదరాబాద్‌కు వచ్చారు. గచ్చిబౌలి ఎఐజి వైద్యులు చంద్రబాబుకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎఐజిలోనే ఆయన చర్మ సంబంధ చికిత్స తీసుకుంటున్నారు.

రాష్ట్రాభివృద్ధికి సాగే పోరులో కలసిరండి

- ఏపికి అన్యాయం చేసిన బిజెపికి ఆ మూడు పార్టీల భజన ఎందుకు?
- ప్రజారక్షణ భేరి సభలో ఎంఎ.గఫూర్ పిలుపు



ఒంగోలు సభలో మాట్లాడుతున్న గఫూర్

ప్రజాశక్తి- ఒంగోలు బ్యూరో, గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రానికి అన్ని విధాలా అన్యాయం చేసిన కేంద్రంలోని బిజెపికి వ్యతిరేకంగా సాగే పోరాటంలో అన్ని పార్టీలూ, ప్రజలు కలిసి రావాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే ఎంఎ.గఫూర్ పిలుపునిచ్చారు. అసమానతలు లేని సమాజం కోసం సిపిఎం చేపట్టిన ప్రజారక్షణ భేరిలో భాగంగా బస్సుయాత్ర మంగళవారం ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో సాగింది. ఆయా జిల్లాల సరిహద్దుల్లో బస్సుయాత్ర బృందానికి జిల్లా నేతలు, ప్రజలు సాదర స్వాగతం పలికారు. కొండపి, సంతనూతలపాడు, ఒంగోలు, అద్దంకి, నరసరావుపేట, సత్తెనపల్లిల్లో జరిగిన బహిరంగ సభల్లో ఆయన మాట్లాడారు. కేంద్రం రాష్ట్రానికి ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయకపోగా అదానీ, అంబానీలకు రాష్ట్ర సంపదను దోచిపెడుతోందని విమర్శించారు. కేంద్రం అన్ని రకాలుగా రాష్ట్రానికి అన్యాయం చేస్తోన్నా సిఎం జగన్‌గానీ, ప్రతిపక్ష నేత చంద్రబాబుగానీ నోరుమెదపకపోవడం శోచనీయమన్నారు. పవన్‌కల్యాణ్ తాను ఎన్‌డిఎ భాగమంటూ బిజెపికి భజన చేసుకుంటున్నారని విమర్శించారు. గత ఎన్నికల ముందు జగన్ ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. కొంతమంది ఎమ్మెల్యేలు, వారి అనుచరులు భూములను కాజేస్తున్నారని, ఇసుక, మట్టి అక్రమంగా తవ్వి అమ్ముకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కరువు తాండవం చేస్తుంటే ఎక్కడా సహాయక చర్యలు లేదన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి ఎండమావిగా మారిందని విమర్శించారు. 'రాజధాని లేదు. పరిశ్రమలు లేవు. రైల్వే జోను లేదు. పోలవరం, వెలుగొండ ప్రాజెక్టులు పూర్తి కాలేదు' అని అన్నారు. రాష్ట్ర అభివృద్ధిపై సిఎం జగన్‌కు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. రాష్ట్రంలో అధికారం కోసం జగన్, చంద్రబాబు కొట్లాడుతున్నారని, బిజెపికి మాత్రం భజన చేస్తున్నారని ఎద్దేవా చేశారు. పవన్‌కల్యాణ్ కూడా వారితో కలిసి రాష్ట్రాన్ని తాకట్టు పెడుతున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా రాష్ట్ర అభివృద్ధి కోసం బిజెపిపై సాగే పోరాటంలో కలిసి రావాలని కోరారు. వ్యవసాయ పనుల్లేక వివిధ జిల్లాల నుంచి వేల సంఖ్యలో పేదలు వలసలు పోతున్నారని తెలిపారు. ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వెళుతున్నా రాష్ట్రంలో కరువు లేదని మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. కరువు తీవ్రతగా ఉన్న జిల్లాల్లో ఎక్కడా మంత్రులు సమీక్షలు చేసిన దాఖలాలు లేవని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి మాట్లాడుతూ రాష్ట్రాన్ని అప్పుల్లోకి నెట్టారన్నారు. ఉపాధిగానీ, పరిశ్రమలుగానీ ఏ ఒక్కటీ లేవన్నారు. మద్యపాన నిషేధం అమలు చేశాకే ఓట్లు అడుగుతామన్న పెద్ద మనిషి సిఎం జగన్... ఇప్పుడు ఆ మిగతా 2లో

డ్రైవర్, డిఎం సస్పెన్షన్

- విజయవాడ బస్సు ప్రమాద ఘటనపై చర్యలు
- మానవ తప్పిదమే కారణమంటూ నివేదిక
- ఎడిఎంపై శాఖాపరమైన చర్య
- ఉద్యోగుల ఆగ్రహం

పంట అవశేషాలు తగలబెట్టొద్దు

- నాలుగు రాష్ట్రాలకు సుప్రీం ఆదేశం

పండుగలు చేసుకోండి.. పర్యావరణాన్ని దెబ్బతీయొద్దు

- బాణాసంచాపై సుప్రీం

తొలి దశ ప్రశాంతం

- మిజోరంలో 77.04 శాతం పోలింగ్
- ఛత్తీస్‌గఢ్‌లో పలు జిల్లాల్లో ఉద్రిక్తత



ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లా జగదల్‌పుర్‌లోని ఓ పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు వరుసకట్టిన మహిళలు

ఐజ్వాల్/రాయ్‌పుర్: ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తొలి దశలో మిజోరం, ఛత్తీస్‌గఢ్‌లలో భారీ పోలింగ్ జరిగింది. మిజోరంలోని మొత్తం 40 స్థానాలకు ఒకే విడతగాను, 90 స్థానాలున్న ఛత్తీస్‌గఢ్‌లో మొదటి విడతగా 20 స్థానాలకు మంగళవారం నిర్వహించిన పోలింగ్ చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. మిజోరంలో సాయంత్రం 5 గంటల వరకు 77.04 శాతం పోలింగ్ నమోదైంది. ఇక్కడ సెర్చిప్ జిల్లాలో రికార్డు స్థాయిలో 83.96 శాతం పోలింగ్ నమోదైనట్టు అధికారులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగినట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి లియాంజలా వెల్లడించారు. మొత్తం 40 స్థానాలకు ఒకే విడతలో పోలింగ్ నిర్వహించగా.. 174 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో సాయంత్రం 5గంల వరకు 70.87 శాతం పోలింగ్ నమోదైంది. భారీ స్థాయిలో భద్రతా బలగాలను మోహరించినప్పటికీ కొన్ని చోట్ల ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. సుక్మా జిల్లాలో నక్సలైట్లు జరిపిన కాల్పుల్లో నలుగురు భద్రతా సిబ్బంది గాయపడినట్టు పోలీసులు వెల్లడించారు.. ఖైరాగఢ్-చుయుఖదాన్- గండయి జిల్లాలో అత్యధికంగా 76.31శాతం పోలింగ్ నమోదైంది. అలాగే, అంబాగఢ్ చౌకి జిల్లాలో76శాతంబీ బస్తర్ (జగ్దల్‌పుర్)లో 72.41శాతం, కబీర్‌ధామ్ జిల్లాలో 72శాతం, కొండగాన్‌లో 75.35శాతం చొప్పున పోలింగ్ నమోదైంది. ఛత్తీస్‌గఢ్లో తొలి విడతలో పోలింగ్ జరిగే 20 స్థానాల్లో 223 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. రాష్ట్రంలో మొత్తం 90 శాసనసభ స్థానాలు ఉండగా.. మిగతా 70 స్థానాలకు ఈ నెల 17న పోలింగ్ జరగనుంది.

నకిలీ ఓట్లపై 'నాట్ బిఫోర్ మి'


- విచారణ నుంచి తప్పుకున్న జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రంలో నకిలీ ఓట్లపై సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్ మంగళవారం విచారణకు వచ్చింది. జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా విచారణ నుంచి తప్పుకున్నట్లు తెలిపారు. గతంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసినందున ఈ కేసు విచారణ నుంచి తప్పుకుంటున్నట్లు ఆయన ప్రకటించారు. రాష్ట్రంలో దొంగ ఓట్లపై మాజీ రాష్ట్ర ఎన్నికల కమిషనరు నిమ్మగడ్డ రమేష్ కుమార్ ఆధ్వర్యంలోని సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బిఆర్ గవాయి, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ కేసు విచారణ నుంచి తప్పుకుంటున్నట్లు జస్టిస్ మిశ్రా ప్రకటించారు. దీంతో సిజెఐ ఆదేశాలతో మరో ధర్మాసనం ముందు జాబితా చేయాలని రిజిస్ట్రీకి జస్టిస్ బిఆర్ గవాయి సూచించారు.

బీహార్‌లో 65 శాతానికి రిజర్వేషన్లు

- 10 శాతం ఇడబ్ల్యుఎస్ కోటా అదనం
- నితీష్ సర్కార్ కీలక నిర్ణయం



అసెంబ్లీలో మాట్లాడుతున్న బీహార్ సిఎం నితీష్ కుమార్

పాట్నా : రిజర్వేషన్ల విషయంలో ముఖ్యమంత్రి నితీష్ కుమార్ నేతృత్వంలోని బీహార్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో రిజర్వేషన్లు 65 శాతానికి పెంచాలని ప్రాతిపాదించింది. ప్రస్తుతం ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి, ఇబిసి వర్గాల వారి రిజర్వేషన్లు 55 శాతం ఉండగా, తాజాగా వాటిని 65 శాతానికి పెంచాలని నిర్ణయించింది. ఇది ఆర్థికంగా బలహీన తరగతులకు (ఇడబ్ల్యుఎస్) కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన 10 శాతం రిజర్వేషన్లకు అదనం. బీహార్ ప్రభుత్వం, కేంద్రం కల్పిస్తున్న రిజర్వేషన్లు కలిపి రాష్ట్రంలో మొత్తం రిజర్వేషన్లు 75 శాతానికి చేరుకోనుంది. దీనిపై నిపుణులతో సంప్రదింపుల తర్వాత అవసరమైన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి నితీష్ కుమార్ తెలిపారు. అయితే ఒబిసి మహిళలకు కేటాయించిన మూడు శాతం కోటాను రద్దు చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. తాజా ప్రతిపాదనల ప్రకారం.. షెడ్యూల్డ్ కులాలకు 20 శాతం, ఒబిసి, ఇబిసిలకు 43 శాతం రిజర్వేషన్ లభిస్తుంది. ప్రస్తుతం ఒబిసి, ఇబిసిలకు కలిపి 30 శాతం రిజర్వేషన్ ఉండగా.. తాజాగా మరో 13 శాతం పెరగనుంది. షెడ్యూల్డ్ తెగలు (ఎస్‌టి) వారికి 2 శాతం రిజర్వేషన్లను ప్రతిపాదించారు. దీంతో రాష్ట్రంలో రిజర్వేషన్లు 65 శాతానికి చేరుకుంటాయి. ప్రస్తుత ఇబిసిలకు 18 శాతం, ఒబిసిలకు 12 శాతం, ఎస్‌సిలకు 16 శాతం, ఎస్‌టిలకు ఒక శాతం రిజర్వేషన్లు ఉన్నాయి.

కులగణనకు సంబంధించిన నివేదికను బీహార్ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన కొన్ని గంటల్లోనే నితీష్ కుమార్ ప్రభుత్వం ఈ రిజర్వేషన్ల పెంపు నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఇక ఒబిసిల్లో యాదవులు అత్యధిక సంఖ్యలో ఉన్నారు. రాష్ట్ర జనాభాలో వారు 14.27 శాతం ఉన్నారు. కులగణన ప్రకారం.. బీహార్ 13 కోట్ల జనాభాలో 36 శాతం మంది ఇబిసిలు, 27.1 శాతం మంది వెనకబడిన తరగతులు, 19.7 శాతం మంది ఎస్‌సిలు, 1.7 శాతం ఎస్‌టి జనాభా, జనరల్ కేటగిరిలో 15.5 శాతం ఉన్నారు. దీని ప్రకారం రాష్ట్రంలో 60 శాతానికి పైగా ప్రజలు వెనకబడిన, అత్యంత వెనకబడిన తరగతులకు చెందినవారే ఉన్నారు.

(కులగణన వివరాలు 7వ పేజీలో)

రక్షణ నినాదం.. రణ చైతన్యం

విశాఖ ఉక్కు పోరాటానికి వెయ్యి రోజులు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

'విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు' ... ఇది కేవలం నినాదం కాదు. ఆంధ్రుల ఆత్మగౌరవ చిహ్నం! ఆనాడైనా ...ఈనాడైనా ఆంధ్రావనిని ఏకతాటిపై నిలిపి పోరాటానికి పదును పెట్టిన చైతన్యం!! వెయ్యిరోజులుగా విరామమెరుగక ఎగురుతున్న ప్రైవేటీకరణ వ్యతిరేక, ప్రభుత్వ రంగ పరిరక్షణ పతాకం! అవును ! ప్రజా పోరాటాల చరిత్రలోనే ఇదొక అద్భుత ఘట్టం! నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర బిజెపి ప్రభుత్వ నియంతృత్వ పోకడలపై ఐక్య కార్మిక వర్గం విశాల ప్రజానీకపు మద్దతుతో చేస్తున్న పోరాటం మంగళవారానికి వెయ్యి రోజులకు చేరుతోంది. 'ఎవడురా అమ్మేది?..ఎవడురా కొనేది' అని నినదిస్తూ 32 మంది ప్రాణత్యాగంతో ఏర్పాటైన విశాఖ ఉక్కును విశాఖ ఉక్కును తెగనమ్మాలన్న మోడీ సర్కారు కుట్రలను తిప్పికొట్టడానికి మరింత సమరశీల పోరాటానికి కార్మికులు సిద్ధమౌతున్నారు. 2021 జనవరి 27న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వంద శాతం వాటాల ఉపసంహరణతో స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తామంటూ చేసిన ప్రకటనపై భగ్గుమన్న స్టీల్‌ప్లాంట్‌లోని కార్మిక సంఘాలన్నీ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీగా ఏర్పడ్డాయి. ఐక్యంగా పోరాటాలు నిర్వహిస్తున్నాయి, వీటికి కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద ఏర్పాటు చేసిన శిబిరం పోరాట కేంద్రంగా నిలుస్తోంది. ఓ వైపు కార్మికుల పోరాటం సాగుతుండగా, మరోవైపు కేంద్రంలోని మోడీ సర్కారు స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తిని దెబ్బతీసేలా ఐరన్ ఓర్, గనులు ఇవ్వకుండా, ప్లాంట్‌లోని మూడో బ్లాస్ట్ ఫర్నేస్‌ను రెండేళ్లుగా మూసేసి కుట్రలు సాగిస్తోంది.



ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖలో అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెసి, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన సాగిన భారీ ర్యాలీ (ఫైల్)

అమ్మకం కమిటీలను తిప్పికొట్టిన కార్మికులు

అమ్మకం నిర్ణయం చేసిన తర్వాత మోడీ సర్కారు ప్లాంట్ అంచనా కోసం వేల్యుయేషన్ కమిటీని వేసి ప్లాంట్‌కు పంపగా కార్మికులు అడుగుపెట్టనివ్వకుండా తరిమికొట్టారు. 2021 నవంబర్ 10న కేంద్రం రెండు కమిటీలను వేసింది. హెలికాప్టర్‌లో ఈ కమిటీ సభ్యులు వచ్చి ప్లాంట్‌ను పరిశీలించాలని భావించారు. ఈ సందర్భంగా వందల మిగతా 2లో


పశ్చిమగోదావరి జిల్లా చించినాడ సభలో మాట్లాడుతున్న పి.మధు


అమలాపురంలో నాయకులకు వినతిపత్రాలను అందిస్తున్న వివిధ రంగాల కార్మికులు

సమగ్రాభివృద్ధికి వామపక్షాలే ప్రత్యామ్నాయం

ప్రజారక్షణ భేరి యాత్రలో వక్తలు

ప్రజాశక్తి - యంత్రాంగం

బిజెపికి రాష్ట్ర ప్రభుత్వం ఊడిగం చేస్తోందని, వారి ఆదేశాల మేరకు ప్రజలపై భారాలువేస్తోందని సిపిఎం సీనియర్ నేత, మాజీ ఎంపి పి.మధు విమర్శించారు. ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీలు బిజెపిని సమర్థిస్తున్నాయని అన్నారు. ప్రజా సమస్యలపై కమ్యూనిస్టులు నిరంతరం పోరాడుతారన్నారు. దేశ సమగ్రాభివృద్ధికి వామపక్షాలు మాత్రమే ప్రత్యామ్నాయమని తెలిపారు. సిపిఎం చేపట్టిన ప్రజారక్షణ భేరి బస్సు యాత్ర డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని మండపేట, రావులపాలెం, అమలాపురం, చించినాడ బ్రిడ్జి మీదుగా పశ్చిమగోదావరి జిల్లాలోకి ప్రవేశించింది. ఆ జిల్లాలోని యలమంచిలి, నరసాపురంలో యాత్ర కొనసాగింది. ఆయా చోట్ల యాత్రకు ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఇసుక ర్యాంపు కార్మికులు, కొబ్బరి ఒలుపు, దింపు కార్మికులు, యుటిఎఫ్ నాయకులు, అంగన్‌వాడీలు తమ సమస్యలపై యాత్ర బృందానికి వినతిపత్రాలు అందజేశారు.

యలమంచిలి మండలం చించినాడలో అమరవీరుల స్తూపం వద్ద యాత్ర బృందం నివాళులర్పించింది. అరుణ పతాకాన్ని మధు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మధు మాట్లాడుతూ.. బిజెపి పాలనలో నిత్యావసర, పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. మణిపూర్‌లో రెండు తెగల మధ్య వివాదం సృష్టించారని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం మాట్లాడుతూ.. పదేళ్ళ పాలించిన బిజెపి, నాలుగున్నరేళ్ళ పాలించిన వైసిపి రెండూ కలిసి రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేశాయన్నారు. అంబేద్కర్ సెంటర్‌లో జరిగిన సభలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కె.ధనలక్ష్మి తదితరులు మాట్లాడారు.

కోనసీమ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏం చేశాయి?


కోనసీమ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏం చేశాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం ప్రశ్నించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేట, రావులపాలెం, అమలాపురంలో జరిగిన బహిరంగ సభల్లో ఆయన మాట్లాడుతూ.. ఈ జిల్లాలో పొదల్లో తాచుపాముల్లా ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి ఉన్నాయని హెచ్చరించారు. ఈ ప్రాంతంలోని సహజ సంపదను పెట్టుబడిదారులకు దోచిపెట్టి, స్థానికులకు మొండి చేయి చూపుతున్నారన్నారు. పైప్‌లైన్ల ద్వారా రూ.180కే గ్యాస్ సరఫరా చేసే అవకాశం ఉన్నా ఆ దిశగా ప్రభుత్వాలు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర కమిటీ సభ్యులు ఆంద్ర మాల్యాద్రి మాట్లాడుతూ.. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల హక్కులను రాష్ట్ర ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులను సైతం పక్కదారి పట్టించిందని విమర్శించారు. సిపిఎం రాష్ట్ర నాయకులు ఎవి.నాగేశ్వరరావు, హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

మత విద్వేషాలతో పబ్బం గడుపుతోన్న కేంద్రం : లోకనాథం

మత విద్వేషాలను రెచ్చగొడుతూ బిజెపి ప్రభుత్వం పబ్బం గడుపుకుంటోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం విమర్శించారు. అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ... విభజన హామీలను కేంద్ర ప్రభుత్వం బుట్టదాఖలు చేసిందన్నారు. దీనిపై ప్రశ్నించాల్సిన వైసిపి అందుకు భిన్నంగా వ్యవహరిస్తోందని తెలిపారు. టిడిపి, జనసేన పార్టీలు తమ స్వప్రయోజనాల కోసం వైసిపితో పోటీపడి బిజెపికి మద్దతు పలుకుతున్నాయని విమర్శించారు. కొబ్బరి రైతులకు ప్రోత్సాహకం కరువైందని, ఆక్వా చెరువులతో కోనసీమ కలుషితమైందని అన్నారు. కోనసీమ రైల్వేలైను విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. ఇటీవల కాలంలో ఈ ప్రాంతంలో దళితులపై దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు.

దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.25 వేలు

- భూమిలేని ప్రతి పేదవానికీ రెండెకరాల భూమి, ఇల్లు పంపిణీ చేయాలి
- భూస్వాముల చేతుల్లో ఉన్న ఎల్‌టిఆర్ భూములను గిరిజనులకు ఇవ్వండి
- ప్రజారక్షణ భేరి యాత్రలో వి శ్రీనివాసరావు



జంగారెడ్డిగూడెం బహిరంగ సభలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

వర్షాల్లేక పంట నష్టపోయిన రైతులు, కౌలు రైతులకు ప్రభుత్వం ఎకరానికి రూ.25 వేలు నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజారక్షణ భేరి బస్సు యాత్ర ఏలూరు జిల్లాలో మంగళవారం రెండో రోజు ఉత్సాహంగా కొనసాగింది. ప్రతిచోటా జనం ఎదురొచ్చి హారతులిచ్చి బొట్లు పెట్టి స్వాగతం పలికారు. అంగన్‌వాడీలు, ఆశాలు, మెప్మాలు, ఉపాధ్యాయులు తమ సమస్యలపై యాత్ర బృందానికి వినతులు అందించారు. కొయ్యలగూడెంలో మొదలైన యాత్ర జంగారెడ్డిగూడెం, టి.నరసాపురం, లింగపాలెం, విజయరాయి మీదుగా జిల్లా కేంద్రం ఏలూరు వరకు సాగింది. ఈ సందర్భంగా పలు సభల్లో వి.శ్రీనివాసరావు మాట్లాడారు. ప్రభుత్వం రైతులకు అందిస్తోన్న రూ.13,500 రైతు భరోసా ఏ మాత్రమూ సరిపోదన్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల ప్రతి రైతు ఎకరానికీ రూ.25 వేల నుంచి రూ.50 వేల వరకు పెట్టుబడి అయిందని తెలిపారు. పంటలు దెబ్బతినడంతో రూపాయి కూడా తిరిగి రాలేదన్నారు. విద్యుత్ కోతలతో రైతులు సతమతమవుతున్నారని, ప్రభుత్వం ఆదుకోకపోగా విద్యుత్ ఛార్జీలు పెంచుతూ రైతులను పరోక్షంగా దోపిడీ చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో మంజూరు చేసిన కౌలు కార్డుల్లో అధిక శాతం భూస్వాములు బినామీల పేరుతో ఉన్నాయని, వారే రుణాలు పొందారని అన్నారు. కులాలకు అతీతంగా కౌలు రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని తెలిపారు. రాష్ట్రంలో పేదలకు చెందాల్సిన భూములను ఎంతమందికి పంచుతున్నారో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంతో భూస్వాముల ఆధీనంలో ఉన్న ఎల్‌టిఆర్ భూములను అర్హులైన గిరిజనులకు పంపిణీ చేయాలని కోరారు. ఎల్‌టిఆర్ భూముల కేసులను వెంటనే పరిష్కరించి ఆదివాసీలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ ప్రాంతాల్లో పోలీసు, రెవెన్యూ యంత్రాంగం చట్టాలను లెక్క చేయకుండా భూస్వాములతో కుమ్మక్కై పేదలకు అన్యాయం చేస్తోన్నా ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. రాష్ట్రంలో 25 లక్షల ఎకరాల ప్రభుత్వ భూములు పంపిణీకి అనువుగా ఉన్నాయని తెలిపారు. వాటిని పంచకుండా పేదలకు ప్రభుత్వం అన్యాయం చేస్తోందన్నారు. ప్రభుత్వ భూములను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు కంకణం కట్టుకుందని విమర్శించారు. ప్రతి పేద కుటుంబానికీ రెండెకరాల భూమి, ఇల్లు ఇవ్వడంతో పాటు విద్య, వైద్యం, ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. టి.నరసాపురం మండలంలో జరుగుతోన్న భూ పోరాటానికి సిపిఎం పూర్తి మద్దతు ఉంటుందన్నారు. ఎర్రకాలువ మిగులు భూములను పేదలకు పంచే వరకూ పోరాడుతామని తెలిపారు. రాష్ట్రంలో 80 శాతం పేదల భూములు అన్యాక్రాంతమయ్యాయన్నారు. తాము సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని పేదల పోరాడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు.

లక్షల ఎకరాలకు సాగునీరందించే చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పక్కకు పెట్టడం దారుణమన్నారు. ఈ పథకాన్ని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎర్ర కాలువ మిగులు భూముల విషయంలో ఎన్నికల ముందు చెప్పిన మాటలకు విరుద్ధంగా ప్రస్తుత ఎంఎల్‌ఎ, ఎంపిల తీరు ఉందని విమర్శించారు. పరిహారం అందుకున్న భూస్వాములకే మళ్లీ ఆ భూములు అప్పగించాలను కోరడం దారుణమన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓట్ల కోసం వచ్చే వీరిని ప్రజలు నిలదీయాలని కోరారు. భూముల కోసం పోరాడుతున్న వారిపై పోలీసులు బైండోవర్ కేసులు పెట్టి బెదిరించడం దారుణమన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సురేంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు, అశోక్, రాష్ట్ర నాయకులు ఎం.సూర్యనారాయణ, జిల్లా కార్యదర్శి ఎ.రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే అర్హత టిడిపికి లేదు

- మంత్రి జోగి రమేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అధికారంలో వున్నప్పుడు ప్రతిపక్షాలను వేధించిన టిడిపికి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే అర్హత లేదని గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి ముప్పు ఏర్పడిందని లోకేష్ గవర్నరుకు ఫిర్యాదు చేయడం దొంగే దొంగ అన్నట్లుగా వుందని విమర్శించారు. తమ పార్టీ ఎంపిలు, ఎమ్మెల్యేలను ప్రలోభాలతో లాక్కున్నప్పుడు ప్రజాస్వామ్యం గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. చంద్రబాబు ఆధారాలతో అడ్డంగా దొరికిపోయారు కాబట్టే అరెస్టయ్యారని ఆరోపించారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజ్‌భవన్‌లో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ 74వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు మంగళవారం జరిగాయి. ఈ కార్యక్రమానికి గవర్నరు జస్టిస్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరై భారత స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు రాష్ట్రస్థాయిలో ఇచ్చే 'రాజ్యపురస్కార్' అవార్డులను ఐదుగురు విద్యార్థులకు, ఇద్దరు గైడ్‌లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ కమిషనరు సురేష్‌కుమార్, పాఠశాల విద్యాశాఖ డైరెక్టరు కో-ఆర్డినేషన్ పి పార్వతి, జి భానుమూర్తి, ఎన్ శ్రీనివాసరావు, రజియాబేగం, శిక్షణ నిర్వాహకులు ఎం మోహన్‌రావు, ఎస్ ఉమాదేవి పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి సాగే పోరులో కలసిరండి

(మొదటి పేజీ తరువాయి)

పని చేస్తారా? అని ప్రశ్నించారు. కోనేరు రంగారావు కమిటీ సిఫార్సుల మేరకు ప్రతి పేద కుటుంబానికీ మూడు ఎకరాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర నాయకులు వి.కృష్ణయ్య, కె.ఉమామహేశ్వరరావు, ఎం.భాస్కరయ్య, డి.రమాదేవి, పూనాటి ఆంజనేయులు, జాలా అంజయ్య, ప్రకాశం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య, పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా ప్రజానాట్య మండలి కళాకారుల ప్రదర్శనలు, పాటలు ప్రజలను ఆకట్టుకున్నాయి.

మారణహోమాన్ని ఆపాలి

(మొదటి పేజీ తరువాయి)

మసీదును విభజించేందుకు యూదు దురహంకార ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. అక్రమ వలసలే ప్రాథమిక సమస్య అని పేర్కొంటూ, 1967కి ముందున్న సరిహద్దులతో తూర్పు జెరూసలెం కేంద్రంగా పాలస్తీనా రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి రాజా పిలుపునిచ్చారు. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు ప్రకాశ్ కరత్, సిపిఐ (ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, ఫార్వర్డ్ బ్లాక్ ప్రధాన కార్యదర్శి జి.దేవరాజన్, ఆర్‌ఎస్‌పీ నేత ప్రకాశరావు మాట్లాడారు. సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందాకరత్ తదితరులు పాల్గొన్నారు. జననాట్య మంచ్ కళాకారులు కళారూపాలు ప్రదర్శించారు.

సత్యసాయి జిల్లాలో అసత్యాలా?

సిఎం ఉపన్యాసంపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు విమర్శ

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

రైతు భరోసా బటన్ నొక్కుతూ పుట్టపర్తిలో మంగళవారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ఉపన్యాసం అసత్యాలతో, అతిశయోక్తులతో కూడి ఉన్నదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. ఏలూరు జిల్లా చింతలపూడిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఎనిమిది మంది సిపిఎం నాయకులను అక్రమంగా ముందస్తు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రతిపక్షాల వారినందరినీ అరెస్టు చేసి అధికార పార్టీ వ్యవహారంలాగా ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించడం అధికార దుర్వినియోగమే అవుతుందని, ప్రభుత్వ ఖర్చుతో పార్టీ ప్రచారం చేసుకోవడం అక్రమమని అన్నారు. బ్యాంకులకు దాదాపు వెయ్యి కోట్ల రూపాయలు డిఫాల్టు అయిన ఎమ్మెల్యేను పక్కన పెట్టుకొని అభివృద్ధి గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు.

కరువుపై కళ్లూ, చెవులూ మూసుకున్న ముఖ్యమంత్రి

ఒకవైపు పుట్టపర్తితో సహా రాష్ట్రంలో అత్యధిక భాగం కరువు కాటకాలతో తల్లడిల్లుతుంటే రాష్ట్రంలో కరువు లేదు సుభిక్షంగా ఉందని ముఖ్యమంత్రి చెప్పడం నీరో చక్రవర్తి తరహాలో ఉందని విమర్శించారు. 'ప్రభుత్వమే ఏడు జిల్లాల్లో 103 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించింది. పుట్టపర్తి చుట్టుపక్కల మండలాలు, పక్కనే ఉన్న అనంతపురం జిల్లాలో అత్యధిక మండలాలు కరువుతో అల్లాడుతున్నాయి. పంటలు ఎండిపోయాయి. తాగడానికి నీరు లేదు. 28 లక్షల ఎకరాల్లో ఈ సంవత్సరం పంట వేయలేదంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతోంది. కానీ, ముఖ్యమంత్రికి ఇవేమీ కనిపించడం లేదు. వినిపించడం లేదు' అని వ్యాఖ్యానించారు. రైతులకు తానేదో చాలా పెద్ద సహాయం చేస్తున్నట్టు రూ.13,500 అకౌంట్‌లో వేసి పండగ చేసుకోమనడం గర్హనీయమన్నారు. ప్రతి రైతు ఎకరాకు రూ.25 వేల నుండి రూ.50 వేల వరకు పంట నష్టపోయారని తెలిపారు. కృష్ణా, గోదావరి డెల్టాలోనూ ఖరీఫ్ పంట ఎండిపోయి ధాన్యం దిగుబడి తగ్గుతుందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారన్నారు.

రబీకి ఏం చేయాలో రైతులకు తోచడం లేదని తెలిపారు. విత్తనం నుండి అమ్మకం వరకు రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం ఆదుకుంటుందన్న ముఖ్యమంత్రి... రైతు భరోసా కేంద్రాలు నిర్వీర్యం అయ్యాయన్న వాస్తవాన్ని గుర్తించాలన్నారు. గిట్టుబాటు ధరలు లేక సంవత్సరానికి 50 వేల కోట్ల రూపాయలు రైతులు నష్టపోతున్నారని తెలిపారు. పక్కనే ఉన్న కేరళలో ధాన్యం రైతుకు క్వింటాలుకు రూ.800 అదనంగా బోనస్ ఇస్తున్నారన్నారు. మన రాష్ట్రంలో మద్దతు ధర కూడా అమలు కావడం లేదని తెలిపారు. మిల్లు యజమానులు రైతుల నుంచి అదనంగా కలెక్ట్ చేస్తున్న విషయం తెలిసి కూడా ప్రభుత్వం నిమ్మకునీరెత్తి వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ సంవత్సరం కరువు వచ్చి పంటలు ఎండిపోయి వేల కోట్ల రూపాయలు రైతులకు నష్టం జరిగిందన్నారు. ఈ వాస్తవాన్ని విస్మరించి తానేదో ఘనంగా రైతులను ఉద్ధరిస్తున్నానని చెప్పుకోవడం హాస్యాస్పదమని విమర్శించారు. ఇప్పటికైనా కరువు మండలాల్లో సహాయ కార్యక్రమాలను ప్రకటించి ప్రతి ఎకరాకూ రూ.25 వేలు చొప్పున పరిహారం అందించాలని, బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ అమలు చేయాలని కోరారు.

కౌలు రైతులకు అన్యాయం

ప్రత్యేకించి కౌలు రైతులకు ఎలాంటి సహాయమూ అందడం లేదని శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 25 లక్షల మంది కౌలు రైతులు ఉండగా, లక్షన్నర మందికే రుణాలు ఇచ్చారన్నారు. అందులో సగం బినామీ రుణాలేనని విమర్శించారు. కౌలు రైతుల పేరుతో భూ యజమానులే అన్ని సౌకర్యాలూ అనుభవిస్తున్నారని తెలిపారు. కౌలు రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని కనీసం మాటమాత్రంగా కూడా ఈ సభలో ముఖ్యమంత్రి ప్రస్తావించకపోవడం కౌలు రైతుల పట్ల ముఖ్యమంత్రి వివక్షతకు అద్దం పడుతోందన్నారు. యజమానులకు అనుకూలంగా చట్టాన్ని సవరించిన ముఖ్యమంత్రికి కౌలు రైతులకు జరుగుతున్న అన్యాయం తెలియదనుకోలేమని పేర్కొన్నారు. తక్షణం కౌలు రైతులకు ఇ-క్రాప్ చేసి అందరికీ భరోసా సహా కరువు సహాయం అందేటట్లు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పాలకు బోనస్ ఎక్కడ?

పాలకు నాలుగు రూపాయలు బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు అమూల్ ద్వారా కొనిపిస్తున్నా ఎక్కడా రైతుకు గిట్టుబాటు కావడం లేదని శ్రీనివాసరావు తెలిపారు. సహకార డెయిరీలను, సంఘాలను ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు. రైతుల ఆస్తులను అమూల్‌కు అప్పజెప్పి ఉద్ధరిస్తానని చెప్పడం అన్యాయమన్నారు.

విద్యుత్ కోతలతో ఎండిపోతున్న పంటలు

పగటిపూట తొమ్మిది గంటలు కరెంటు ఇస్తున్నామని చెబుతున్న ముఖ్యమంత్రికి విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోయి రోడ్డెక్కుతున్న రైతులు కనిపించడం లేదా? శ్రీనివాసరావు ప్రశ్నించారు.

డ్రైవర్, డిఎం సస్పెన్షన్

- విజయవాడ బస్సు ప్రమాద ఘటనపై చర్యలు
- మానవ తప్పిదమే కారణమంటూ నివేదిక
- ఎడిఎంపై శాఖాపరమైన చర్య
- ఉద్యోగుల ఆగ్రహం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో/విజయవాడ

విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్ స్టేషన్‌లో సోమవారం జరిగిన బస్సు ప్రమాదానికి సంబంధించి ముగ్గురిపై అధికారులు చర్యలు తీసుకున్నారు. బస్సు డ్రైవర్ వి.ప్రకాశం, ఆటోనగర్ డిపో అసిస్టెంట్ మేనేజర్ వివి లక్ష్మిలను సస్పెండ్ చేశారు. ఆటోనగర్ డిపో మేనేజర్ ప్రవీణ్‌కుమార్‌పై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. అంతకుముందు ఈ ప్రమాదానికి మానవ తప్పిదమే కారణమని విచారణ కమిటీ తేల్చింది. సంఘటన జరిగిన 24 గంటల్లోనే ఈ మేరకు నిర్ధారణకు వచ్చిన కమిటీ నివేదికను ఆర్‌టిసి ఎమ్‌డికి సమర్పించింది. డిప్యూటీ సిటిఎం ఎ జాన్ సుధాకర్, డిప్యూటీ సిఎంఇ సిహెచ్ జీవన్, డిప్యూటీ సిపిఎం కె శ్రీలక్ష్మిల ఆధ్వర్యంలోని విచారణ కమిటి సాంకేతిక అంశాలను పరిశీలించడంతో పాటు, ప్రత్యక్ష సాక్షులు, డ్రైవర్‌తో మాట్లాడిన అంశాల ఆధారంగా నివేదికను రూపొందించినట్లు పేర్కొన్నారు. డ్రైవర్ ప్రకాశం సరైన శిక్షణ తీసుకోకుండా బస్సు నడిపారని నివేదికలో పేర్కొన్నారు,. మొదటి గేర్‌లో బస్సు వుందనే అంశాన్ని ఆయన విస్మరించారని, బస్సును కదిల్చే సమయంలో రివర్స్ గేర్ వేసే బదులు, మొదటి గేర్‌లోనే యాక్సిలేటర్‌ను రైజ్ చేయడం వల్లే ప్రమాదం జరిగిందని నిర్ధారించారు. ఇప్పటికే డ్రైవర్‌పై కేసు నమోదు కాగా, విచారణ కమిటీ శాఖాపరమైన చర్యలతోపాటు కఠిన చర్యలకు సిఫార్సులు చేసింది. విధుల పర్యవేక్షణలో విఫలం అయ్యారని డిపో అసిస్టెంట్ మేనేజర్ వివి లక్ష్మిని సస్పెండ్ చేసి, డిపో మేనేజర్ ప్రవీణ్‌కుమార్‌పై చర్యలకు సిఫార్సులు చేశారు.

తప్పెవరిది...?

మరో మూడు నెలల్లో రిటైర్డ్ కాబోతున్న డ్రైవర్ వి ప్రకాశం మీదకు నెపం నెట్టేలా అధికారుల కమిటి ఇచ్చిన నివేదిక పట్ల ఆర్‌టిసి ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఆటోనగర్ బస్ డిపోలో దీర్ఘకాలంగా బెంగుళూరు సూపర్ లగ్జరి బస్సు డ్యూటీలు ఎలాంటి రిమార్కులు లేకుండా ఆయన చేసిన విషయాన్ని ఉద్యోగులు ప్రస్తావిస్తున్నారు. ఆయన్ను ఇటీవలే విజయవాడ, గుంటూరుల మధ్య తిరిగే ఎసి ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ బస్సుకు వేశారు. ఈ ఏడాది జులైలో 55 ఏళ్ల వయసు దాటిన డ్రైవర్లకు లాంగ్ సర్వీసులతో పాటు, ఇలాంటి ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ బస్సులకు వేయరాదని ఆర్‌టిసి యజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఉత్తర్వుల మేరకు డ్రైవర్ ప్రకాశం సర్వీసును స్థానికంగా పల్లెవెలుగు బస్సులకు మాత్రమే వాడాలి. మరో మూడు నెలల్లో రిటైర్ట్ కాబోతున్న ఆయన్ను పూర్తిస్థాయిలో శిక్షణ ఇప్పించకుండానే ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ బస్సు డ్యూటీకి వేశారు. ఈ విషయాన్ని విచారణ కమిటీ విస్మరించింది.

హాస్టల్ వార్డెన్ తీరుపై తల్లిదండ్రుల ఆగ్రహం

- ఆమె భర్తపై చర్యలు తీసుకోవాలని ఆందోళన
- పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు

ప్రజాశక్తి -ఖాజీపేట

వార్డెన్ భర్త హాస్టల్ విద్యార్థినుల పట్ల అసభ్య ప్రవర్తనపై, వార్డెన్ తీరుపై తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. దీంతో వార్డెన్ భర్తపై పోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు. కడప జిల్లా ఖాజీపేట మైదుకూరు రోడ్డులోని సాయిబాబా ఆలయం వెనుక ఉన్న బాలికల వసతి గృహ సంరక్షణ అధికారి బుక్కే మంగమ్మ తీరుపై విద్యార్థినుల తల్లిదండ్రులు మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె భర్త సుధాకర్ నాయక్ విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని హాస్టల్ ఎదుట వారు ఆందోళన చేపట్టారు. ఎస్‌ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎస్‌ఐతో విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ వసతి గహం పరిసరాల్లో వార్డెన్ భర్త ఎందుకుంటున్నారని ప్రశ్నించారు. వసతి గహాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఏమాత్రమూ లేదని తెలిపారు. సిసి కెమెరాలు ఏర్పాటు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులకు అందిస్తున్న మెనూ కూడా సక్రమంగా ఉండడం లేదని చెప్పారు. గతంలోనూ ఆయనపై పలు ఆరోపణలు వచ్చినా అధికారులు ఏమాత్రమూ చర్యలు తీసుకోలేదని వాపోయారు. వార్డెన్‌ను బదిలీ చేసి నూతన సంరక్షణ అధికారిని నియమించాలని కోరారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా జిల్లా ఉన్నతాధికారులు రక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు వార్డెన్ భర్త ప్రవర్తించిన తీరు పట్ల మైదుకూరు గ్రామీణ సిఐ శ్రీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో విచారణ జరుగుతుందన్నారు. కడప రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ మధుసూదన్ వసతిగృహానికి చేరుకొని విద్యార్థులను, వారి తల్లిదండ్రులను విచారించారు.

రక్షణ నినాదం.. రణ చైతన్యం

(మొదటి పేజీ తరువాయి)

సంఖ్యలో కార్మికులు తరలివచ్చి వారిని అడ్డుకున్నారు.

గోడమీద పిల్లిలా ఆ మూడు పార్టీలు

అధికార వైసిపి అసెంబ్లీలో తీర్మానం చేసి చేతులు దులుపుకుంది. ప్లాంట్ పరిరక్షణపై చొరవ ప్రదర్శించడం లేదు. టిడిపి, జనసేన పార్టీలకు బిజెపితో పొత్తులపై ఉన్న యావ విశాఖ ఉక్కు పరిరక్షణపై లేదు. దీంతో కార్మికులే పోరాటాన్ని ముందుకు నడుపుతున్నారు. వీరికి రైతాంగం మద్దతు తెలిపింది. సాధారణ ప్రజానీకం మద్దతుగా ఉంది. వామపక్ష శక్తులు అండగా నిలిచాయి.

కార్పొరేట్ మిత్రుల కోసమే..!

ఛత్తీస్‌గఢ్‌లోని నాగర్‌నార్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించడం లేదని అమిత్ షా ఇటీవల ప్రకటించారు. ప్రస్తుతం అక్కడ ఎన్నికలు జరగుతుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అదే సమయంలో విశాఖ ఉక్కు విషయంలో తన కార్పొరేట్ మిత్రుల ప్రయోజనాలే ముఖ్యంగా మోడీ సర్కారు వ్యవహరిస్తోంది. నాగర్‌నార్ స్టీల్ ఏటా కేవలం మూడు మిలియన్ టన్నుల ఉత్పత్తే చేస్తోంది. ఎన్‌ఎండిసి తన అవసరాల కోసం దీన్ని ఏర్పాటు చేసుకుంది. రూ.లక్షల కోట్లు విలువ చేసే భూములేవీ అక్కడ లేదు. కానీ, వైజాగ్ స్టీల్ ప్లాంటు దీనికి భిన్నం! 1960వ దశకంలో 32 మంది ప్రాణత్యాగంతో విశాఖ ఉక్కు ఏర్పాటైంది. అప్పటి నుండి ఇప్పటి వరకు ప్లాంటుకు సొంత గనులను కేంద్ర ప్రభుత్వం కేటాయించలేదు. అయినా, 2002 నుంచి 2008 వరకూ లాభాల్లోనే ఉంది. 2004 ఒక్క సంవత్సరంలోనే రూ.2800 కోట్లు రికార్డు స్థాయి లాభాలొచ్చాయి. 22 వేల ఎకరాలను కలిగిన స్టీల్‌ప్లాంట్ ఆస్తుల విలువ రూ.3.20 లక్షల కోట్లు పైమాటే. అందుకే తన కార్పొరేట్ మిత్రులకు దీనిని కట్టబెట్టాలని, తద్వారా అధికారంలో కొనసాగాలన్నది బిజెపి వ్యూహం! దానిని తిప్పికొట్టి, ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని కాపాడటమే కార్మిక పోరాట లక్ష్యం!

చంద్రబాబుపై చర్యలు తీసుకోబోం

- రింగ్‌రోడ్డు కేసులో హైకోర్టుకు ఎజి హామీ

ప్రజాశక్తి-అమరావతి

రాజధాని అమరావతి ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో నిందితుడైన టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడుపై చర్యలు తీసుకోబోమని సిఐడి తరఫున అడ్వకేట్ జనరల్ ఎస్ శ్రీరామ్ మంగళవారం హైకోర్టుకు హామీ ఇచ్చారు. అరెస్టుతోపాటు ఇతర తొందరపాటు చర్యలు తీసుకోమని ఇచ్చిన హామీని హైకోర్టు రికార్డుల్లో నమోదు చేసింది. స్కిల్ డెవలప్‌మెంటు స్కాం కేసులో అరెస్టయిన చంద్రబాబు వైద్యం నిమిత్తం మధ్యంతర బెయిల్ పొందిన నేపథ్యంలో రింగ్‌రోడ్డు కేసులో ఎలాంటి చర్యలు తీసుకోబోమని ఎజి చెప్పారు. దీంతో రింగ్‌రోడ్డు కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను ఈ నెల 21కి వాయిదా వేస్తున్నట్లు న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు ప్రకటించారు. రింగ్‌రోడ్డు కేసులో సిఐడి అధికారులు విజయవాడలోని ఎసిబి కోర్టులో పిటి వారెంటు విధానం ద్వారా తప్ప మరోమార్గంలో చంద్రబాబును అరెస్టు చేయబోమని ఎజి తెలియజేశారు. మధ్యంతర బెయిల్‌లో ఉన్న చంద్రబాబును అరెస్టు చేయబోమని చెప్పడంతో విచారణ వాయిదా పడింది.

ఇసుక కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వండి

- హైకోర్టులో చంద్రబాబు పిటిషన్

ప్రజాశక్తి-అమరావతి

ఇసుక విధానంలో లోపాలు కారణంగా ప్రభుత్వానికి భారీగా ఆర్థిక నష్టం చేకూరిందనే కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు హైకోర్టును ఆశ్రయించారు. ఇసుక ఉచిత విధానం పేరుతో అక్రమాలు జరిగాయంటూ గనులశాఖ డైరెక్టరు, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఎమ్‌డి వెంకటరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిఐడి నమోదు చేసిన కేసులో చంద్రబాబు రెండో నిందితుడిగా ఉన్నారు. చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్‌లో 'రాజకీయ వ్యవహారాలకు దూరంగా పెట్టాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం కుట్రపూరితంగా ఒక కేసు తర్వాత మరో కేసు బనాయిస్తోందన్నారు. న్యాయ విచారణ ప్రక్రియలో మునిగిపోయేలా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వ వేధింపుల ప్రక్రియకు తెర తీసిందన్నారు. టిడిపిని లక్ష్యంగా చేసుకుని తనను జ్యూడీషియల్ రిమాండ్‌లోనే కొనసాగేలా చేస్తోందన్నారు. అధికార వైసిపి సూచనల మేరకు సిఐడి నడుస్తోందన్నారు. ప్రభుత్వాలు తీసుకున్న విధాన నిర్ణయాలపై కేసులు నమోదు చెల్లదన్నారు. ఇసుక ఉచిత విధానం వల్ల ఏ సంస్థ ప్రయోజనం పొందిందో ఎఫ్‌ఐఆర్‌లో వివరించలేదన్నారు. వీటన్నిటినీ పరిగణనలోకి తీసుకుని ఇసుక కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని హైకోర్టును కోరారు. ఈ వ్యాజ్యాన్ని బుధవారం హైకోర్టు విచారణ చేయనుంది.



సమావేశంలో మాట్లాడుతున్న పొగాకు బోర్డు చైర్మన్ సిహెచ్ యశ్వంత్ కుమార్

పొగాకు ఉత్పత్తి లక్ష్యం142 మిలియన్ కిలోలు

- రైతులను ఆదుకునేందుకు కృషి
- పొగాకు బోర్డు చైర్మన్ సిహెచ్ యశ్వంత్ కుమార్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్రంలో పొగాకు ఉత్పత్తి లక్ష్యం 142 మిలియన్ కిలోలుగా నిర్ణయించినట్లు పొగాకు బోర్డు చైర్మన్ సిహెచ్ యశ్వంత్ కుమార్ తెలిపారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో రైతు సంఘాల నేతలతో ఆయన మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పొగాకు రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను రైతు సంఘాల నేతలు ఆయన దృష్టికి తెచ్చారు. దీనిపై యశంత్‌కుమార్ మాట్లాడుతూ.. గత ఏడాది పొగాకు రైతులకు అధిక లాభాలు వచ్చాయని, లోయర్ గ్రేడ్ పొగాకుకు సైతం మంచి ధరలు పలికాయని తెలిపారు. రానున్న రెండేళ్లలో పొగాకు పంట దిగుబడి ఆశాజనకంగా ఉంటుందన్నారు. కరోనా నేపథ్యంలో ఇతర దేశాలలో పొగాకు పంట తగ్గడంతో పొగాకు ఎగుమతులు పెరిగాయని, గత ఏడాది రూ.950 కోట్ల విదేశీమారక ద్రవ్యం బోర్డుకు సమకూరిందని తెలిపారు. ఈ ఏడాది రూ.1200 - రూ.1400 కోట్ల విదేశీ మారక ద్రవ్యం లభిస్తుందని ఆశిస్తున్నామని చెప్పారు. పొగాకు రైతులను అన్ని విధాలా ఆదుకోవటానికి బోర్డు ఎప్పుడు ముందు ఉంటుందన్నారు. పొగాకు వేలంలో ప్రముఖ కంపెనీలు పాల్గొనేలా చర్యలు తీసుకుంటామని, రైతులు పండించిన పొగాకుకు మంచి ధరలు వచ్చేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. హయ్యర్ గ్రేడ్‌తోపాటు లోయర్ గ్రేడ్ పొగాకు కూడా సరైన ధరలు లభించేలా చూస్తామని తెలిపారు. ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో రైతులు పండించే పొగాకుకు మార్కెటింగ్‌లో ఎదురయ్యే సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. పరిమితికి మించి పండించిన పొగాకుకు అపరాధ రుసుం విధించే విషయాన్ని ఆలోచిస్తామని తెలిపారు. అవుట్ సోర్సింగ్ ద్వారా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసే విషయాన్ని ఆలోచిస్తున్నామన్నారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా కొన్ని పంటలకు పరిహారం ఇస్తున్నారని, ఇందులో పొగాకు పంటను చేర్చే విషయమై కేంద్రానికి లేఖ రాస్తామన్నారు. వాతావరణ ఆధారిత బీమా పొగాకు పంటకు వర్తించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో పొగాకు బోర్డు సభ్యులు మారెడ్డి సుబ్బారెడ్డి, బోడపాటి బ్రహ్మయ్య, పి. ప్రసాద్, పమ్మి భద్రిరెడ్డి, కలిగిరి శ్రీకాంత్, భాస్కర్, కె.వెంకటేశ్వర్లు, వడ్డెళ్ళ ప్రసాద్, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కార్మిక, కర్షకులకు ఎర్రజెండా అండ

సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో అక్టోబరు విప్లవ పతాకావిష్కరణ



సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న తులసీరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
అక్టోబరు విప్లవం సాధించాక కార్మికులకు, పేదలకు అండగా ఎర్రజెండా నిలబడిందని, జార్ చక్రవర్తిని కూలదోసి కార్మిక రాజ్యాన్ని సాధించారని సిపిఎం సీనియర్ నాయకులు బిఆర్ తులసీరావు అన్నారు. అక్టోబరు విప్లవ 106వ వార్షికోత్సవం సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యాలయం వద్ద పార్టీ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కార్మికులు, కర్షకులు పేదరికంలో మగ్గిపోతూ, బానిసలుగా ఉండాలనే జార్ చక్రవర్తిని ఆ కార్మికులే సోవియట్ రష్యాలో కూలదోశారని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రపంచ మానవాళికి మార్గదర్శకులుగా సోషలిజం, కమ్యూనిజమే కార్మికులకు అండగా ఉంటుందని తెలిపారు. మాతృభూమి కోసం పోరాడుతున్న పాలస్తీనా ప్రజల మీద ఇజ్రాయిల్ సామ్రాజ్యవాదం దుర్మార్గంగా దాడి చేస్తోందని అన్నారు. సామ్రాజ్యవాదం ఉన్నంతకాలం అది ఎక్కడుంటే అక్కడ శాంతి, స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం ఉండదని పేర్కొన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం నూతన పార్లమెంటు భవన ప్రారంభోత్సవానికి దేశ ప్రథమ పౌరురాలికి కూడా ఆహ్వానం లేకుండా చేసిందని విమర్శించారు.

రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. సోషలిజానికి ప్రాధాన్యత లేదని పెట్టుబడిదారులు, పెట్టుబడిదారీ పత్రికలు విషప్రచారం, దుష్ప్రచారం చేస్తున్నాయని అన్నారు. తాత్కాలికంగా సోషలిజానికి ఎదురుదెబ్బలు తగిలినప్పటికీ సోవియట్ విప్లవ ఉత్సాహంతో, ప్రపంచ వ్యాపితంగా అనేక దేశాల్లో పెట్టుబడిదారీ, భూస్వామ్య వ్యవస్థలు కూల్చివేయబడ్డాయన్నారు. దేశంలో అరాచక పాలన సాగిస్తూ రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపిని ఒంటరిపాటు చేయాలని కోరారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు జె జయరామ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి మురళీకృష్ణ, కె స్వరూపరాణి, ఎం సూర్యారావు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తలపై అక్రమ కేసులు

- గవర్నరుకు లోకేష్ ఫిర్యాదు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
రాష్ట్రవ్యాప్తంగా ప్రజల తరపున పోరాడుతున్న, ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వారిపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నట్లు గవర్నరుకు తెలియజేశామని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తెలిపారు. జగన్ ప్రభుత్వం అరాచకం, కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని మంగళవారం రాజ్‌భవన్‌లో గవర్నరు అబ్దుల్ నజీర్‌ను లోకేష్, పలువురు టిడిపి నేతలు కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం లోకేష్ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో రాజ్యాంగాన్ని కాపాడాల్సిన బాధ్యత గవర్నరుపై ఉందన్నారు. మూడుసార్లు సిఎంగా పనిచేసిన చంద్రబాబుపై ఆధారాలు లేకపోయినా, 17ఎ పర్మిషన్ లేకపోయినా దొంగకేసులు పెట్టి జ్యుడీషియల్ రిమాండ్‌కు ఎలా పంపారో వివరించినట్లు చెప్పారు. గవర్నరును కలిసిన వారిలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, మాజీ మంత్రులు కొల్లు రవీంద్ర, పీతల సుజాత, ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి, మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర తదితరులు ఉన్నారు.

మెగా టికెట్ చెకింగ్ డ్రైవ్

- 3,484 మందిపై కేసులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో సీనియర్ కమర్షియల్ డివిజనల్ మేనేజరు వావిలపల్లి రాంబాబు ఆధ్వర్యంలో సోమ, మంగళవారాల్లో మెగా టికెట్ చెకింగ్ డ్రైవ్ నిర్వహించారు. చెకింగ్‌లో టికెట్ లేకుండా ప్రయాణిస్తున్న 3,484 మందిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేయడంతోపాటు వారి నుంచి రూ.24.5 లక్షలు అపరాధ రుసుం వసూలు చేశారు. రైల్వే సిబ్బంది 48 రైళ్లలో తనిఖీలు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇందులో ఒక్క విజయవాడ స్టేషన్‌లోనే 1,294 కేసులు నమోదు ద్వారా రూ.8.68 లక్షలు అపరాధ రుసుం వసూలు చేశారు.

ఆర్‌టిసి ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలి

- ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
విజయవాడ బస్ స్టాండులో జరిగిన సంఘటనను చూస్తే ఆర్‌టిసి ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని తెలుపుతోందని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రమాద ఘటనపై ఫెడరేషన్ తరపున సంతాపం ప్రకటించారు. చనిపోయిన ప్రమాణికులు, ఔట్‌సోర్సింగ్ కండక్టర్ కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కండక్టరు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, ఎంప్లాయిా కంపెన్సేషన్ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని, ఇఎస్ఐ, పిఎఫ్ నుంచి వచ్చే మొత్తాలను వారి కుటుంబాలకు ఇచ్చేలా ఆర్‌టిసి యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరారు.

ధాన్యం రవాణా ట్రాక్టర్లకు అమర్చే జిపిఎస్ ఖర్చు ప్రభుత్వమే భరించాలి

- ఎపి రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
ధాన్యం రవాణాకు సంబంధించి వాహనాలకు అమర్చే జిపిఎస్ పరికరాలకు ఒక్కోదానికి రూ.2,950 ఖర్చవుతుందని, ఆ మొత్తాన్ని ప్రభుత్వమే భరించాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. జిపిఎస్ పరికరం ఖర్చు మొత్తాన్ని వాహన యజమానులే భరించాలని అధికారులు చెబుతున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్‌రెడ్డి, కె శ్రీనివాస్ ఒక ప్రకటన విడుదల చేశారు. జిపిఎస్‌కు అయ్యే ఖర్చు వాహన యజమానులే భరించాలని అధికారులు చెబుతున్నారని, ఆ భారం మొత్తం రైతులపై పడుతుందని అన్నారు. గత సీజన్‌లో తగినన్ని వాహనాలు ఏర్పాటుచేయకపోవడంతో వర్షాలకు ధాన్యం కళ్ళాల్లో తడిచిపోయి రైతులు నష్టపోయారన్నారు. గత రెండు రోజులుగా కొన్ని జిల్లాల్లో వర్షాలు కురవడంతో కళ్ళాల్లో ధాన్యం తడిచిందని, వాటిని కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని, కొనుగోలు కేంద్రాలు తెరిచిన వెంటనే గోనె సంచులను రైతులకు అందించాలని కోరారు.

అనంతపురంలో కులదురహంకార హత్య?

ప్రజాశక్తి-గార్లదిన్నె (అనంతపురం జిల్లా)
అనంతపురం జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. వేరే సామాజిక తరగతికి చెందిన యువకుడిని ప్రేమించిందన్న ఆగ్రహంతో తల్లిదండ్రులే తమ కుమార్తెను హత్య చేశారు. ఈ సంఘటన గార్లదిన్నె మండలంలోని కోటంక గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల మేరకు... కోటంక గ్రామంలోని బిసి కురబ సామాజిక తరగతికి చెందిన కోమల (17) అదే గ్రామంలోని బిసి (గాండ్ల) సామాజిక తరగతికి చెందిన జి రమణ గత రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఈ విషయం కోమల ఇంట్లో తెలియడంతో తల్లిదండ్రులు అంజనమ్మ, ఎర్రితాతలు కుమార్తెను మందలించారు. ప్రేమ వ్యవహారం మానుకోవాలని హెచ్చరించారు. ఎన్నిసార్లు హెచ్చరించినా ప్రేమించిన వ్యక్తితోనే ఉండడానికి ఇష్టపడుతుండడంతో మంగళవారం సాయంత్రం కుమారుడు రాముతో కలిసి కుమార్తెను ఉరివేశారు. ఇదే విషయాన్ని వారు పోలీసుల వద్ద అంగీకరించి లొంగిపోయినట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది.

సిఎం జగన్ ఫొటోతో ఓటు కార్డు

- విచారణకు ఆదేశించిన కలెక్టర్

ప్రజాశక్తి-పెద్దదోర్నాల (ప్రకాశం జిల్లా)
ప్రకాశం జిల్లా, పెద్దదోర్నాల మండలం ఎగువ చెర్లోపల్లి ఓటరు లిస్టులో జగన్ ఫొటోతో ఓటు నమోదైంది. ఆ పంచాయతీలో 571 మంది పురుషులు, 512 మంది మహిళలు కలిపి మొత్తం 1063 మంది ఓటర్లుగా నమోదయ్యారు. అయితే 308 ఓటరుగా నమోదైన జనపతి గురవమ్మ పేరు ఉండగా ఆమె ఫొటో స్థానంలో ముఖ్యమంత్రి జగన్ ఫొటో ఉంది. గురవమ్మ కొత్తగా ఆన్‌లైన్ ద్వారా ఓటు నమోదు చేసుకున్నారు. ఆమె పరిధిలో బిఎల్ఓగా విఆర్ఓ ఉన్నారు. ఓటరు జాబితాలో ఆమె స్థానంలో జగన్ ఫొటోను చూసి గురవమ్మ కంగుతిన్నారు. ఇలా ఎందుకు జరిగిందని అధికారులను ప్రశ్నించారు.



తన ఫొటో స్థానంలో జగన్ ఫొటో చూపిస్తున్న ఓటరు, (ఇన్‌సెట్‌లో)జగన్ ఫొటోతో ఓటు ఉన్న దృశ్యం

తహశీల్దార్ వేణుగోపాల్‌కు ఆమె మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఇది కాస్తా సోషల్ మీడియా ద్వారా వైరల్ కావడంతో కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ జరిగిన తప్పిదంపై నివేదిక అందజేయాలని తహశీల్దార్ వేణుగోపాల్‌ను ఆదేశించారు. తహశీల్దార్ వేణుగోపాల్ మాట్లాడుతూ ఫొటో మార్పిడిపై జరిగిన తప్పిదాన్ని విచారించి జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేస్తానని తెలిపారు.

పెంకుటిల్లుకు రూ.1,05,352 కరెంట్ బిల్లు

ప్రజాశక్తి - పాడేరు టౌన్ (అల్లూరి సీతారామరాజు జిల్లా)
పెంకుటిల్లుకు రూ.లక్షకుపైగా బిల్లు రావడంతో ఓ గిరిజనుడు బెంబేలెత్తాడు. ఈ ఘటన అల్లూరి జిల్లాలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పాడేరు మండలం చింతగున్నలు గ్రామంలో మట్టితో నిర్మించిన చిన్న పెంకుటింటిలో పాంగి సుందరరావు కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నారు. ఆయన కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. అక్టోబరు నెలలో అతని ఇంటి కరెంట్ బిల్లు ఏకంగా రూ.1,05,352 వచ్చింది. ఇంత చిన్న పెంకుటింటికి అంత పెద్ద మొత్తంలో కరెంటు బిల్లు రావడమేంటని, బాధితుడు ఏం చేయాలో తెలియక సిపిఎం నాయకులను ఆశ్రయించారు. ఇదే విషయమై సిపిఎం నాయకులు 'ప్రజాశక్తి'తో కలిసి విద్యుత్ అధికారులను సంప్రదించేందుకు ప్రయత్నించగా వారు అందుబాటులో లేరు.



రూ. లక్ష కరెంట్ బిల్లు ఇదే

పాలస్తీనాది మత సమస్య కాదు, జాతుల సమస్య

- సదస్సులో ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి
పాలస్తీనా, ఇజ్రాయిల్‌ది మత సమస్య కాదని, దాన్ని జాతుల సమస్యగా చూడాలని ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు అన్నారు. 'పాలస్తీనా, ఇజ్రాయిల్ యుద్ధ పూర్వపరాలు' అనే అంశంపై ప్రపంచ శాంతి సమాఖ్య ఆధ్వర్యంలో కాకినాడలోని యుటిఎఫ్ హోమ్‌లో మంగళవారం సదస్సు జరిగింది. సమాఖ్య నాయకులు దూసర్లపూడి రమణరాజు అధ్యక్షతన జరిగిన సదస్సులో లక్ష్మణరావు ముఖ్యవక్తగా పాల్గొని ప్రసంగించారు. ప్రపంచంలో ఎక్కడ యుద్ధాలు జరిగినా దాని వెనుక అమెరికా సామ్రాజ్యవాదుల కుట్ర ఉంటుందన్నారు. పశ్చిమాసియాలో చమురు బావులపైన కన్నేసిన అమెరికా కంపెనీలు అక్కడ పాలస్తీనా, ఇజ్రాయిల్ మధ్య చిచ్చురేపుతోందని విమర్శించారు. పాలస్తీనా సమస్యకు నాడు బ్రిటన్ సామ్రాజ్యవాదం ఆజ్యం పోస్తే, నేడు అమెరికా దాన్ని పెంచి పోషించి ఆరని మంటగా మార్చిందన్నారు. పిఎల్ఓ వ్యవస్థాపకులు యాసర్ అరాఫత్ కాలంలో జరిగిన రెండు దేశాల గుర్తింపు ఒప్పందం అమలు కాకపోవడంతో తీవ్ర నష్టం జరిగిందని తెలిపారు. భావోద్వేగాల నుంచి పాలస్తీనాలో హమాస్ అనే సంస్థ పుట్టుకొచ్చిందన్నారు. ఇజ్రాయిల్‌పై దాడి చేసి అక్కడి ప్రజలకు ప్రాణనష్టం కలిగించడం తప్పిదమని పేర్కొన్నారు. దానిని ఆసరాగా చేసుకొని మొత్తం పాలస్తీనా ప్రజానీకంపై ఇజ్రాయిల్ దమనకాండ సాగించడం సహించరానిదని తెలిపారు. ప్రపంచమంతా పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా నిలిచిందన్నారు. మోడీ ప్రభుత్వం ఇజ్రాయిల్ దమనకాండకు వంతపాడడం, ఐక్యరాజ్య సమితిలో తటస్థ వైఖరి అవలంబించడంతో దేశం పరువు మంటగలిసిందని తెలిపారు. భారత ప్రభుత్వం మత రాజకీయాలు పక్కనపెట్టి పాలస్తీనా దేశ గుర్తింపుకు డిమాండ్ చేయాలని, పాలస్తీనా ప్రజానీకానికి సంపూర్ణ సాయం అందించాలని డిమాండ్ చేశారు. ప్రముఖ న్యాయవాది జవహర్ అలీ మాట్లాడుతూ పాలస్తీనాలో చిన్నారులు సైతం యుద్ధం కారణంగా మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జెవివి రాష్ట్ర గౌరవాధ్యక్షులు డాక్టర్ చెలికాని స్టాలిన్ మాట్లాడుతూ ప్రపంచశాంతి కోసం యువత ముందుకు రావాలని కోరారు. కాకినాడ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు, విశ్రాంత అధ్యాపకులు కట్టా కృష్ణారావు వక్తలను వేదికపై ఆహ్వానించగా, ఆర్‌టిఐ జెఎసి నాయకులు పి.దుర్గారమేష్ వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో ప్రపంచ శాంతి సమాఖ్య ఆర్గనైజర్లు పి.వరప్రసాద్, ఐ.సూర్యనారాయణ, టి.నాగేశ్వరావు, వి.రవికుమార్. పి.రామకష్ణ, టి.రాజా తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎంఎల్‌సి లక్ష్మణరావు



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

వైఎస్ఆర్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించండి

- అఖిలపక్ష రైతు సంఘాలు, వామపక్షాలు డిమాండ్
- కలెక్టరేట్ ఎదుట ఆందోళన

ప్రజాశక్తి - వైఎస్ఆర్ అర్బన్
వైఎస్ఆర్ జిల్లా కరువు కోరల్లో చిక్కుకుందని, కరువు జిల్లాగా ప్రకటించాలని అఖిలపక్ష రైతు సంఘాలు, వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. తొమ్మిదిన సిఎం పర్యటన సందర్భంగా ఈ ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఖరీఫ్ సీజన్ ముగిసేనాటికి 36 మండలాలలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, వేసిన పంటలు నిలువునా ఎండిపోతున్నాయని వాపోయారు. ఆందోళనకు మద్దతుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి. ఓబులేసు, సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షులు జి.శ్రీరాములు, అఖిలపక్ష రైతు సంఘం జిల్లా కార్యదర్శులు దస్తగిరిరెడ్డి, సుబ్బారెడ్డి, రమణ, శివారెడ్డి మాట్లాడారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేసి ఉంటే కొంతవరకైనా కరువును నివారించవచ్చుని, పాలకుల నిర్లక్ష్యం కారణంగా జిల్లాలో కరువు విలయతాండం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 103 కరువు మండలాలు ప్రకటిస్తే కడప జిల్లా నుంచి ఒక్క కరువు మండలం కూడా ప్రకటించకపోవడం దుర్మార్గమన్నారు. తీవ్ర వర్షాభావంతో పంటలు ఎండుతున్నాయని, సన్న, చిన్నకారు, మధ్యతరగతి రైతులు, కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మళ్లీ పంట వేసుకునేందుకు ఆర్థిక సాయం అందించాలని కోరారు. కరువు జిల్లాగా ప్రకటించే విధంగా రాష్ట్ర ప్రభుత్వంపై జిల్లా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ, బిఎస్‌పి, సిపిఐ ఎంఎల్ లిబరేషన్, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, కార్మిక, ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌విబిసి ఛైర్మన్ పదవీకాలం

- మరో ఏడాది పొడిగింపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ వెంకటేశ్వర భక్తి ఛానెల్ ఛైర్మన్ విబి సాయికృష్ణ యాచేంద్ర పదవీకాలాన్ని ప్రభుత్వం మరో ఏడాది పొడిగించింది. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులిచ్చింది. ఈ నెల 7 నుంచి 2024 నవంబరు 7 వరకు ఛైర్మన్ పదవిలో కొనసాగనున్నారు.

నిలువుమీదున్న పంటలకు నీరు

- ఉన్నతాధికారులకు సిఎస్ ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
రాష్ట్రంలో వర్షాభావం నెలకొన్న నేపథ్యంలో రాయలసీమ జిల్లాల్లో తాగునీరు, స్టాండింగ్ క్రాప్స్‌కు సాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను సిఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం వెలగపూడి సచివాలయంలో జలవనరులు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో సిఎస్ సమీక్షా సమావేశం నిర్వహించారు.

వర్షాభావ పరిస్థితులు నెలకొన్న అనంతపురం, సత్యసాయి, రాయలసీమ జిల్లాల్లో వివిధ స్టాండింగ్ క్రాప్స్‌ను కాపాడేందుకు అవసరమైన నీటి సరఫరాపై ఆయా జిల్లాల కలెక్టర్ల నుంచి వచ్చిన ప్రతిపాదనలపై చర్చించారు. పంటలను కాపాడేందుకు నీటి సరఫరాపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రానున్న రోజుల్లో తాగునీటికి ఇబ్బంది లేకుండా అవసరమైన గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేసేందుకు తగిన కార్యాచరణ సిద్ధం చేసి సమర్పించాలని తాగునీరు, మున్సిపల్ విభాగాల అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి రాజశేఖర్, ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్, ఇఎన్‌సి నారాయణరెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఎన్‌సి కృష్ణారెడ్డి, పిఆర్ ఇఎన్‌సి బాలూనాయక్ పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో కలెక్టర్ల పాత్ర కీలకం

కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ఈ నెల 15 నుంచి తొలి విడతగా చేపట్టనున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రచార కార్యక్రమాన్ని రాష్ట్రంలో విజయవంతం చేయడంలో జిల్లా కలెక్టర్లు కీలకపాత్ర పోషించాలని సిఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో ఇందుకు సంబంధించి ఏర్పాటైన రాష్ట్ర స్థాయి కమిటీ సమావేశంలో జవహర్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో యాత్ర ప్రారంభం అవుతుందని సిఎస్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి బి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

సంఘీభావం పోటెత్తాలి

'తక్షణమే కాల్పుల విరమణ', 'స్వతంత్ర పాలస్తీనా', 'స్వేచ్ఛా గాజా' వంటి నినాదాలు అమెరికా, బ్రిటన్, జర్మనీ వంటి పశ్చిమ దేశాలతో సహా ప్రపంచ వ్యాపితంగా హోరెత్తుతున్నాయి. వారాంతంలో వేలాది మందితో పాలస్తీనా సంఘీభావ ర్యాలీలు జరుగుతున్నాయి. భారత్‌లో మితవాద మోడీ ప్రభుత్వ నిర్బంధాన్ని ఎదిరించి ఈ సంఘీభావ ర్యాలీలు ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్నాయి. అమెరికా, ఇండియా రక్షణ, విదేశాంగ మంత్రుల (2+2) సమావేశం కోసం భారత్ వచ్చిన అమెరికా మంత్రులకు నిరసన సెగ గట్టిగా తగిలేలా ఈ మూడు రోజులు దేశ వ్యాపిత నిరసనలకు వామపక్షాలు పిలుపునివ్వడం ముదావహం.

గత నెలరోజులుగా యుద్ధట్యాంక్‌లు, ఫిరంగులు, యుద్ధ విమానాలు, యుద్ధ నౌకలను వెంటనిడుకుని ఇజ్రాయిల్ సేనలు సాగిస్తున్న కార్పెట్ బాంబింగ్‌లో 4,000 మందికిపైగా పిల్లలు, 2,500 మంది దాకా మహిళలు, 500 మంది వృద్ధులతో సహా 10,000 మంది పాలస్తీనీయులు మరణించారు. అంటే మొత్తం మరణాల్లో 70 శాతం దాకా అమాయక పౌరులేనన్నది స్పష్టం. మరో 30,000 మంది గాయపడ్డారు. తాగునీరు, ఆహారం, మందులు, విద్యుత్‌ను బంద్ చేసిన ఇజ్రాయిల్ అమానుషత్వానికి ఆకలితో మరింత మంది బలికానున్నారు. 3,50,000 మంది సాయుధ రిజర్వు దళాలతో గాజాలోని పౌర ఆవాస ప్రాంతాలను, స్కూళ్లు, ఆసుపత్రులు, మసీదులను ఇజ్రాయిల్ ధ్వంసం చేస్తోంది. గాజాను సర్వనాశనం చేసేందుకు అణు బాంబు ప్రయోగించే విషయం కూడా పరిశీలిస్తున్నామని యూదు దురహంకార మంత్రి అమిచాయ్ ఎలియాహ్ చేసిన బెదిరింపులు నెతన్యాహు ప్రభుత్వ ఫాసిస్టు పోకడలు మానవాళికే విపత్తుగా పరిణమించనున్నాయి. ఈ పాపంలో అమెరికాకు వాటా ఉంది. ఇజ్రాయిల్‌కు వందలకోట్ల డాలర్ల మారణాయుధాలు సమకూరుస్తూ, రెండు దేశాల ఏర్పాటు పరిష్కారాన్ని తుంగలో తొక్కుతున్నది. గాజా నుంచి పాలస్తీనీయులను ఈజిప్టుకో, ఇతర ఎడారి ప్రాంతాలకో పూర్తిగా తరిమేసి దానిని పూర్తిగా ఆక్రమించేలా ఇజ్రాయిల్‌ను ఎగదోస్తున్నది. అమెరికా విదేశాంగ మంత్రి పాలస్తీనా అధ్యక్షుడు మహ్మద్ అబ్బాస్‌తో తాజాగా జరిపిన భేటీలో గాజా నుంచి హమాస్‌ను పూర్తిగా తరిమేసిన తరువాత అక్కడ పాలస్తీనా అథారిటీ పాత్ర గురించి చర్చించినట్లు వార్తలొచ్చాయి. నేడు గాజా, రేపు వెస్ట్‌బ్యాంక్. ఇదీ అమెరికా, ఇజ్రాయిల్ దుష్ట పన్నాగం. ప్రపంచ ప్రజానీకం అంతా వ్యతిరేకిస్తున్నా ఈ ఆధిపత్య శక్తులు పాలస్తీనాకు వ్యతిరేకంగా తమ కుట్రలు నిరంతరం సాగిస్తూనే ఉన్నాయి. దాడి జరిగిన వెంటనే ఆగమేఘాల మీద అక్కడికి వెళ్లిన అమెరికా అధ్యక్షుడు బైడెన్, బ్రిటన్ ప్రధాని సునాక్, జర్మనీ ఛాన్సలర్ షుల్జ్ తదితరులు ఇజ్రాయిల్‌కు వత్తాసు పలికారు. కాల్పుల విరమణ పిలుపును తిరస్కరిస్తున్న వారి సరసన మోడీ కూడా చేరడం దారుణం. కాల్పుల విరమణ పాటించాలని, పౌరులందరికీ రక్షణ కల్పించాలని, తక్షణమే మానవతా సాయం చేయాలని ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ చేసిన తీర్మానంపై ఓటింగ్‌కు భారత్ గైర్హాజరైంది. ఇప్పుడీ 2+2 సమావేశం పేరుతో అమెరికా అనుకూల, ఇజ్రాయిల్‌ను సమర్థించే విధానాన్ని పచ్చిగా ముందుకు తీసుకెళ్లేందుకు మోడీ ప్రభుత్వం యత్నిస్తున్నది. అమెరికాతో సహవాసం చేసిన ఏ దేశమూ బాగుపడలేదు. తనకు సాంకేతికపరంగా ఎక్కడ పోటీ వస్తుందోనని మిత్రదేశమైన జపాన్‌ను అది తొక్కిపడేసింది. అటువంటి అమెరికాకు జూనియర్ భాగస్వామిగా భారత్ మారడం భారత దేశ ప్రయోజనాలకే విఘాతం. మోడీ ఏలుబడిలో 2018 నుంచి అమెరికా, ఇండియా విదేశాంగ, రక్షణ మంత్రుల మధ్య (2+2) సమావేశాలు ఏటా జరుగుతున్నాయి. మంగళవారం నుంచి మూడు రోజుల పాటు జరిగే ఈ సమావేశం సందర్భంగా గాజాలో పశ్చిమ దేశాల అండతో ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణకాండకు వ్యతిరేకంగా పెద్దయెత్తున ఉద్యమించాలి. స్వతంత్ర పాలస్తీనా ఏర్పడకుండా ఇజ్రాయిల్ భద్రత, శాంతి ఉండదనే విషయాన్ని మరోసారి చాటి చెప్పాలి. అంతర్జాతీయ సంఘీభావ ఉద్యమాన్ని బలోపేతం చేయడం ద్వారా పశ్చిమాసియాలో యూదు దురహంకార ఇజ్రాయిల్‌కు, దానికి మద్దతు ఇస్తున్న అమెరికా, ఇతర పశ్చిమ దేశాల కుట్రలను తిప్పికొట్టాలి.

మహనీయుని మాట




జబ్బులకు మూలం అపరిశుభ్రత. మన శరీరం పట్ల, పరిసరాల పరిశుభ్రత పట్ల శ్రద్ధ వహించినట్లయితే... చాలా రోగాలు దరిచేరవు.

- డా॥ జోసెఫ్ లిస్టర్,
ప్రముఖ శస్త్ర వైద్య నిపుణుడు, ఇంగ్లండు.

Joseph Lister

ప్రజా ప్రస్థానం

అమెరికా - చైనా వైరుధ్యం





ప్రభాత్ పట్నాయక్

పశ్చిమ దేశాలలోని కమ్యూనిస్టేతర వామపక్షాలు అమెరికాకు, చైనాకు నడుమ నెలకొన్న శత్రుత్వాన్ని రెండు సామ్రాజ్యవాద దేశాల మధ్య వైరుధ్యంగా పరిగణిస్తున్నాయి. ఆ విధంగా పరిగణించడం ద్వారా అవి తమ సైద్ధాంతిక దృక్కోణాన్ని మూడు విధాలుగా సమర్థించుకుంటున్నాయి. మొదటిది: అమెరికాకు, చైనాకు నడుమ వైరుధ్యం ఎందుకు పెరుగుతోందో వివరించగలుగుతున్నాయి. రెండవది: అందుకోసం అవి లెనినిస్టు అవగాహనను లెనినిస్టు సిద్ధాంత చట్రంలో ఉపయోగిస్తున్నాయి. మూడవది: చైనా ఒక ఎదుగుతున్న సామ్రాజ్యవాద దేశంగా విమర్శించడం ద్వారా చైనాలో ఒక పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ నిర్మాణం జరుగుతోందన్న తమ అతి-వామపక్ష (అల్ట్రా-లెఫ్ట్) విమర్శను సమర్థించుకుంటున్నాయి.

ఈ తరహా విమర్శ ద్వారా ఆ వామపక్ష శక్తులు తెలిసో, తెలియకో చైనాకు వ్యతిరేకంగా అమెరికన్ సామ్రాజ్యవాదం సాగిస్తున్న కుట్రలకు తోడ్పడుతున్నాయి. అమెరికా, చైనాలు రెండూ సామ్రాజ్యవాద దేశాలే గనుక వాటిలో ఒకదానికి వ్యతిరేకంగా రెండో దేశాన్ని బలపరచడంలో అర్థం లేదన్న నిర్ధారణకు వారి వాదనలు దారి తీస్తాయి. ఇంకాస్త దారి తప్పితే ఆ రెండు దేశాల్లోనూ తక్కువ ప్రమాదకారిగా ఉన్న అమెరికాను సమర్థించి చైనాను వ్యతిరేకించడానికి కూడా దారి తీయవచ్చు. ఏ విధంగా చూసినా ఆ వైఖరి చైనా విషయంలో అమెరికా అవలంబిస్తున్న దూకుడును వ్యతిరేకించాల్సింది పోయి, గందరగోళ పరుస్తున్నది. ఇప్పుడు ఈ రెండు దేశాలూ అనేక వర్తమాన పరిణామాలపై పరస్పరం తలపడుతున్నాయి. ఆ సందర్భాలలో అమెరికన్ సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించే వైఖరి తీసుకునే బదులు మౌనం వహించడానికి దారి తీస్తుంది.

పశ్చిమ దేశాల సామ్రాజ్యవాద శక్తులను మామూలుగా వ్యతిరేకించే వామపక్షాలు (పశ్చిమ దేశాల లోనివి) సైతం ఆ సామ్రాజ్యవాదం తీసుకుంటున్న చర్యలను సమర్థిస్తున్న సందర్భాలు ఉన్నాయి. స్లోబోడెన్ మిలోసెవిచ్ సెర్బియాను పరిపాలిస్తున్నప్పుడు ఆ దేశంపై బాంబుల దాడికి సామ్రాజ్యవాదులు పూనుకున్నప్పుడు ఆ విధంగానే సమర్థించారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఉక్రెయిన్ యుద్ధంలో కూడా ఉక్రెయిన్‌కు నాటో దేశాల మద్దతును సమర్థిస్తున్నారు. దిగ్భ్రమ గొలిపే విధంగా గాజాలో పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ సామ్రాజ్యవాదుల మద్దతుతో కొనసాగిస్తున్న మానవ హననాన్ని వాళ్ళు వ్యతిరేకించడంలేదు. చైనా విషయంలో సామ్రాజ్యవాదులు అనుసరిస్తున్న దూకుడు విషయంలో పశ్చిమ దేశాల వామపక్ష శక్తుల వైఖరి పెద్దగా భిన్నంగా లేకపోవడం కూడా ఈ ధోరణిలో అంతర్భాగమే.

సంపన్న పెట్టుబడిదారీ దేశాలలో శ్రామికవర్గపు ధోరణులకు, వారి ప్రయోజనాలకు అక్కడి వామపక్ష శక్తులు సామ్రాజ్యవాదం విషయంలో అనుసరిస్తున్న వైఖరి పూర్తి భిన్నంగా ఉంది. అక్కడి కార్మికవర్గం ఉక్రెయిన్‌లో నాటో కొనసాగిస్తున్న పరోక్ష యుద్ధాన్ని చాలా గట్టిగా వ్యతిరేకిస్తోంది. ఉక్రెయిన్‌లో ఉపయోగించడానికి ఉద్దేశించిన ఆయుధాలను ఓడలకు ఎక్కించడానికి యూరోపియన్ కార్మికులు వ్యతిరేకించారు. ఆ వ్యతిరేకత అంత ఆశ్చర్యం కలిగించేది కాదు. ఎందుకంటే, ఉక్రెయిన్ యుద్ధం కారణంగా యూరప్‌లో ద్రవ్యోల్బణం తీవ్రంగా పెరిగి అక్కడి కార్మికుల మీద తీవ్రమైన ప్రభావాన్ని చూపించింది. ఆ యుద్ధాన్ని అక్కడి వామపక్షాలు వ్యతిరేకించకపోవడంతో ఆ కార్మికులు చాలామంది ఇప్పుడు మితవాద ప్రతిపక్ష పార్టీల వైపు సానుకూలతను ప్రదర్శిస్తు న్నారు. ఈ మితవాద పార్టీలు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకమేమీ కాదు. కాని అవి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అధికార పార్టీని విమర్శిస్తూంటాయి (ఇటలీలో మెలనీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అదే మాదిరిగా చేశాడు. అధికారం లోకి రాగానే సామ్రాజ్య వాదాన్ని పూర్తిగా బలపరుస్తున్నాడు.). ఈ పరిస్థితులలో పశ్చిమ దేశాల్లో వామపక్ష శక్తులు సామ్రాజ్య వాదం పట్ల మెతకగా వ్యవహరించడం వలన అక్కడి రాజకీయ బలాబలాలు మితవాదం వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నాయి.

చైనా ఒక పెట్టుబడిదారీ దేశం అని, అందుచేతనే ప్రపంచవ్యాప్తంగా తన సామ్రాజ్యవాద కార్యకలాపాలను విస్తరించే క్రమంలో అమెరికాతో వైరం పాటిస్తోందని భావిస్తున్నవారు "పెట్టుబడిదారీ" అంతా "చెడ్డది" అని, "సోషలిస్టు" అంతా "మంచిది" అని కలగాపులగం చేస్తున్నారు. "నా దృష్టిలో సోషలిజం అనేది ఏ విధంగా ఉంటుందో (అది ఒక ఆదర్శప్రాయమైన దృష్టి) ఇప్పుడు కొన్ని విషయాలలో చైనాలో అందుకు భిన్నంగా జరుగుతోంది గనుక చైనా సోషలిస్టు దేశం కాజాలదు. కనుక చైనా పెట్టుబడిదారీ దేశమే" అనే విధంగా వారి అభిప్రాయం ఉంటుంది. "పెట్టుబడిదారీ", "సోషలిస్టు" అనే పదాలకు నిర్దిష్టమైన అర్థాలు ఉన్నాయి. నిర్దిష్టమైన గతిసూత్రాలతో అవి ముడిపడి వున్నాయి. కొన్ని మౌలిక ఆస్తి సంబంధాలలో అవి వేళ్ళూనుకుని ఉన్నాయి. చైనాలో పెట్టుబడిదారీ రంగం గణనీయంగా ఉందన్నమాట నిజం. అంటే అక్కడ కొన్ని పెట్టుబడిదారీ ఆస్తి సంబంధాలు ఉన్నాయి. ఐతే చైనా ఆర్థిక వ్యవస్థలో అత్యధిక భాగం ప్రభుత్వ ఆధీనంలో ఉంది. అదంతా కేంద్రీకృతంగా నిర్దేశించబడుతోంది. అందుచేత "సద్యోజనిత" (స్పాంటేనియస్) స్వభావంతో స్వయంచలితంగా ఉండే పెట్టుబడిదారీ ధోరణిలోకి అది జారిపోకుండా ఉంచుతోంది. చైనా ఆర్థిక వ్యవస్థలో, అక్కడి సమాజంలో జరుగుతున్న వాటిలో చాలా అంశాలను ఎవరైనా విమర్శించవచ్చు. కాని అది మొత్తంగా పెట్టుబడిదారీ వ్యవస్థ అని నిర్ధారించి, అందుచేతనే సామ్రాజ్యవాదులతో సరిసమానంగా తానూ అదే తరహాలో వ్యవహరిస్తోందని చెప్పడం సత్యదూరం ఔతుంది. అది విశ్లేషణ పరంగా పొరపాటు మాత్రమే కాదు. ఆచరణలో అటువంటి అవగాహన అటు సంపన్న పెట్టుబడిదారీ దేశాలలో, ఇటు మూడవ ప్రపంచ దేశాలలో ఉన్న కార్మికవర్గ ప్రయోజనాలకు భిన్నమైన దిశలో కార్యాచరణకు దారి తీస్తుంది.

ఐతే ఇక్కడ ఒక ప్రశ్న వెంటనే ఉత్పన్నమౌతుంది. అమెరికా-చైనాల నడుమ వైరుధ్యం రెండు సామ్రాజ్యవాద దేశాల నడుమ ఉండే వైరుధ్యం కాకపోతే, ఇటీవల కాలంలో అది అంత ప్రముఖంగా ఎందుకు ముందుకొచ్చింది? దీనిని తెలుసుకోవాలంటే మనం రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన వెనువెంటనే ఉన్న కాలానికి వెళ్ళాలి. ఆ యుద్ధంలో పెట్టుబడిదారీ వ్యవస్థ బాగా బలహీనపడింది. తన ఉనికే కొనసాగదేమో అన్నంత వాతావరణం ఏర్పడింది. సంపన్న పెట్టుబడిదారీ దేశాల్లోని కార్మికవర్గం యుద్ధానికి ముందున్న భారీ స్థాయి నిరుద్యోగాన్ని గాని, దారిద్ర్యాన్ని గాని భరించడానికి ఇప్పుడు సిద్ధంగా లేదు. మరోపక్క సోషలిజం ప్రపంచ వ్యాప్తంగా ఎంతో పురోగమించింది. వలస, అర్ధవలస పాలనకు వ్యతిరేకంగా మూడో ప్రపంచదేశాల్లో విముక్తి పోరాటాలు తారా స్థాయికి చేరాయి. తన మనుగడను

> **ఇప్పుడు అమెరికా తన ఆర్థిక వ్యవస్థను చైనా, తదితర దేశాల నుండి వచ్చిపడే దిగుమతుల నుండి రక్షించుకోవాలని చూస్తోంది. ఇప్పటిదాకా, ఈ దిగుమతుల వెనక ప్రధాన పాత్ర అమెరికన్ పెట్టుబడిదే. ఐనప్పటికీ, అవి అదే మాదిరిగా కొనసాగితే అమెరికాలోని పరిశ్రమలు మూతబడక తప్పదు. మొదట్లో చైనాలో చేపట్టిన "ఆర్థిక సంస్కరణలను" చాలా గొప్పగా శ్లాఘించిన అమెరికా ఇప్పుడు చైనా "తోక కత్తిరించాలని" మాట్లాడుతోంది.**

నిలుపుకోవడం కోసం పెట్టుబడిదారీ వ్యవస్థ చాలా రాయితీలు ఇవ్వక తప్పలేదు. సార్వత్రిక వయోజన ఓటు హక్కు, ప్రభుత్వ సంక్షేమ చర్యలు, మార్కెట్‌లో కొనుగోలు శక్తిని నిలబెట్టడం కోసం ప్రభుత్వ ప్రత్యక్ష జోక్యం, అన్నింటికీ మించి వలస దేశాల రాజకీయ స్వాతంత్ర్యాన్ని అంగీకరించడం జరిగాయి.

రాజకీయంగా వలస విధానం అంతం అయిందంటే దానర్థం ఆర్థికంగా వలసాధిపత్యం ముగిసిందని కాదు. అంతవరకూ సంపన్న పెట్టుబడిదారీ దేశాల పెత్తనం కింద ఉన్న మూడో ప్రపంచ దేశాల వనరుల మీద అదుపు కొత్తగా స్వతంత్రం పొందిన దేశాలకు దక్కిందని అనుకోరాదు. నిజానికి అటువంటి పెత్తనం కోసం పోరాడిన ఆర్బెంజ్, మొస్సాదె, అలెండీ, చెడ్డీ జగన్, లుముంబా తదితర నేతల నాయకత్వాలలోని ప్రభుత్వాలను కూలదోసేవరకూ సామ్రాజ్యవాదం చాలాకాలం పాటు తీవ్ర స్థాయిలో పోరాడుతూనే వుంది. ఐనా, కొత్తగా స్వతంత్రం పొందిన దేశాల ఆధీనంలోకి ఆ యా దేశాల వనరుల మీద ఆధిపత్యం పోకుండా నిలవరించలేకపోయింది.

పెట్టుబడి కేంద్రీకరణ ఉన్నత స్థాయికి చేరి, అంతర్జాతీయ పెట్టుబడి, ముఖ్యంగా అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి రూపం తీసుకోవడంతో పరిస్థితి మళ్ళీ సామ్రాజ్యవాదానికి అనుకూలంగా మారింది. దానికి సోవియట్ యూనియన్ పతనం తోడైంది. ఈ సోవియట్ పతనం సైతం అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి పాత్ర లేకుండా జరిగినది కాదు. ప్రపంచీకరణ ఉచ్చులోకి దేశాలను లాగి, ప్రపంచవ్యాప్త ద్రవ్య పెట్టుబడి ప్రవాహాల వేగానికి అవి లొబడేలా చేసింది సామ్రాజ్యవాదం. నయా ఉదారవాద విధానాలను గనుక ఆ దేశాలు అమలు చేయకపోతే ఆ అంతర్జాతీయ పెట్టుబడులు వెనక్కి పోతాయని బెదిరించి ఆ విధానాలు అమలు జరిగేట్టు చేసింది. దాని ఫలితంగా ఆ యా దేశాల ఆర్థిక వ్యవస్థలు ప్రభుత్వ నియంత్రణ కింద నడిచే పరిస్థితి లేకుండా పోయింది. మూడవ ప్రపంచ దేశాల వనరుల్లో చాలా భాగం మళ్ళీ సామ్రాజ్యవాదుల ఆధీనంలోకి వచ్చి చేరింది. ఆ మూడో ప్రపంచ దేశాలలో భూమిని ఏ విధంగా వినియోగించాలన్నది సైతం సామ్రాజ్యవాదమే నిర్దేశిస్తున్నది.

సామ్రాజ్యవాద పెత్తనం మళ్ళీ బలపడిన నేపథ్యంలో మనం అమెరికా-చైనాల నడుమ వైరుధ్యాన్ని చూడాలి. ఉక్రెయిన్ యుద్ధంతో సహా అనేక వర్తమాన పరిణామాలను కూడా ఈ నేపథ్యంలోనే చూడాలి. సామ్రాజ్యవాదం తిరిగి బలపడిన తీరులో రెండు ధోరణులు కనపడతాయి: మొదటిది: చైనా తదితర దేశాల నుండి వచ్చే సరుకులకు సంపన్న దేశాలలో ప్రవేశానికి అవకాశం కల్పించడం, సంపన్న దేశాల నుండి చైనా వంటి దేశాలకు పరిశ్రమలను తరలించడం. ప్రపంచ డిమాండ్‌ను అందుకోడానికి వీలుగా ఆ దేశాలలో చౌకగా లభించే కార్మిక శ్రమశక్తిని వాడుకోవడం దీని ఉద్దేశ్యం. దీని ఫలితంగా చైనా తదితర దేశాల ఆర్థిక పురోగతి వేగం పుంజుకుంది (ఏ దేశాలలోకి సంపన్న దేశాల పరిశ్రమలను తరలించారో, ఏ దేశాల నుండి సంపన్న దేశాలు సరుకుల ప్రవేశానికి అనుమతించాయో ఆ దేశాలలో మాత్రమే). చైనాలో ఆర్థిక పురోగతి ఏ స్థాయికి చేరిందంటే ఆఖరికి అమెరికా కూడా చైనా తనకు ప్రమాదకారిగా తయారు కాగలదని భావించసాగింది. రెండవ ధోరణి: అమెరికాలో "హౌసింగ్" బుడగ పేలిపోయి, దాని పర్యవసానాలు అంటువ్యాధి మాదిరిగా మొత్తం నయా ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థనే చుట్టుముట్టి సంక్షోభంలోకి నెట్టింది.

ఈ రెండు కారణాల రీత్యా, ఇప్పుడు అమెరికా తన ఆర్థిక వ్యవస్థను చైనా, తదితర దేశాల నుండి వచ్చిపడే దిగుమతుల నుండి రక్షించుకోవాలని చూస్తోంది. ఇప్పటిదాకా, ఈ దిగుమతుల వెనక ప్రధాన పాత్ర అమెరికన్ పెట్టుబడిదే. ఐనప్పటికీ, అవి అదే మాదిరిగా కొనసాగితే అమెరికాలోని పరిశ్రమలు మూతబడక తప్పదు. మొదట్లో చైనాలో చేపట్టిన "ఆర్థిక సంస్కరణలను" చాలా గొప్పగా శ్లాఘించిన అమెరికా ఇప్పుడు చైనా "తోక కత్తిరించాలని" మాట్లాడుతోంది. ఈ మార్పు వెనుక నయా ఉదారవాద వ్యవస్థ కూరుకుపోయిన సంక్షోభం పాత్ర ఉంది. అందులోంచి బైటపడడానికి మళ్ళీ సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవాలి. అదొక్కటే దాని ముందున్న దారి. కాని, చైనా, ఆ దేశం ప్రేరణతో మరికొన్ని దేశాలు ఆ ఆధిపత్యాన్ని సవాలు చేస్తున్నాయి. అమెరికా, చైనా ల నడుమ వైరుధ్యం పెద్దదవడానికి వెనుక ఇదే కారణం.

పెట్టుబడిదారీ వ్యవస్థలో సంక్షోభం ముదురుతున్న కొద్దీ, మూడవ ప్రపంచ దేశాలను అణచివేయడం కూడా పెరుగుతుంది. సామ్రాజ్యవాద ఒత్తిళ్ళకు తలొగ్గి ఈ దేశాలు అమలు చేస్తున్న "పొదుపు చర్యల" ఫలితంగా తాము చెల్లించవలసిన విదేశీ రుణ వాయిదాలను చెల్లించలేని స్థితిలో మూడవ ప్రపంచ దేశాలు పడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో వాటికి చైనా సహాయం అందిస్తోంది. ఆ తోడ్పాటు అందుకుంటున్న మూడవ ప్రపంచ దేశాలు సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని ప్రతిఘటిస్తున్నాయి. దాంతో అమెరికా-చైనా వైరుధ్యం మరింత తీవ్రం కానుంది. దాంతోపాటు చైనా వ్యతిరేక ప్రచారమూ పశ్చిమ సంపన్న దేశాలలో మరింత ఎక్కువ కానుంది.

(స్వేచ్ఛానుసరణ)

> **ఈ మార్పు వెనుక నయా ఉదారవాద వ్యవస్థ కూరుకుపోయిన సంక్షోభం పాత్ర ఉంది. అందులోంచి బైటపడడానికి మళ్ళీ సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవాలి. అదొక్కటే దాని ముందున్న దారి. కాని, చైనా, ఆ దేశం ప్రేరణతో మరికొన్ని దేశాలు ఆ ఆధిపత్యాన్ని సవాలు చేస్తున్నాయి. అమెరికా, చైనాల నడుమ వైరుధ్యం పెద్దదవడానికి వెనుక ఇదే కారణం.**

వ్యాఖ్య

నోట్ల రద్దుకి ఏడేళ్లు



గుమ్మడిదల రంగారావు



నోట్ల రద్దు నిర్ణయం వచ్చి నేటికి ఏడేళ్ళు. 2016 నవంబరు 8వ తారీకున రాత్రి 8 గంటలకు ప్రధానమంత్రి జాతినుద్దేశించి ప్రసంగిస్తారని ప్రకటన వచ్చినప్పుడు అందరూ విషయం ఏమిటా అని ఆసక్తిగా చూశారు. ఆ చారిత్రక ప్రసంగంలో చావుకబురు చల్లగా చెప్పారు: ఈ రోజు రాత్రి పన్నెడు గంటల తరవాత ఐదు వందలు, వెయ్యి రూపాయల నోట్లు చెల్లవు అని! ప్రజలకు అప్పుడు అర్థమైందో లేదోకానీ తెల్లవారి పత్రికలు చూశాక విషయం అర్థమైంది. అప్పటిదాకా చెలామణీలో వున్న ఐదు వందలు, వెయ్యి రూపాయల నోట్లు ఇహపై చెల్లు కావు అని అర్థమైనాక బీద బిక్కి చేసిన ఆర్తనాదాలు నేడు కూడా చెవుల్లో మారుమోగుతున్నాయి.

ప్రధాన మంత్రి గారు ముచ్చటగా మూడు కారణాలు చెప్పారు ఆ నిర్ణయం తీసుకోవటానికి. ఒకటి అవినీతిని అరికట్టడం, రేడు నల్లధనాన్ని నియంత్రించటం, మూడు ఉగ్రవాదాన్ని రూపుమాపడం. నోట్ల రద్దు ప్రభావం తెలుసుకోవటానికి కేవలం యాభై రోజుల వ్యవధి ఇవ్వమని ప్రజలను అడిగారు ప్రధాన మంత్రి గారు. ఆ కాలంలో ఆయన చెప్పిన మార్పులు రాకపోతే ఏదో చెయ్యమన్నారు. అటువంటి యాభై రోజులు ఈ ఏడేళ్లలో యాభై గడిచాయి. అదేం చిత్రమోగానీ 2016 నవంబరు 8వ తేదీ తరువాత గురించిగానీ, నోట్ల రద్దు నిర్ణయం గురించిగానీ, దాని వలన దేశానికి ఒనగూడిన ప్రయోజనాల గురించిగానీ ఇన్నేళ్లలో ఒక్కటంటే ఒక్కసారి కూడా ప్రస్తావించలేదు...ప్రధాన మంత్రిగానీ మరెవరైనా గానీ.

దేశాన్ని కుదిపేసింది ఈ ఆకస్మిక నిర్ణయం. అంగట్లో అన్నీ వున్నా, అల్లుడు నోట్లో శని అన్నట్లుగా మార్కెట్‌లో వస్తువులున్నాయ్‌గానీ కొనుక్కోవటానికి చేతిలో చిల్లిగవ్వ లేక పేద ప్రజలు ఆకలితో చేసిన ఆర్తనాదాలు ఇప్పటికీ బాగా గుర్తు చాలా మందికి. అంత హృదయ విదారకంగా మారిపోయాయి నాటి పరిస్థితులు. అప్పటివరకు చేస్తున్న పనులన్నీ ఒక్కసారిగా ఆగిపోయాయి. భవన నిర్మాణాలు, ఇళ్ల కొనుగోళ్లు, వాహన కొనుగోళ్లు, ప్రయాణాలు, నిత్యావసర వస్తువుల కొనుగోళ్లు... అన్నీ ఆగిపోయాయి బండికి గనక సడ్డెన్ బ్రేకు పడినట్లు. రాజకీయ పార్టీలు ఆందోళన చెయ్యటానికి కూడా డబ్బులు లేని పరిస్థితి. పైగా చెల్లుబాటయ్యే డబ్బుల కోసం గంటల తరబడి బ్యాంకుల ఎదుట నిలబడవలసిన పరిస్థితి కూడా ఉందాయె.

గుర్గావ్‌లో ఓ వృద్ధుడు రోజు మొత్తం లైన్లో నిలుచున్నా డబ్బు అందక బిగ్గరగా ఏడ్చిన ఏడుపు అందరినీ కలచివేసింది ప్రభుత్వాన్ని నడిపే నాయకులను మినహా. మన ప్రజాస్వామ్య వ్యవస్థ అంతా ప్రజల వెతల పట్ల స్పందించే శక్తిని కోల్పోయిందన్న విషయం అప్పుడు అర్థమైంది ప్రజలకు. అతను పూర్వం ఎమర్జెన్సీ సమయంలో చూసి వుంటాడు అటువంటి పరిస్థితిని. ఏ ఏటీఎంలో డబ్బులు లేవు. అన్నీ ఖాళీ డబ్బాలే! బ్యాంకుల్లో డబ్బులు కొద్ది మొత్తంలోనే ఇచ్చే వారు, మన అకౌంట్‌లో డబ్బు వున్నప్పటికీ. ఉన్న వారు లేనివారు అన్న తేడా లేకుండా అందరూ నానా అవస్థలు పడ్డారు డబ్బులకు.

మనం ఎవరినైనా సహాయం అడగాలంటే దీన స్థితిలో ఉన్నట్లు కనిపించాలి ఎదుటివారు జాలి పడే విధంగా. దీనస్థితి అంటే జుట్టు సరిగ్గా దువ్వుకోక, బట్టలు సరైనవి వేసుకోక మొహంలో విచారం కొట్టొచ్చినట్లు కనిపించటం అన్న మాట. ఆ సందర్భంలో నాకు ఒక వింత అనుభవం ఎదురైంది. నేను అప్పుడు ఢిల్లీలో ఉద్యోగం చేస్తున్నాను. హైదరాబాదులో ఇల్లాలేమో మీరు ఏం చేస్తారో నాకు తెలియదు. అర్జెంటుగా ఇరవై వేలు డబ్బులు పంపించమని హుకుం జారీ చేసింది. బ్యాంకుకి చెక్కు పంపించాను ఇరవై వేలు తీసుకురమ్మని. చెక్కు తీసుకొనిపోయిన మనిషి ఆరు వేల రూపాయల కంటే ఇవ్వటంలేదు అని చెక్కు తీసుకొని వెనుక్కు వచ్చాడు.

అది చలి రోజులు. ఢిల్లీలో సూటు బూటు వేసుకునే సీజను. సరే చేసేదేమీ లేక నేను కూడా సూటు బూటు వేసుకొని బ్యాంకు మేనేజర్ దగ్గరకెళ్లి కూర్చున్నాను. ఈయనెవరో పెద్దమనిషిలా ఉన్నాడే అని బ్యాంకు మేనేజరు అనుకోవాలి. తగిన హావాభావాలు ప్రదర్శిస్తూ ఆయన ముందు కూర్చున్నా. అప్పటికి ఆయన చుట్టూ చాలా మంది జనం గుమికూడి వున్నారు. ఆ జనప్రవాహం కాస్త తగ్గాక మేనేజరు నా వైపు చూశారు. మళ్ళీ అలవాటు లేని హావభావాలను ప్రదర్శిస్తూ కాస్త నాజూకైన ఇంగ్లీషులో విషయం బయట పెట్టా: నాకు అవసరంగా ఇరవై వేలు కావాలని. సూటు బూటు భాష పని చేసినట్లున్నయ్. ఇరవై వేలు ఇచ్చాడు కాస్త నసుగుతూనే. సరే వచ్చిన పని అయ్యిందిగదా అని వెయ్యి ఏనుగుల బలంతో తిరిగి వచ్చా కార్యాలయం గదికి. ఆ రోజు స్నేహితుడు తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాద్ వస్తుంటే అతని చేతికి ఇచ్చా ఇరవై వేలు. సికింద్రాబాదులో మనిషి కలుస్తాడు ఇరవై వేలు ఇవ్వమ్మని. మనిషి సికింద్రాబాదులో రైలు పెట్టె దగ్గరకొచ్చి నేను చెప్పిన సీటులో కూర్చున్న మనిషిని అడిగాడు డబ్బులు ఇవ్వండి పలానా మనిషి పంపాడు అని. పెట్టెలో మనిషి చికాకు పడుతూ ఏం డబ్బులు, ఎవరు పంపారు, నాకేమీ తెలియదు పో...అని కసురుకుంటూ చెప్పాడు! ఈ విషయం విని నేను నిర్ఘాంతపోయాను.

స్నేహితుడు అటువంటి వాడు కాదె అని. బాగా తెలిసిన మనిషి. బహుశా వేరే సీటులో ఏమైనా కూర్చున్నాడేమో అని ఫోను చేశా. మరో పది నిమిషాలు పడుతుంది సికింద్రాబాదు చేరటానికి అన్నాడు డబ్బు తీసుకొస్తున్న స్నేహితుడు. అప్పుడు అర్థమైంది సంగతి. హైద్రాబాదు నుంచి ఢిల్లీ వెళ్లే తెలంగాణ ఎక్స్‌ప్రెస్ దగ్గరకు వెళ్లి నేను చెప్పిన సీటులో మనిషిని డబ్బులు అడిగాడు స్టేషన్‌కు వచ్చిన మనిషి... అదే ఢిల్లీ నుంచి వస్తున్న రైలు అనుకొని! ఢిల్లీ నుంచి వచ్చే రైలు 12 గంటలు ఆలస్యంగావటం చేత రెండు రైళ్ళూ దాదాపు ఒకే సమయానికి సికింద్రాబాదు చేరుకున్న పరిస్థితి.

చిత్రమేమిటంటే ఉత్తరప్రదేశ్‌లో ప్రభుత్వం ఏర్పడిన రోజే ఏటిఎం నుంచి డబ్బులు తీసుకోవటానికి విధించిన పరిమితిని ఎత్తివేసి ఎప్పటిలాగే నలభై వేలు తీసుకునే వీలు కల్పించారు. ఇంత పెద్ద సంచలన నిర్ణయం, కోట్ల ప్రజల జీవితాలను తారుమారు చేసిన నిర్ణయం గురించి...ఏడేళ్ళు గడిచినా దేశానికి ఒనగూడిన ప్రయోజనం ఏమిటో...ప్రధాన మంత్రి నేటికీ చెప్పనేలేదు! నాటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ కాలం చేశారు గనక ఆయన చెబుతారన్న ఆశ లేదు. అవినీతి అంతమొందిందా? నల్లధనం నశించిందా? ఉగ్రవాదం అదుపులోకి వచ్చిందా? ఏవీ ఈ ప్రశ్నలకు సమాధానాలు? కనీసం ఎన్నికల ప్రచారంలో కూడా దాని ప్రస్తావన రావటం లేదు.

(వ్యాసకర్త లోక్‌సభ సచివాలయంలో మాజీ డైరెక్టర్)

★

> **ఇంత పెద్ద సంచలన నిర్ణయం, కోట్ల ప్రజల జీవితాలను తారుమారు చేసిన నిర్ణయం గురించి...ఏడేళ్ళు గడిచినా దేశానికి ఒనగూడిన ప్రయోజనం ఏమిటో...ప్రధాన మంత్రి నేటికీ చెప్పనేలేదు! నాటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ కాలం చేశారు గనక ఆయన చెబుతారన్న ఆశ లేదు. అవినీతి అంతమొందిందా? నల్లధనం నశించిందా? ఉగ్రవాదం అదుపులోకి వచ్చిందా? ఏవీ ఈ ప్రశ్నలకు సమాధానాలు? కనీసం ఎన్నికల ప్రచారంలో కూడా దాని ప్రస్తావన రావటం లేదు.**

జనవాక్యం

బస్టాండ్లలో ఉచిత టాయిలెట్లు

ముఖ్యమంత్రి గారూ....హైదరాబాద్ మహాత్మా గాంధీ బస్టాండ్‌లో టాయిలెట్లు, యూరినల్స్ దొడ్ల దగ్గర ఉచితం అని బోర్డులు పెట్టారు. మన విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో మాత్రం ఐదు రూపాయలు వసూలు చేస్తున్నారు. ఎంత దుర్మార్గం? రూపాయి విలువ ఏమిటో ప్రయాణికులకు తెలుసు. సినిమా హాళ్లలో టాయిలెట్లు ఫ్రీ. రైల్వేలో టాయిలెట్లు ఉచితం. మరి టికెట్‌కి డబ్బులు చెల్లించి ప్రయాణం చేస్తున్న ఆర్టీసిలో ఉచితం ఎందుకు చెయ్యరు? మా పాలన గొప్పగా ఉందని ఎలా చెప్పుకుంటారు? పక్క రాష్ట్రంలో చూసి అయినా మన ఆర్టీసి బస్టాండ్లలో టాయిలెట్లు ఉచితం చెయ్యాలి. మా పాలన దేశంలోకెల్లా బాగా ఉందని, మా పథకాలను ఇతర రాష్ట్రాలు కాపీ కొడుతున్నాయని గప్పాలు కొట్టుకునే ముఖ్యమంత్రి ఒక్కసారి ఆలోచించాలి. పక్క రాష్ట్రంలోని బస్‌స్టేషన్‌లో ప్రయాణికులకు టాయిలెట్లు ఉచితంగా సర్వీసు చేస్తుంటే, మన రాష్ట్రంలోని అన్ని బస్టాండ్లలో ఐదు రూపాయలు ముక్కు పిండి వసూలు చేయడం ఏం బాగుంది సీఎం గారూ...! వెంటనే రాష్ట్రంలోని అన్ని బస్టాండ్లలో ఉచిత టాయిలెట్లు ఏర్పాటు చెయ్యాలి.

- నార్నె వెంకట సుబ్బయ్య.

ఓటరూ...మేలుకో...!

ఓటరూ....గత స్మృతుల నుండి మేలుకో. గడచిన వ్యథల నుండి కోలుకో. నీ ఓటుతో... ఇన్నేళ్ళు నిను శాసించిన నాయకుల తలరాతలు మార్చు. నీ ఓటుతో...వచ్చే ఐదేళ్ళు నీవు ఆశించిన మంచి పాలకులను ఎన్నుకో. విజ్ఞతతో వ్యవహరించు. ప్రజా చైతన్యం కల్గించు. ప్రలోభాలకు తల దించావంటే ఐదేళ్ళు తప్పదు అరణ్య రోదన.

- కయ్యూరు బాలసుబ్రమణ్యం.

మీ వ్యాసాలు 5000 క్యారెక్టర్లు లేదా 700 పదాలు వుండాలి. పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

దశలవారీ కార్డ్ ప్రైమ్ సిస్టమ్ 2.0

- 73 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు
- తాజాగా అమల్లోకి నంద్యాల, తిరుపతి, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డిసెంబరు మొదటి వారంలోగా కార్డ్ ప్రైమ్ సిస్టమ్ 2.0 వెర్షన్‌ను రాష్ట్రవ్యాప్తంగా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నూటికి నూరు శాతం అమల్లోకి తెచ్చేందుకు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్లశాఖ కసరత్తు చేస్తోంది. 26 జిల్లాల్లో 294 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా, ప్రస్తుతానికి 73 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నూతన సాఫ్ట్‌వేర్‌ను ఆశాఖ అమల్లోకి తెచ్చింది. తాజాగా 48, గతంలో 25 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కొత్త సాఫ్ట్‌వేర్ విధానం ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ సాగుతోంది. తొలుత ధవళేశ్వరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని పైలెట్ ప్రాజెక్టుగా నూతన సాఫ్ట్‌వేర్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. అనంతరం రెండో పైలెట్ ప్రాజెక్టుగా ఎన్‌టిఆర్, కృష్ణా జిల్లాలను ప్రభుత్వం ఎంపిక చేసింది. తాజాగా ఈ నెల 6న నంద్యాల, తిరుపతి, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల్లోని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఈ విధానాన్ని ప్రవేశపెట్టారు.

నూరు శాతం అమలుకు నోచుకోలేదు

రాష్ట్ర వ్యాప్తంగా కార్డ్ ప్రైమ్ సిస్టమ్ 2.0 వెర్షన్ అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టి రెండు నెలలు దాటిపోయినప్పటికీ అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ విధానం నేటికీ నూటికి నూరు శాతం అమలుకు నోచుకోలేదు. అక్కడక్కడ సాఫ్ట్‌వేర్ సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నట్లు సమాచారం. నెలాఖరులోగా మరికొన్ని జిల్లాల్లో కార్డ్ ప్రైమ్ సిస్టమ్ 2.0 వెర్షన్‌ను సంబంధిత అధికారులు అమల్లోకి తేనున్నారు. ఈ లోగా ఆయా జిల్లాల్లో పూర్వపు పద్ధతిలోనే రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగుతుంది.

గతంలో ఫిజికల్ సంతకం లేక వేలిముద్ర వేసే భూ క్రయ విక్రయదారులను సబ్ రిజిస్ట్రార్ గుర్తించేవారు. కొత్త విధానంలో డాక్యుమెంట్‌లో సంతకం చేసిన వారు కార్యాలయంలో వేలిముద్ర వేశారా లేదా అనేది కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ గుర్తిస్తుంది. ఇదే సమయంలో ఆయా రిజిస్ట్రేషన్లకు సంబంధించిన ఆటో మ్యుటేషన్ కూడా రొటీన్‌గా జరగనుంది. తహశీల్దారు కార్యాలయానికి భూమి కొనుగోలు చేసిన వ్యక్తి వెళ్లకుండానే ఈ ప్రక్రియ సాగుతుంది. డేటా ఎంట్రీ బయట చేసుకుంటున్న నేపథ్యంలో సబ్ రిజిస్ట్రార్ వెరిఫికేషన్ సులభతరమవుతుందని ఆ శాఖ పేర్కొంటోంది.

ప్రక్రియ ఇలా..

వ్యక్తులు తొలుత డేటా ఎంట్రీ ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. తమ డాక్యుమెంట్లకు సంబంధించి కూడా డాక్యుమెంట్ రైటర్ దగ్గరకు వెళ్లకుండా సొంతంగా తయారుచేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది. ఇందుకు సంబంధించిన మాడ్యూల్స్‌ను రిజిస్ట్రేషన్లశాఖ తెలిపేందుకు తెచ్చింది. డాక్యుమెంట్లు అప్‌లోడ్ పూర్తి కాగానే కంప్యూటర్లో స్లాట్ బుకింగ్ చేసుకోవాలి. వెంటనే మోడల్ డాక్యుమెంట్ వస్తుంది. ఆధార్‌తోపాటు సర్వే నెంబరు, (గ్రామం, ఖాతా) స్వరూపం నమోదైన తర్వాత ఆటోమేటిగ్గా చలానా క్రియేట్ అవుతుంది. ఎంత చెల్లించాలనేది కూడా సిస్టమ్‌లో జనరేట్ అవుతుంది. దీంతో బ్యాంకుకు వెళ్లాల్సిన పనిలేదు. ఫిజికల్ సంతకం లేకుండానే ఇ-సంతకంతోనే ప్రక్రియ పూర్తవుతుంది. సబ్ డివిజన్ కావాలనుకుంటే రిజిస్ట్రేషన్‌కు ముందే ఆ ప్రక్రియ పూర్తిచేసుకోవాల్సి ఉంటుంది. అనంతరం ఆటో మ్యుటేషన్ ప్రక్రియ కొనసాగనుంది. ఆధార్ ఆధారంగా ఇ-సంతకంతోనే ఈ ప్రక్రియ పూర్తికానుంది.

అపోహలు నమ్మొద్దు : రిజిస్ట్రేషన్ల శాఖ

కార్డ్ ప్రైమ్ సిస్టమ్ 2.0 వెర్షన్ ద్వారా చేసే రిజిస్ట్రేషన్లపై కొందరు ఉద్దేశపూర్వకంగా జెరాక్స్ రిజిస్ట్రేషన్లు అంటూ ప్రచారం చేస్తున్నారని, అటువంటి పుకార్లను నమ్మొద్దని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్లశాఖ పేర్కొంటోంది. ఆధార్ ఆధారంగా డిజిటల్ సంతకంతో చేసే రిజిస్ట్రేషన్లు చట్టబద్ధంగా చెల్లుతాయని పేర్కొంది. ఇందుకు బ్యాంకర్లు కూడా అంగీకరించారని ఆ శాఖ చెబుతోంది.

జెవికె కిట్లు మాయం !

- గతేడాది మిగిలిన వాటి జాడే లేదు
- ఈ ఏడాది విద్యార్థులు 38.25 లక్షలు
- కొన్నది 39.96 లక్షలు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అందిస్తున్న జగనన్న విద్యాకానుక కిట్ల(జెవికె)లో మిగులు కిట్లు మాయమవుతున్నాయి. మునుపటి విద్యాసంవత్సరం ఆధారంగా జెవికె కిట్లను పాఠశాల విద్యాశాఖ సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఎ) ద్వారా టెండర్లు పిలిపించి కొనుగోలు చేస్తోంది. అయితే విద్యార్థులకు అందించగా మిగిలిన కిట్లను పట్టించుకోకుండా కొత్త ఏడాదికి ఎస్ఎస్ఎ కొనుగోలు చేస్తోంది. ఈ మిగిలిన కిట్లను ఏం చేస్తుందో తెలియడం లేదు. అధికారులు మాత్రం వచ్చే విద్యాసంవత్సరానికి అందిస్తున్నామని చెబుతూ తప్పించుకుంటున్నారు. ఇలా మిగిలిన లక్షల కిట్లు ఏమవుతున్నాయో తెలుసుకోకుండానే ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. 2022-23 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన విద్యార్థుల సంఖ్య 39,96,064 మంది. అయితే ఎస్ఎస్ఎ 45,60,041 కిట్లను కొనుగోలు చేసింది. అదనంగా 5,63,977 కిట్లు గత విద్యాసంవత్సరంలో మిగిలాయి. వీటిల్లో 6,65,324 నోటు పుస్తకాలు, 1,49,568 బెల్టులను జెవికె-4లో ఉపయోగించామని సమగ్ర శిక్ష చెబుతోంది. 1,15,056 బ్యాగులను, 2,43,153 బూట్లను రీప్లేస్‌మెంటు కోసం ఉపయోగించామని అంటోంది. కెజిబివి, మోడల్ స్కూల్స్, ఎపి రెసిడెన్షియల్ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న 1,41,417 మందికి నాలుగో జత యూనిఫాం కింద సరఫరా చేశామని అధికారులు అంటున్నారు. వీటిల్లో ప్లస్-2 చదువుతున్న 1,15,380 మంది విద్యార్థులకు యూనిఫాం క్లాత్ ఇచ్చామని అంటున్నారు. ఎస్ఎస్ఎ చెబుతున్న లెక్కల ప్రకారం 1,15,056 బ్యాగులను రీప్లేస్ చేసినా ఇంకా 4,48,921 బ్యాగులు మిగులుగా ఉండాలి. బూట్లలో 2,43,153 రీప్లేస్ చేసినా 3,20,824 మిగులు ఉన్నాయి. యూనిఫాం 3,07,180 జతలు మిగులుగా ఉండాలి. ఇవి కాకుండా 2020-21, 2021-22 విద్యా సంవత్సరాలు కలిపి 42,915 నోటు పుస్తకాలు, 72,196 బెల్టులు, 17,196 బ్యాగులు, 26,618 బూట్లు, 9,982 యూనిఫాం జతలు, 2,600 పిక్టోరియల్, 11,852 ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు మిగులుగా ఉన్నాయని సమగ్ర శిక్ష లెక్కలు తేల్చింది. వీటిని ప్రస్తుత విద్యా సంవత్సరం (జెవికె-4)లో వినియోగించాలని గతంలో సమగ్ర శిక్ష ఇన్‌ఛార్జి డైరెక్టరుగా ఉన్న పాఠశాల విద్యాశాఖ కమిషనరు ఎస్ సురేష్‌కుమార్ ఉత్తర్వులు విడుదల చేశారు. అయితే ఈ మిగులు కిట్లను పరిగణనలోకి తీసుకోకుండానే 2023-24 సంవత్సరానికి 39,96,064 కిట్లకు సప్లయి ఆర్డర్ ఇచ్చింది. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న విద్యార్థులు 38,22,000 మంది మాత్రమే. 2022-23లో మిగిలిన 5,63,977 కిట్లు, 1,74,064 కలిపి మొత్తం 7,38,041 కిట్లు మిగులుగా ఉండాలి. వీటిల్లో రీప్లేస్‌మెంటు బ్యాగులు, బూట్లు, కెజిబివి, మోడల్ స్కూల్స్, రెసిడెన్షియల్ విద్యార్థులకు నాలుగో జత యూనిఫాం అందించిన లెక్కలు తీసేసినా, 7,08,239 నోటు పుస్తకాలు, 6,40,181 బ్యాగులు, 5,21,506 బూట్లు, 4,91,226 యూనిఫాం జతలు, 2,21,764 బెల్టులు మిగిలి ఉండాలి. ఇవి కాకుండా పిక్టోరియల్, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు సుమారు లక్షల్లో మిగులు ఉండాలి. కోట్లకు సంబంధించిన ఈ మిగులు వస్తువులపై అధికారులు మాత్రం కాకి లెక్కలతో తప్పించుకుంటున్నారు.

కొంతమందికే అదనపు యూనిఫాం

2022-23 విద్యాసంవత్సరంలో మిగిలిన యూనిఫాం జతలను కెజిబివి, మోడల్ స్కూల్స్, రెసిడెన్షియల్ పాఠశాలలకు నాలుగో జత కింద అందించామని సమగ్ర శిక్ష చెబుతోంది. అయితే మిగులు యూనిఫాం అన్ని జిల్లాలకూ అందించలేదు. బాపట్ల, కర్నూలు, అనంతపురం కెజిబివి జిల్లాల్లో ఒక్క విద్యార్థికీ కూడా అందించలేదు. అదేవిధంగా కడప జిల్లాలో అన్ని కెజిబివిలకూ అందించలేదు.

పన్నుల్లో పంపిణీ కింద ఎపికి రూ.2,952.74 కోట్లు విడుదల

- కేంద్ర ఆర్థికశాఖ వెల్లడి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పన్నుల్లో పంపిణీ వాటా కింద నవంబరు నెలకు గానూ ఆంధ్రప్రదేశ్‌కు రూ.2,952.74 కోట్లు కేంద్రం విడుదల చేసింది. సాధారణంగా ప్రతినెలా 10న ఈ నిధులు విడుదల చేస్తున్నట్లు తెలిపింది. అయితే, ఈసారి మూడు రోజుల ముందుగానే పన్నుల్లో పంపిణీ వాటాలను రాష్ట్రాలకు విడుదల చేసినట్లు వెల్లడించింది. పండగ సమయంలో ముందస్తు నిధుల విడుదల రాష్ట్ర ప్రభుత్వాలకు మేలు చేస్తోందని అభిప్రాయపడింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఎపి, తెలంగాణతోపాటు దేశంలోని 28 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు రూ.72,961.21 కోట్లు విడుదల చేసినట్లు తెలిపింది. ఇందులో తెలంగాణ రాష్ట్రానికి రూ.1,533.64 కోట్లు విడుదల చేసింది. అత్యధికంగా యుపికి రూ.13,088.51 కోట్లు విడుదల చేసింది. తరువాత స్థానంలో బీహార్ (రూ.7,338.44 కోట్లు), మధ్యప్రదేశ్ (రూ.5,727.44 కోట్లు), పశ్చిమబెంగాల్ (రూ.5,488.88 కోట్లు), రాజస్థాన్ (రూ.4,396.64 కోట్లు), కర్ణాటక (రూ.2,660.88 కోట్లు), గుజరాత్ (రూ.2,537. 59 కోట్లు), ఝార్ఖండ్ (రూ.2,412.83) కోట్లు విడుదల చేసింది.

కోర్టు తుది తీర్పుకు లోబడే ట్రిబ్యునల్ కార్యకలాపాలు

- 2 వారాల్లో తెలంగాణ, కేంద్రం కౌంటరు దాఖలు చేయాలి
- కృష్ణా ట్రిబ్యునల్-2 టిఒఆర్‌పై సుప్రీం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కోర్టు తుది తీర్పుకు లోబడే ట్రిబ్యునల్ కార్యకలాపాలు ఉండాలని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. అభ్యంతరాలను అపోహలుగా తోసిపుచ్చలేమని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. కృష్ణా ట్రిబ్యునల్-2 టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ (టిఒఆర్)ను వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన కృష్ణా ట్రిబ్యునల్-2 టిఒఆర్‌పై తదుపరి చర్యలు లేకుండా స్టే ఇవ్వాలంటూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. రాష్ట్ర ప్రభుత్వ పిటిషన్‌ను మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. తెలంగాణ తరపున సీనియర్ న్యాయవాది సిఎస్ వైద్యనాథన్ వాదనలు వినిపిస్తూ... జలవివాదాలపై నిర్ణయం తీసుకునే అధికారం జల వివాదాల ట్రిబ్యునల్‌కే ఉందని, ఎపి ప్రభుత్వం పిటిషన్‌లో లేవనెత్తిన అంశాలు ఆర్టికల్ 262 పరిధిలోకి వస్తాయన్నారు. ఆర్టికల్ 32 కింద కాకుండా ఆర్టికల్ 131 ప్రకారం పిటిషన్ దాఖలు చేయాల్సిందని వైద్యనాథన్ పేర్కొన్నారు. పిటిషన్‌కు మెయింటెనబిలిటీ లేదంటూ అభ్యంతరాలను అపోహలుగా తోసిపుచ్చలేమని జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. ఈ పిటిషన్‌పై తెలంగాణ, కేంద్ర ప్రభుత్వాలు తమ ప్రాథమిక అభ్యంతరాలు కౌంటరు అఫిడవిట్‌లో పేర్కొనాలని జస్టిస్ సూర్యకాంత్ సూచించారు.

ఎపి ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా వాదనలు వినిపిస్తూ.. తెలంగాణ న్యాయవాది మెరిట్స్‌లోకి వెళ్తున్నారని, ఆ అవసరం లేదని, ట్రిబ్యునల్ టిఒఆర్‌పై స్టే విధించాలని కోరారు. ఈ సమయంలో కేంద్రం తరపున న్యాయవాది వారం రోజులు గడువు ఇస్తే అభిప్రాయం చెబుతామని ధర్మాసనాన్ని కోరారు. మెరిట్స్‌పై వాదించడానికి సిద్ధంగా ఉన్నామని, స్టే విధించొద్దని వైద్యనాథన్ కోరగా... అయితే తాము కూడా మెరిట్స్‌పై వాదనకు సిద్ధమేనని రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా పేర్కొన్నారు. అనంతరం తెలంగాణ, కేంద్రం కౌంటరు దాఖలు చేయడానికి రెండు వారాలు గడువు ఇస్తూ ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. ట్రిబ్యునల్ కార్యకలాపాలు కొనసాగడం అనేది కోర్టు తుది తీర్పునకు లోబడి ఉండాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణ ట్రిబ్యునల్ ఇప్పటికే దాఖలైన ఇతర పిటిషన్లతో కలిపి ఈ నెల 29న చేపడతామని ధర్మాసనం పేర్కొంది.

చైనా జిడిపి 5.4 శాతానికి పెరగొచ్చు

- ఐఎంఎఫ్ వెల్లడి

జెనివా : చైనా ఆర్థిక వ్యవస్థ మరింత మెరుగు పడొచ్చని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) అంచనా వేసింది. ప్రస్తుత ఏడాదిలో ఆ దేశ వృద్ధి రేటు 5.4 శాతంగా, 2024లో 4.6 శాతంగా ఉండొచ్చని విశ్లేషించింది. ఇంతక్రితం ఈ అంచనాలు వరుసగా 5 శాతం, 4.2 శాతంగా ఉన్నాయి. కాగా వచ్చే ఏడాది జిడిపిలో తగ్గుదల చోటు చేసుకోవచ్చని పేర్కొంది. ఇందుకు అక్కడి రియల్ ఎస్టేట్ రంగం స్తబ్దతలో ఉండటమే కారణమని పేర్కొంది. ఇంతక్రితం అంచనాలతో పోల్చితే చైనా ఆర్థిక వ్యవస్థ 0.4 శాతం పాయింట్లు మెరుగుపడొచ్చని ఐఎంఎఫ్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ గీతా గోపినాథ్ పేర్కొన్నారు. ప్రాపర్టీ మార్కెట్‌కు మద్దతును ఇవ్వడానికి చైనా ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ సమగ్ర పాలసీ ప్యాకేజీలో ఆచరణ సాధ్యం కాని ప్రాపర్టీ డెవలపర్‌ల నిష్క్రమణను వేగవంతం చేయడం, నివాసాల ధరల స్థిరీకరణకు అడ్డంకులను తొలగించడం, గృహ నిర్మాణాలను పూర్తి చేయడానికి అదనపు కేంద్ర ప్రభుత్వ నిధులను కేటాయించడం, బ్యాలెన్స్ షీట్‌లను సరిచేయడం తదితర చర్యలు చేపడుతుందని గీతా పేర్కొన్నారు. 2023లో ప్రపంచ వృద్ధి 3 శాతంగా, 2024లో 2.9 శాతంగా ఉండొచ్చని ఐఎంఎఫ్ అంచనా వేసింది. ఇది దశాబ్దాల్లోనే అత్యల్ప వృద్ధి రేటుగా నమోదు కానుందని పేర్కొంది. ప్రపంచ స్థాయిలో వ్యవస్థలు ఆర్థిక పునరుద్ధరణకు తీవ్ర సవాళ్లను ఎదుర్కొంటున్నాయని పేర్కొంది. 2000 నుంచి 2019 మధ్య ప్రపంచ సగటు వృద్ధి రేటు 3.8 శాతంగా ఉంది. దీంతో పోల్చితే ఆర్థిక వ్యవస్థలు ఒత్తిడిలోకి జారుతున్నాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఐఆర్‌సిటిసి లాభాల్లో 30% వృద్ధి

- మధ్యంతర డివిడెండ్ 125%

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జులై నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో ఇండియన్ రైల్వే కాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సిటిసి) ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు సాధించింది. గడిచిన క్యూ2లో 30.36 శాతం వృద్ధితో రూ.294.67 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే సెప్టెంబర్ త్రైమాసికంలో రూ.226 కోట్ల లాభాలు నమోదు చేసింది. అధిక కాటరింగ్ అమ్మకాలు, టికెట్ల విక్రయాలు సంస్థ రెవెన్యూ, లాభాలను పెంచాయి. గడిచిన క్యూ2లో ఐఆర్‌సిటిసి రెవెన్యూ 23.91 శాతం వృద్ధితో 995.31 కోట్లకు చేరింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.805.80 కోట్ల రెవెన్యూ ఆర్జించింది. 2023-24కు గాను ప్రతీ రూ.2 ముఖ విలువ కలిగిన ఈక్విటీ షేర్‌పై మధ్యంతర డివిడెండ్ కింద రూ.2.50 శాతం లేదా 125 శాతం చెల్లించడానికి ఆ కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. ఇందుకోసం రూ.160 కోట్లు వ్యయం కానుంది. ఈ మొత్తాన్ని నవంబర్ 17న వాటాదారులకు పంపించనుంది. మంగళవారం ఎన్ఎస్ఇలో ఐఆర్‌సిటిసి షేర్లు 1.68 శాతం పెరిగి రూ.682.75 వద్ద ముగిసింది. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 6.29 శాతం లాభపడింది.

జెబి ఫార్మాకు రూ.150 కోట్ల లాభాలు

జెబి కెమికల్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ కంపెనీ 2023-24 సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో 35 శాతం వృద్ధితో రూ.150.5 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.111.1 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.809 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. క్రితం క్యూ2లో 8.9 శాతం పెరిగి రూ.881.7 కోట్లకు చేరింది. మంగళవారం బిఎస్ఇలో జెబి ఫార్మా షేర్ 3.05 శాతం పెరిగి రూ.1,454 వద్ద ముగిసింది.

ఏళ్ల తరబడి నాన్చుడు!

- ఎస్‌టి క్యాస్ట్ వెరిఫికేషన్ ఫిర్యాదుల పరిష్కారంలో తీవ్ర జాప్యం
- న్యాయం కోసం గిరిజనుల ఎదురుచూపులు

ప్రజాశక్తి- విజయవాడ ప్రతినిధి

గిరిజన, ఆదివాసీల కుల ధ్రువీకరణ (క్యాస్ట్ వెరిఫికేషన్) ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వంఉదాసీనంగా వ్యవహరిస్తోంది. ఫిర్యాదుల్లో నిజనిజాలను పరిశీలించి నిర్ధారణలతో కూడిన సర్టిఫికెట్ల జారీలో తీవ్ర జాప్యం చేస్తోంది. 2021 డిసెంబరు నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 295 కేసులు పెండింగ్ ఉన్నాయి. 2022లో మరో 39 కేసులు వచ్చాయి. దీంతో, మొత్తం ఫిర్యాదులు 334కు చేరుకున్నాయి. వాటిలో 52 మాత్రమే ఇప్పటి వరకూ పరిష్కారం అయ్యాయి. 282 కేసులు ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోవడం లేదు. వీటిలో 273 కేసులు గిరిజన ప్రాంతంలోనివి. మైదాన ప్రాంతాలకు సంబంధించి తొమ్మిది కేసులు ఉన్నాయి. ఏజెన్సీ ప్రాంతానికి సంబంధించి అత్యధికంగా సీతంపేట ఐటిడిఎ పరిధిలో 129 ఫిర్యాదులు అపరిష్కృతంగా ఉండిపోయాయి.

ఫిర్యాదుల పరిష్కారానికి జిల్లా స్థాయిలో ఏర్పాటైన కమిటీలు సక్రమంగా పనిచేయడం లేదు. జాయింట్ కలెక్టర్, ఐటిడిఎల్లో ప్రాజెక్టు డైరెక్టర్ (పిఒ) వీటికి అధ్యక్షులుగా, గిరిజన సంక్షేమ శాఖతోపాటు సంక్షేమ శాఖల జిల్లా అధికారులు సభ్యులుగా ఉన్నారు. వచ్చిన కేసులపై ఈ కమిటీల్లో చర్చించి, క్షుణ్ణంగా పరిశీలించి నిజనిర్ధారణ చేసి పరిష్కరించాలి. అందుకోసం ఈ కమిటీలు నెలకు రెండు పర్యాయాలు సమావేశం కావాలి. కేసుల పరిష్కారంలో ప్రధానంగా వ్యవహరించాల్సిన జెసిలు, పిఒలు పట్టించుకోవడం లేదు. అధిక శాతం కేసులు పెండింగ్‌లో ఉండిపోయి ఫిర్యాదుదారులకు సకాలంలో న్యాయం చేకూరడం లేదు.

ఐటిడిఎ/జిల్లా	31-12-2021 నాటికి పెండింగ్ కేసులు	2022లో నమోదైన కేసులు	పరిష్కారమైన కేసులు
సీతంపేట	111	20	2
ప్వాతీపురం	21	7	0
పాడేరు	28	2	2
ఆర్‌సివరం	119	5	48
చింతూరు	00	2	0
కేఆర్‌పురం	2	0	0
శ్రీశైలం	7	0	0
విజయనగరం	1	0	0
ఎన్‌టిఆర్	1	0	0
పల్నాడు	0	3	3
చిత్తూరు	4	0	0
కర్నూలు	1	0	0
మొత్తం	295	39	52

వాయిదాలపై పరిశీలిస్తా
అదానీ-హిండెన్‌బర్గ్ కేసుపై సిజెఐ

న్యూఢిల్లీ : అదానీ-హిండెన్‌బర్గ్ వ్యవహారంలో దాఖలైన పలు పిటిషన్లు ఇంకా సుప్రీంకోర్టులో విచారణకు రావడం లేదు. ఈ కేసులో ఆగస్ట్ 26న విచారణ జరగాల్సి ఉన్నప్పటికీ అది వాయిదా పడింది. రెండు నెలలు దాటినప్పటికీ పిటిషన్లు నేటి వరకూ విచారణకు నోచుకోలేదు. ఓ పిటిషనర్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ దీనిపై అసహనం వ్యక్తం చేశారు. విచారణ తేదీని నిర్ణయించడంలో జాప్యం జరుగుతోందని ఆయన ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ దృష్టికి తెచ్చారు. 'ఈ కేసు ఆగస్టు 28న విచారణకు రావాల్సి ఉంది. అయితే వాయిదా పడింది. వాయిదా...వాయిదా...వాయిదా' అని అన్నారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి స్పందిస్తూ ఈ విషయాన్ని పరిశీలించాల్సిందిగా రిజిస్ట్రీకి సూచిస్తానని తెలిపారు. అదానీ గ్రూప్ ఆర్థిక తప్పిదాలకు పాల్పడిందని, ఖాతాల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ రిసెర్చ్ సంస్థ జనవరి 24న ఓ నివేదికను ప్రచురించింది. అయితే ఈ ఆరోపణల్ని అదానీ గ్రూపు తోసిపుచ్చింది. ఈ వ్యవహారంలో సెబీ వైఫల్యాన్ని పరిశీలించాల్సిందిగా సుప్రీంకోర్టు నిపుణుల కమిటీని నియమించింది. మరోవైపు సెబీ కూడా సొంతగా దర్యాప్తు చేపట్టింది. నిపుణుల కమిటీకి సెబీ తన నివేదికను ఆగస్ట్ 14న సమర్పించాల్సి ఉన్నప్పటికీ విచారణ పూర్తి చేసేందుకు మరికొంత సమయం తీసుకుంది. చివరికి ఆగస్ట్ 25న సెబీ తన స్టేటస్ నివేదికను అందజేసింది. కానీ సెబీ నివేదికపై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది.

బీహార్‌లో అంగన్‌వాడీల నిరసన

పాట్నా : బీహార్‌లో ఓ వైపు శాసనసభ సమావేశాలు జరుగుతుండగా మరోవైపు వందలాది మంది అంగన్‌వాడీలు, సహాయకులు మంగళవారం రాజధాని పాట్నా వీధుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ వారు అసెం బ్లీని ముట్టడించేందుకు ప్రయత్నించారు. నితీష్ కుమార్ నేతృత్వంలోని మహా ఘట్‌బంధన్ ప్రభుత్వం తమ డిమాండ్లను తీర్చకపోతే రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తమ నెల వారీ గౌరవ వేతానాన్ని పెంచాలని, ప్రభుత్వోద్యోగులతో సమానమైన హోదా కల్పించాలని అంగన్‌వాడీలు కోరుతున్నారు.

గోప్యత జర్నలిస్టుల ప్రాథమిక హక్కు

- డిజిటల్ పరికరాల స్వాధీనం తీవ్రమైన అంశం
- ఏజెన్సీలతో నడిచే ప్రభుత్వం కాకూడదు
- నెల రోజుల్లో మార్గదర్శకాలు : కేంద్రానికి సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ : పాత్రికేయులు వార్తలు, కథనాల సమాచారం కోసం అనేక వనరులపై ఆధారపడుతుంటారని, ఆ విషయంలో గోప్యత పాటించడం వారి ప్రాథమిక హక్కు అని సుప్రీంకోర్టు తెలిపింది. మీడియాలో పనిచేసే జర్నలిస్టులు, ఉద్యోగులు వార్తలను సేకరించేందుకు సోర్సుల కాంటాక్ట్‌లు కలిగివున్న డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకోవడం అత్యంత తీవ్రమైన అంశమని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. దర్యాప్తు కోసం వారి పరికరాలను స్వాధీనం చేసుకోవాల్సి వస్తే.. అందుకు ప్రత్యేకమైన మార్గదర్శకాలను రూపొందించాల్సిన అవసరముందని అభిప్రాయపడింది. దేశంలోని దర్యాప్తు సంస్థలు జర్నలిస్టులను విచారించేందుకు, వారి నుంచి పత్రాలు, హార్డ్ డిస్క్‌లు, ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు వంటివి స్వాధీనం చేసుకునేందుకు ప్రత్యేక విధివిధానాలను రూపొందించాలని కోరుతూ ఫౌండేషన్ ఫర్ మీడియా ప్రొఫెషనల్స్ దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సుధాంషు ధులియాలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. "ఇది చాలా తీవ్రమైన అంశం. మీడియా ప్రొఫెషనల్స్ డిజిటల్ పరికరాల తనిఖీలు, స్వాధీనం కోసం ప్రత్యేకమైన మార్గదర్శకాలు ఉండాలి. మీడియా వ్యక్తులకు వారి సొంత సోర్సులు ఉంటాయి. గోప్యత హక్కు అనేది ప్రాథమిక హక్కు. దానిలో సమతుల్యం పాటించాలి" అని సుప్రీం కోర్టు ధర్మాసనం పేర్కొంది. జర్నలిస్టు డిజిటల్ పరికరాల స్వాధీనం కోసం ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించాలని ఈ సందర్భంగా కేంద్రానికి సూచించింది. ఇందుకోసం నెల రోజుల గడువు ఇస్తున్నట్టు తెలిపింది. "మీరు కోరుకుంటే మేం మార్గదర్శకాలను రూపొందిస్తాం. కానీ మీరు చేస్తే బాగుంటుందని అనుకుంటున్నాం. ఏజెన్సీలతో నడిచే ప్రభుత్వం కాకూడదు" అని ధర్మాసనం స్పష్టం చేసింది.

కేంద్ర ప్రభుత్వం తరపున హాజరైన అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు సమాధానమిస్తూ.. ఇలాంటి పరికరాలను పరిశీలించకుండా అధికారులను ఆపలేమని అన్నారు. అయితే ఎలాంటి మార్గదర్శకాలు లేనప్పుడు ఇలాంటి అంశాలపై ప్రభుత్వానికి అధిక అధికారాలు ఇస్తే అది ప్రమాదకరమని ధర్మాసనం పేర్కొంది. అనంతరం ఈ పిటిషన్‌పై తదుపరి విచారణను డిసెంబరు 6కి వాయిదా వేసింది.

"దేశంలో చాలా మంది పాత్రికేయులు ప్రతీకార దాడులు జరుగుతాయనే భయంతో పనిచేస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ అంశాలకు సంబంధించి కొంతమంది జర్నలిస్టులు రాసే వార్తలను ప్రభుత్వం అంగీకరించడంలేదు. వారిని కట్టడి చేసేందుకు సోదాల పేరిట ప్రతీకార దాడులకు పాల్పడుతూ భయభ్రాంతులకు గురిచేస్తోంది" అని ఇటీవల 15 మీడియా సంస్థలు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్‌కు లేఖ రాశాయి. ఇటీవలి న్యూస్‌క్లిక్ ఆన్‌లైన్ పోర్టల్‌లో పనిచేసే 46 మంది జర్నలిస్టులు, ఉద్యోగుల ఇండ్లలో ఢిల్లీ పోలీసులు సోదాలు చేసి, వారి డిజిటల్ పరికరాల(ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు, హార్డ్ డిస్క్‌లు)ను స్వాధీనం చేసుకున్న విషయాన్ని కూడా వారు ప్రస్తావించారు.

నేడు విద్యార్థి, యువజన సంఘాల రాష్ట్ర బంద్
ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడి గృహనిర్బంధం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపాలని, కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 8న విద్యార్థి, యువజన సంఘాలు రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో బంద్‌ను అడ్డుకునేందుకు పలు ప్రాంతా ల్లో విద్యార్థి సంఘాల నేతలను మంగళవారం రాత్రి గృహ నిర్బంధం, ముందస్తు అరెస్టులు చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్నకుమార్‌ను పోలీసులు మంగళవారం రాత్రి గృహనిర్బంధం చేశారు. గవర్నర్‌పేటలోని ప్రసన్నకుమార్ నివాసం వద్దకు వచ్చి అరెస్టు చేసేందుకు పోలీసులు పహారా కాశారు. ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు వీలు లేదంటూ నివాసానికి తాళం వేసి, గృహ నిర్బంధం చేశారు. నాయకులను గృహ నిర్బంధం చేయడాన్ని ఎస్ఎఫ్ఐ ఖండించింది. ఇటువంటి చర్యలు దుర్మార్గమని పేర్కొంది. వీటి ద్వారా ఉద్యమాలను అడ్డుకోలేరని స్పష్టం చేసింది.

ఐద్వా సభ్యురాలిపై బిజెపి గూండాల దాడి

న్యూఢిల్లీ : ఈనెల 5న మహారాష్ట్రలో జరిగిన గ్రామ పంచాయితీ ఎన్నికల్లో తలసారి తహసిల్ పంచాయితీ సమితి ఛైర్‌పర్సన్‌గా కరజాగోన్ గ్రామానికి చెందిన ఐద్వా సిఇసి సభ్యురాలు సునీత సింగ్డా ఎన్నికయ్యారు. కరజాగోన్ గ్రామ పంచాయితీ ఎన్నికల ఫలితాలను ప్రకటించిన తర్వాత ఆ ఎన్నికల్లో ఓటమి పాలైన బిజెపి గూండాలు సోమవారం రాత్రి ఆమె ఇంటిపై దాడి చేసి, ఆమెపై, కుటుంబ సభ్యులపై దాడులకు దిగారు. బిజెపి గూండాల దాడులను తీవ్రంగా ఖండించిన ఐద్వా ఈ చర్యను పిరికిపంద దాడిగా వర్ణించింది. వందలాదిమంది ప్రజలు పోలీసు స్టేషన్‌ను చుట్టుముట్టారు, తక్షణమే బిజెపి గూండాలపై చర్యలు తీసుకోవాలంటూ పోలీసులపై ఒత్తిడి తెచ్చారు.



విజయవంతంగా ప్రళయ్ ప్రయోగం !

బాలాసోర్ (ఒడిషా) : ఉపరితలంపై నుండి ఉపరితలంపైకి ప్రయోగించగల స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణి (ఎస్ఆర్‌బిఎం) 'ప్రళయ్'ను ఒడిషా తీరంలోని అబ్దుల్ కలామ్ దీవి నుండి భారత్ మంగళవారం విజయవంతంగా ప్రయోగించింది. రక్షణ పరిశోధనా, అభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఓ) ఈ క్షిపణిని అభివృద్ధిపరిచింది. ఉదయం 9.50గంటల సమయంలో ఈ క్షిపణిని ప్రయోగించామని, అన్ని లక్ష్యాలను అందుకుందని డిఆర్‌డిఓ అధికారి తెలిపారు. ట్రాకింగ్ సాధనాలతో కూడిన బ్యాటరీ తీరప్రాంత పొడవునా క్షిపణి మార్గాన్ని పర్యవేక్షించిందని ఆయన చెప్పారు. 350నుండి 500కిలోమీటర్ల దూరంలో గల లక్ష్యాలను ప్రళయ్ ఛేదిస్తుంది. ఉపరితలం నుండి ఉపరితలంపైకే ప్రయోగించగల దీంట్లో 500నుండి వెయ్యి కిలోల పేలోడ్‌ను మోసుకెళ్ళవచ్చని చెప్పారు. వాస్తవాధీనరేఖ, వాస్తవ నియంత్రణ రేఖల పొడవునా మోహరించడానికి ఈ ప్రళయ్‌ను అభివృద్ధిపరిచారు.

పండుగలు చేసుకోండి.. పర్యావరణాన్ని దెబ్బతీయొద్దు

- బాణాసంచాపై సుప్రీం వ్యాఖ్యలు



న్యూఢిల్లీ : వాయు, ధ్వని కాలుష్యాన్ని తగ్గించేందుకు గానూ బాణాసంచా కాల్చడంపై తాము జారీ చేస్తున్న ఆదేశాలకు దేశవ్యాప్తంగా గల రాష్ట్రాలన్నీ కట్టుబడి వుండాలని, కేవలం ఢిల్లీ, ఎన్‌సిఆర్ ప్రాంతాలే కాదని సుప్రీం కోర్టు మంగళవారం స్పష్టం చేసింది. దీపావళి పండుగ మరికొద్ది రోజుల్లో వుండగా ఈ ఆదేశాలు వెలువడ్డాయి. "పండుగ సంబరాలు జరుపుకోండి, కానీ కాస్త మోతాదులోనే వుండాలి. పర్యావరణాన్ని పణంగా పెట్టి జరుపుకోరాదు, ఇటువంటి సంబరాలతో ఇతరులకు మనం సంతోషాన్ని తీసుకురాగలుగుతాం." అని జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్ వ్యాఖ్యానించారు. పిల్లల కన్నా పెద్దలే అధ్వాన్నంగా వ్యవహరిస్తున్నారని జస్టిస్ ఎ.ఎస్.బొపన్న వ్యాఖ్యానించారు. పెద్ద ఎత్తున బాణాసంచా కాలుస్తూ వాటివల్ల కలిగే కాలుష్యాన్ని, ఇతరులకు కలిగే ఇబ్బందిని అస్సలు పట్టించుకోవడం లేదని అన్నారు. 10.30 గంటల వరకే కాల్చుకోవాలని ఆంక్షలు విధిస్తే, 10 గంటల కల్లా మొత్తం టపాసులన్నీ కాల్చేసుకోవడానికే వారు చూస్తారని జస్టిస్ బొపన్న అన్నారు. ప్రజలను చైతన్యవంతులు చేయడంపైనే ప్రధానంగా దృష్టి కేంద్రీకరించాలని జస్టిస్ సుందరేశ్ అన్నారు.

మూడు రోజులు ఆఫీసుకు రావాల్సిందే : విప్రో

బెంగళూరు : దిగ్గజ ఐటి కంపెనీ విప్రో తమ ఉద్యోగులు వారంలో కనీసం మూడు రోజులు కార్యాలయాలకు రావాల్సిందేనని స్పష్టం చేసింది. క్రమంగా ఇంటి నుంచి పని పద్ధతికి స్వస్తి పలుకుతున్నట్లు వెల్లడించింది. ఇకపై ఉద్యోగులంతా వారంలో మూడు రోజులు తప్పనిసరిగా ఆఫీస్‌కు వచ్చి పనిచేయాలని ఆదేశాలు జారీ చేసింది. నవంబర్ 15 నుంచి కొత్త ఆదేశాలు అమల్లోకి వస్తాయని పేర్కొంది. ఇప్పటికే 55 శాతం మంది ఉద్యోగులు వారానికి మూడుసార్లు ఆఫీసులకు వస్తున్నారని వెల్లడించింది. టిసిఎస్ ఇన్ఫోసిస్ దిగ్గజాలు ఇప్పటికే ఉద్యోగుల్ని ఆఫీసుకు వచ్చి పని చేయాలని సూచించిన విషయం తెలిసిందే.

సైన్స్‌ను ప్రేమించాలి : విఠపు బాలసుబ్రమణ్యం

- నేషనల్ సైంటిఫిక్ టెంపర్ క్యాంపెయిన్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విఠపు బాలసుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి-విజయవాడ

మనిషి జీవితంతో ముడిపడి ఉన్న సైన్స్‌ను ప్రేమించాలని జనవిజ్ఞాన వేదిక సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం అన్నారు. నవంబర్ 7 నుండి ఫిబ్రవరి 28వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ జన విజ్ఞాన వేదిక నిర్వహించనున్న నేషనల్ సైంటిఫిక్ టెంపర్ క్యాంపెయిన్ పోస్టర్‌ను విజయవాడలోని ఎస్‌డిఎం సిద్ధార్థ మహిళా కళాశాలలో ఆయన మంగళవారం ఆవిష్కరించి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. కరోనా సమయంలో మనందరం సైంటిస్టులు కనిపెట్టిన వ్యాక్సిన్ కోసం ఎదురు చూశామేగానీ, మన ముందు వేరే ప్రత్యామ్నాయం లేకపోయిందని తెలిపారు. సైన్స్ చదువుతున్న విద్యార్థులు పెరిగినా, ఉపాధ్యాయుల పెరిగినా సైంటిస్టులు ఎందుకు తయారు కావడంలేదో విద్యార్థులు, ప్రజలు ఆలోచించాలన్నారు. సివి రామన్ తర్వాత నోబెల్ బహుమతి మన దేశానికి రాకపోవడాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు.

ఆనాడు సూర్యుని చుట్టూ భూమి తిరుగుతుందని చెప్పడానికి సైంటిస్టులు ఎంత కష్టపడాల్సి వచ్చిందో విద్యార్థులు తెలుసుకోవాలని అన్నారు. సత్యాన్వేషణ కోసం ప్రతి ఒక్కరూ కషి చేయాలని సూచించారు. వాస్తవాన్ని వాస్తవంగా ఒప్పుకోవడానికి అంగీకరించకపోతే సైంటిస్టులు పరిశోధనలు చేయలేరన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్థాయికి మనం ఎదుగుతున్నాగానీ, అశాస్త్రీయ భావాలను పాలకవర్గాలే ప్రచారం చేయడం అన్యాయమని చెప్పారు.

ఎలక్ట్రానిక్స్ సిఇఒ దాసరి రామకష్ణ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వం పెరగాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్ శాస్త్ర విజ్ఞాన ప్రచార కార్యక్రమాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ గోపాలం శివన్నారాయణ, కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి విజయలక్ష్మి ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.కల్పన, అమరావతి బాలోత్సవం ప్రధాన కార్యదర్శి ఆర్.కొండలరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికులను ఇజ్రాయిల్ పంపొద్దు

- పాలస్తీనాకు సంఘీభావం తెలపండి
- ఇజ్రాయిల్ మారణహోమాన్ని నిరసించండి
- మోడీ ప్రభుత్వానికి సిఐటియుడిమాండ్

న్యూఢిల్లీ : ఇజ్రాయిల్ బిల్డర్స్ అసోసియేషన్ కోరిక మేరకు భారతీయ కార్మికులను ఆ దేశానికి పంపవద్దని సిఐటియుకేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. పాలస్తీనాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణహోమానికి వత్తాసు పలకవద్దని, పాలస్తీనా ప్రజలకు సంఘీభావం తెలపాలని కోరింది. పాలస్తీనాలో ఇజ్రాయిల్ దళాలు వెంటనే కాల్పుల విరమణ పాటించేలా, ఆక్రమణల నుండి పాలస్తీనా భూభాగానికి విముక్తి కల్పించేలా కృషి చేయాలని మోడీ ప్రభుత్వానికి సూచించింది. ఈ మేరకు సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

'ఇజ్రాయిల్ దళాలు పాలస్తీనాపై ఉద్దేశపూర్వకంగా దాడులు జరుపుతూ మహిళలు, చిన్నారులు సహా వేలాది మంది ప్రజలను పొట్టనపెట్టుకుంటున్నాయి. అంతేకాక తమ దేశంలో వివిధ రంగాల్లో పనిచేస్తున్న పాలస్తీనా కార్మికులను దేశం విడిచి వెళ్లాలని ఇజ్రాయిల్ ప్రభుత్వం ఆదేశించింది. ఈ క్రమంలో ఇజ్రాయిల్ బిల్డర్స్ అసోసియేషన్ వారు యాభై వేల నుండి లక్ష మంది కార్మికులు, నిర్మాణ కార్మికులను పంపాలని మన దేశాన్ని కోరుతున్నారు. ఇజ్రాయిల్‌లో పని చేసేందుకు వీరిని ఉపయోగించుకోవాలని చూస్తున్నారు. ఇజ్రాయిల్ బిల్డర్స్ అసోసియేషన్ ఇప్పటికే మన ప్రభుత్వానికి నేరుగా, అక్కడి ప్రభుత్వం ద్వారా అభ్యర్ధన పంపినట్లు తెలిసింది. ఇజ్రాయిల్‌లో పనిచేస్తున్న పాలస్తీనా కార్మికుల పట్ల అక్కడి ప్రభుత్వం అమానుషంగా, ఆటవికంగా ప్రవర్తించడాన్ని సిఐటియు తీవ్రంగా నిరసిస్తోంది. ఖండిస్తోంది. పాలస్తీనాలో ఇప్పటికే ఇజ్రాయిల్ దళాలు ఉద్దేశపూర్వకంగా మారణహోమానికి పాల్పడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో భారతీయ కార్మికులను ఇజ్రాయిల్‌కు పంపవద్దని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఒకవేళ కేంద్రం ఇలాంటి చర్యలకు పూనుకున్నప్పటికీ స్పందించవద్దని, తిరస్కరించాలని కార్మికులను కోరుతున్నాం' అని తపన్ సేన్ ఆ ప్రకటనలో కోరారు.

ఇలాంటి కీలక సమయంలో ఇజ్రాయిల్‌కు భారతీయ కార్మికులను పంపడాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానం ఆమోదించిన భారత నిర్మాణ కార్మికుల సమాఖ్యను సిఐటియు అభినందించింది. ఇజ్రాయిల్ ప్రభుత్వం, అక్కడి బిల్డర్స్ అసోసియేషన్ అభ్యర్ధనను తిరస్కరించాలని కార్మిక వర్గం తరపున ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. కాల్పుల విరమణ పాటించాలంటూ ఐరాస ఇటీవల చేసిన తీర్మానానికి మద్దతు ఇవ్వాలని, అన్ని రకాల ఆక్రమణల నుండి పాలస్తీనా భూభాగానికి విముక్తి కలిగించడానికి కృషి చేయాలని మోడీ ప్రభుత్వానికి సూచించింది.

పాలస్తీనా ప్రజలకు, వారి డిమాండ్‌కు సంఘీభావంగా, అదే సమయంలో పాలస్తీనాకు వ్యతిరేకంగా సామ్రాజ్యవాద అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ సాగిస్తున్న దాడులకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించాలని కార్మికలోకానికి పిలుపునిచ్చింది. అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్, రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్ మన దేశంలో పర్యటిస్తున్న నేపథ్యంలో పాలస్తీనా అంశంపై ఈ నెల 7-10 తేదీల మధ్య ప్రగతిశీల, వామపక్ష శక్తులు నిర్వహిస్తున్న నిరసన-సంఘీభావ కార్యక్రమంలో భాగస్వాములవ్వాలని కార్మికులను కోరింది.

ప్రభుత్వ ఆస్తులను బడా కార్పొరేట్లకు దోచిపెట్టేందుకే ఈ యత్నాలు

- మోడీ సర్కార్‌పై సిఐటియు నేతల విమర్శలు
- జమ్మూ కాశ్మీర్ ప్రభుత్వ ఆదేశాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్
- జమ్మూ, శ్రీనగర్‌ల్లో నిరసన ప్రదర్శనలు

శ్రీనగర్: విద్యుత్, రైల్వేలు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు, స్మార్ట్ మీటర్లను నెలకొల్పడానికి వ్యతిరేకంగా సిఐటియు జమ్మూ, శ్రీనగర్‌ల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించింది. దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఈ నిరసనలు జరిగాయి. సమ్మెలు, ధర్నాలు చేస్తున్న ఉద్యోగు లను హెచ్చరిస్తూ జారీ చేసిన ఆదేశాలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసింది. శ్రీనగర్‌లో జరిగిన ప్రదర్శనను ఉద్దేశించి సిఐటియు అధ్యక్షుడు మహ్మద్ యూసుఫ్ తరిగామి ప్రసంగించారు. కార్మిక లోకం ఎదుర్కొంటున్న సమస్యలపై ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్‌ను ప్రైవేటీకరించడం వల్ల మార్కెట్ ద్వారా వినియోగదారులపై గుత్తాధిపత్యాన్ని నెలకొల్పే ప్రమాదముందని హెచ్చరించారు. విద్యుత్ ఉత్పత్తి, రవాణా, పంపిణీ ఇలా అన్ని విభాగాలను ప్రైవేటు పరం చేయడానికి ప్రభుత్వం పూనుకుంటోందని, తద్వారా ప్రభుత్వ పంపిణీ వ్యవస్థను మొత్తంగా ధ్వంసం చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా వుందని తరిగామి విమర్శించారు. రైల్వేల ప్రైవేటీకరణ వల్ల కూడా తీవ్ర పర్యవసానాలు తలెత్తే ప్రమాదముందన్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల అనూహ్యంగా వచ్చే బిల్లులను వినియోగదారులు ఎంత మాత్రమూ భరించలేరని అన్నారు. ప్రజల నుండి తీవ్ర అసమ్మతి వ్యక్తమవుతున్నా ప్రభుత్వం మాత్రం తన చర్యలతో ముందుకెళుతోందన్నారు. తగినంత విద్యుత్ తమకు కావాలి తప్ప మీటర్లు మాత్రమే కాదన్నారు. సమ్మెలకు దూరంగా వుండాలని, లేని పక్షంలో క్రమశిక్షణా చర్యలు తీసుకుంటా మని ఉద్యోగులను హెచ్చరిస్తూ ఇటీవల జమ్మూ కాశ్మీర్ ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని తరిగామి కోరారు. ఐఎల్ఓ నిబంధనలకు ఈ ఆదేశాలు వ్యున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నేత అబ్దుల్ రషీద్ పండిట్, రైతు సంఘ నేత గులాం మహ్మద్ షా, యువజన నేత మహ్మద్ అబ్బాస్ ప్రసంగించారు.

జమ్మూలో

జమ్మూలో కూడా సిఐటియు నేతృత్వంలో నిరసన ప్రదర్శన చోటు చేసుకుంది. ప్లకార్డులు చేబూనిన ఆందోళనకారులు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నయా ఉదారవాద విధానాల అమల్లో భాగంగానే ప్రభుత్వం రైల్వేల ప్రైవేటీకరణకు ప్రయత్నిస్తోందని, తద్వారా ప్రైవేటు వ్యక్తులు రైల్వే భూమిని తమ వాణిజ్య ప్రయోజనాలకు స్వేచ్ఛగా వాడుకోవడానికి వెసులుబాటు వుంటుందని సిఐటియు వర్కింగ్ ప్రెసిడెంట్ ఓం ప్రకాష్ విమర్శించారు.

పంట అవశేషాలు తగలబెట్టొద్దు

- 4 రాష్ట్రాలకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ : ఢిల్లీలో పెరుగుతున్న వాయు కాలుష్యంపై సుప్రీంకోర్టు స్పందించింది. పంట అవశేషాలను తగలబెట్టడాన్ని వెంటనే నిలిపివేయాలని పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలను ఆదేశించింది. పంట అవశేషాలను తగలబెట్టడాన్ని వ్యతిరేకిస్తూ చేస్తున్న ఆందోళనను రాజకీయం చేయొద్దని పంజాబ్ ప్రభుత్వానికి సూచించింది. రాజధానిలో వాయు కాలుష్యానికి తగలబడుతున్న పంట అవశేషాలు కారణమవుతున్నాయని తెలిపింది. న్యాయమూర్తి జస్టిస్ ఎస్‌కె కౌల్ నేతృత్వంలోని ద్విసభ్య బెంచ్ ఈ వ్యవహారంపై విచారణ జరిపింది. పంట అవశేషాలను తగలబెట్టకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులదేనని, దీనిని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పర్యవేక్షించాలని ఆదేశించింది. ప్రజలు ముఖ్యంగా పిల్లల పైన కాలుష్యం చూపుతున్న ప్రభావంపై కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఢిల్లీలో మంగళవారం వాయు నాణ్యత సూచిక చాలా దారుణంగా ఉంది. శుక్రవారం నుండి ఇది తీవ్రమైన స్థాయిలోనే కొనసాగుతోంది. ఈ నెల 10వ తేదీ వరకూ 11, 12 తరగతులు మినహా మిగిలిన తరగతుల విద్యార్థులకు క్లాసులు నిర్వహించవద్దని ఢిల్లీ ప్రభుత్వం ఆదేశించింది. దీపావళి మర్నాడు నుండి 20వ తేదీ వరకూ వాహనాల రాకపోకల విషయంలో సరి-బేసి సంఖ్యల విధానాన్ని అమలు చేస్తామని తెలిపింది.

కొలీజియం సిఫార్సులన్నింటినీ ఆమోదించాలి

- ప్రభుత్వానికి నచ్చిన వారినే ఎంపిక చేయకూడదు
- సెలెక్టివ్‌గా నియామకాలు జరిగితే సీనియారిటీ క్రమానికి విఘాతం కలుగుతుంది
- ప్రభుత్వం సమస్యను పరిష్కరించకుంటే... ఉత్తర్వుల జారీ వెనుకాడబోం
- సుప్రీంకోర్టు ధర్మాసనం



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

న్యాయమూర్తుల నియామకానికి సంబంధించిన కొలీజియం ప్రతిపాదనల పేర్లను ఆమోదించే సమయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న 'పిక్ అండ్ సెలెక్ట్' విధానంపై సుప్రీంకోర్టు మంగళవారం ఆందోళన వ్యక్తం చేసింది. న్యాయమూర్తుల కోసం సిఫార్సు చేసిన వారి సీనియారిటీకి ఈ విధానం భంగం కలిగించిందని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. 'ఈ పిక్ అండ్ సెలెక్ట్ ఆపివేయాలి. ఇది ఆఫ్ హ్యాండ్ రిమార్క్ కాదు' అని కోర్టు పేర్కొంది. సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల నియామకంలో కొలీజియం సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించడంలో జరుగుతున్న జాప్యాన్ని ప్రశ్నిస్తూ బెంగళూరు న్యాయవాదుల సంఘం దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు సంజయ్ కిషన్ కౌల్, సుధాన్షు ధులియాతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ప్రభుత్వం సమస్యను పరిష్కరించకుంటే ఈ అంశంపై ఉత్తర్వులు జారీ చేసేందుకు వెనుకాడబోమని న్యాయమూర్తులు తెలిపారు.

'కొలీజియం సిఫార్సుల ఆమోదించడంలో పురోగతి లేకపోవడంపై మేము అటార్నీ జనరల్ వద్ద ఆందోళన వ్యక్తం చేశాం. పెండింగ్‌లో ఉండటం చాలా ఆందోళన కలిగించే అంశం. కొలీజియం సిఫార్సుల్లో ప్రభుత్వం ఎంపిక చేస్తున్నందున ఇది చాలా ఆందోళన కలిగిస్తుంది. దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అటార్నీ జనరల్ తెలిపారు.

గత పరిస్థితి రాకూడదని మేము ఆశిస్తున్నాము. కొలీజియం లేదా ఈ కోర్టు ఆమోదయోగ్యం నిర్ణయాన్ని తీసుకుంటుంది' అని ధర్మాసనం పేర్కొంది. హైకోర్టుల నియామకాల కోసం సుప్రీంకోర్టు కొలీజియం న్యాయమూర్తుల పేర్లను ప్రతిపాదించినప్పుడు, ప్రభుత్వం, ప్రతిపాదిత పేర్ల నుండి ఎంపిక చేసుకునే బదులు, కొలీజియం చేసిన సిఫార్సుల క్రమంలో న్యాయమూర్తులను క్లియర్ చేయాలని కూడా ధర్మాసనం సూచించింది.

పంజాబ్, హర్యానా హైకోర్టులను ఉదాహరణను ఉదహరించిన ధర్మాసనం 'సుప్రీంకోర్టు కొలీజియం పంజాబ్, హర్యానా హైకోర్టులకు ఐదుగురు న్యాయవాదులను పదోన్నతి కల్పించాలని సిఫార్సు చేసింది. సీరియల్ నెంబర్ 1, 2లో ఉంచబడిన పేర్లను విస్మరించి, కేంద్రం కేవలం ముగ్గురి పేర్లను మాత్రమే క్లియర్ చేసింది' అని ధర్మాసనం పేర్కొంది. సెలెక్టివ్‌గా నియామకాలు జరిగితే సీనియారిటీ క్రమానికి విఘాతం కలుగుతుందని, తద్వారా యువ న్యాయవాదులు న్యాయమూర్తులుగా బాధ్యతలు చేపట్టేందుకు అనువుగా ఉండదని ధర్మాసనం పేర్కొంది.

పెండింగ్‌లో ఉన్న పేర్లపై సుప్రీంకోర్టు స్పందిస్తూ కొలీజియం ప్రతిపాదించిన 14 పేర్లు ఇప్పటికీ ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయని, కొలీజియం పునరుద్ఘాటించినప్పటికీ వాటిలో ఐదు పెండింగ్‌లో ఉన్నాయని ధర్మాసనం పేర్కొంది. 'ఈ బదిలీలు తప్పక జరగాలి. లేకుంటే అది వ్యవస్థలో విపరీతమైన క్రమరాహిత్యాన్ని సృష్టిస్తుంది' అని జస్టిస్ ఎస్‌కె కౌల్ అన్నారు.

సెంటర్ ఫర్ పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్ తరపున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపిస్తూ.. అటార్నీ జనరల్ ఇచ్చిన హామీలపై చర్యలు తీసుకోకుండా కోర్టు కొరడా ఝుళిపించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ కేసు తదుపరి విచారణను నవంబరు 20కు వాయిదా వేసింది.

ఎస్సీ, ఎస్టీల్లో 43 శాతం పేదరికంలోనే

- నెలవారీ కుటుంబ ఆదాయం రూ.ఆరు వేలే
- బీహార్ సామాజిక, ఆర్థిక నివేదికలో వెల్లడి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బీహార్‌లో షెడ్యూలు తరగతులు (ఎస్‌సి), షెడ్యూలు తెగలు (ఎస్‌టి)ల్లో దాదాపు సగం జనాభా పేదరికంలోనే మగ్గుతున్నట్లు వెల్లడయ్యింది. రాష్ట్రంలో ఇటీవల జరిగిన కులగణన ఆధారంగా ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితిపై గణాంకాలను ప్రభుత్వం మంగళవారం నాడు విడుదల చేసింది. రాష్ట్ర అసెంబ్లీలోనూ ఇందుకు సంబంధించిన నివేదికను సమర్పించింది. ఈ నివేదిక ప్రకారం.. 33.16 శాతం ఇతర వెనుక బడిన తరగతులు (ఒబిసిలు), 33.58 శాతం అత్యంత వెనుకబడిన తరగతులు (ఇబిసి)లు, 42.92 శాతం ఎస్‌సిలు, 42.7 శాతం ఎస్‌టిలు, 25.9 శాతం ఒసిలు పేదరికంలో ఉన్నట్లు పేర్కొన్నారు. పేదరికంలో మగ్గుతున్న కుటుంబాల్లో 34 శాతం మంది ఆదాయం నెలకు రూ.6 వేలుగా ఉన్నట్లు తెలిపారు. 29 శాతం కుటుంబాల ఆదాయం నెలకు రూ.10 వేలు లోపు ఉంది. కాగా మొత్తం కుటుంబాల్లో 28 శాతం కుటుంబాలు నెలకు రూ.10 వేలు నుంచి రూ.50 వేలు లోపు ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. మొత్తం జనాభాలో కేవలం 4 శాతం కుటుంబాలే రూ.50 వేలు పైబడి నెలకు ఆదాయం పొందుతున్నారు.

బీహార్ ప్రభుత్వం గత అక్టోబర్ 2న సామాజిక తరగతుల వారిగా జనగణన వివరాలను వెల్లడించగా, ఇప్పుడు ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితికి సంబంధించిన గణాంకాలను విడుదల చేసింది. ఇతర వెనుకబడిన తరగతులు (ఒబిసి)ల్లో యాదవులు 35.8 శాతం, కుష్వాహ్ (34.3 శాతం), కుర్మీ (29.9 శాతం), బనియా (24.6 శాతం), మోమిన్ ముస్లిం (26.7 శాతం), ధునియా ముస్లిం (31.4 శాతం) బింద్ (44.1 శాతం) పేదరికంలో ఉన్నారు. జనరల్ కేటగిరిలో ఉన్న పెత్తందారి కులాలకు చెందినవారిలో భూమిహార్లు 27.58 శాతం, బ్రాహ్మణ కుటుంబాల్లో 25.52 శాతం, 24.89 శాతం రాజ్‌పుత్‌లు పేదరికం అనుభవిస్తున్నారు. కాయస్థులు అత్యంత సంపన్న సామాజిక తరగతికి చెందినవారుగా నిలిచారు. వీరిలోనూ 13.38 శాతం కాయస్థులు పేదరికంలో ఉన్నారు. ముస్లింల్లో షేక్, పఠాన్, సయ్యద్‌ల ఆర్థిక స్థితిగతులను కూడా ప్రభుత్వం విడుదల చేసింది. షేక్ సామాజిక తరగతికి చెందిన వారిలో 25.84 శాతం మంది పేదలుగా ఉన్నారు. పఠాన్లలో 22.20 శాతం కుటుంబాలు, సయ్యద్‌లలో 17.61 శాతం కుటుంబాలు పేదరికంలో ఉన్నాయి.

కేరళ పర్యటకానికి ప్రతిష్టాత్మక పురస్కారం

తిరువనంతపురం : వామపక్ష ప్రజాతంత్ర కూటమి (ఎల్‌డిఎఫ్) ప్రభుత్వ పాలనలో కేరళ అన్ని రంగాల్లోనూ దూసుకెళ్తోంది. ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోంది. ఈ క్రమంలోనే రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధి కోసం ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. 2023 సంవత్సరానికి గానూ ప్రతిష్టాత్మకమైన 'గ్లోబల్ రెస్పాన్సిబుల్ టూరిజం' అవార్డును కేరళ కైవసం చేసుకుంది. స్థానిక ప్రజలకు, ప్రత్యేకంగా మహిళలకు గణనీయమైన ప్రయోజనాలను కల్పిస్తూ ప్రకృతిని, తరాలుగా వస్తున్న వారసత్వ సంపదను పరిరక్షిస్తూ కేరళ చేస్తున్న కృషికి ఎన్నో ప్రపంచ ప్రతిష్టాత్మక అవార్డులు లభిస్తున్నాయి. తాజాగా గెలుపొందిన గ్లోబల్ రెస్పాన్సిబుల్ టూరిజం అవార్డును రెస్పాన్సిబుల్ టూరిజం పార్టనర్‌షిప్, ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ రెస్పాన్సిబుల్ టూరిజం (ఐసిఆర్‌టి), బెస్ట్ ఫర్ లోకల్ సోర్సింగ్, ఫుడ్ అండ్ క్రాఫ్ట్ విభాగం సంయుక్తంగా ఏర్పాటుచేశారు. 'మిషన్ 2030' ద్వారా రాష్ట్ర జిడిపిలో టూరిజం వాటాను 12-20 శాతానికి పెంచాలని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం నిర్ణయించింది.

ప్రజాస్వామ్య నిబంధనలన్నీ గాలికొదిలేశారు !

- రాష్ట్రపతికి అదీర్ రంజన్ లేఖ

న్యూఢిల్లీ : చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ (సిఐసి) నియామకపు ప్రక్రియ గురించి తనకేమీ తెలియనివ్వకుండా చీకటిలోకి నెట్టేసారని, ప్రజాస్వామ్య నిబంధనలు, పద్ధతులన్నీ గాలికి వదిలేశారని కాంగ్రెస్ ఎంపి, సెలక్షన్ కమిటీ సభ్యుడు అదీర్ రంజన్ చౌదరి విమర్శించారు. దీనిపై ఆయన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాశారు. ప్రతిపక్షాల వాణిని నిర్లక్ష్యం చేశారని, ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదని అన్నారు. చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్‌గా మాజీ ఐఎఎస్ ఆఫీసర్ హీరాలాల్ సమారియా చేత ఈ నెల 6వ తేదీన రాష్ట్రపతి ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రధాని మోడీ నేతృత్వాన సెలక్షన్ కమిటీ సమావేశం సమయాన్ని నవంబరు 3వ తేదీన సాయంత్రం నుండి ఉదయానికి మార్చాల్సిందిగా తాను కోరానని, సమావేశం సమయాన్ని మార్చకపోగా, కనీసం తీసుకున్న నిర్ణయాల గురించి కూడా తనకు తెలియచేయలేదని ఆ లేఖలో ఆయన పేర్కొన్నారు. ప్రధానమంత్రి, హోం మంత్రి మాత్రమే ఆనాటి సమావేశానికి హాజరయ్యారని, సెలక్షన్ కమిటీ సభ్యుడిగా ప్రతిపక్షానికి చెందిన తాను లేనని, అయినా సమావేశం జరిగిన గంటల వ్యవధిలోనే ఎంపిక చేసిన అభ్యర్థుల పేర్లను ప్రకటించడం, నోటిఫై చేయడం, ప్రమాణ స్వీకారం జరగడం అన్నీ అయిపోయాయని అన్నారు. ఈ తీరు ప్రజాస్వామ్యానికి ఎంత మాత్రమూ మంచి సంకేతం కాదని ఆయన ఆ లేఖలో స్పష్టం చేశారు.

'నేర' చట్టాల సవరణ బిల్లులకు స్థాయీ సంఘం ఆమోదం

- అసమ్మతి తెలిపేందుకు సమయం కోరిన ప్రతిపక్ష సభ్యులు

న్యూఢిల్లీ బ్యూరో

ఇండియన్ పీనల్ కోడ్ (ఐపిసి), క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సిఆర్‌పిసి), ఎవిడెన్స్ చట్టాలను మార్చడానికి ఉద్దేశించిన మూడు బిల్లులను పరిశీలించిన హోం వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ నివేదికలను ఆమోదించింది. ప్యానెల్‌లోని ప్రతిపక్ష సభ్యులు భిన్నాభిప్రాయాలను సమర్పించి నప్పటికీ ఈ నిర్ణయం తీసుకుంది. అయితే బిల్లుల్లో పలు మార్పులు చేయాలని నివేదిక సూచించినట్లు తెలిసింది. కేంద్ర మాజీ హోం మంత్రి పి. చిదంబరం సహా కొందరు సభ్యులు అసమ్మతి నోట్లు సమర్పించేందుకు మరికొంత సమయం కోరారు. వారికి బుధవారం వరకు గడువు ఇచ్చారు. చిదంబరం, టిఎంసి సభ్యులు డెరెక్ ఓ బ్రియాన్, కకోలి ఘోష్ దస్తిదార్ సవివరమైన అసమ్మతి నోట్‌లను సమర్పిస్తారని ప్రతిపక్ష వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్‌కు చెందిన అధిర్ రంజన్ చౌదరి, దిగ్విజయ సింగ్, డీఎంకేకు చెందిన ఎన్ఆర్ ఎలాంగో సహా పలువురు సభ్యులు ఇప్పటికే అసమ్మతి నోట్లు సమర్పించారు. ప్యానెల్‌లోని మొత్తం 10 మంది ప్రతిపక్ష సభ్యులు వేర్వేరుగా అసమ్మతి నోట్లు సమర్పించనున్నట్లు వర్గాలు తెలిపాయి. సోమవారం జరిగిన సమావేశంలో చిదంబరం పలు సూచనలు చేస్తూ సుదీర్ఘంగా మాట్లాడినట్లు తెలిసింది. బిల్లుల్లో హిందీని ఉపయోగించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ప్రతిపక్ష సభ్యుల్లో కొందరు అభిప్రాయపడ్డారు. అయితే బిల్లులకు ఇచ్చిన హిందీ పేర్లను కమిటీ పేర్కొంది. భారతీయ శిక్షాస్మృతిని మార్చుతూ తీసుకొచ్చిన భారతీయ న్యాయ సంహిత, చిన్న దొంగతనం, పరువు నష్టం, ఆత్మహత్యాయత్నం వంటి కొన్ని నేరాలకు శిక్షకు ప్రత్యామ్నాయ రూపంగా సమాజ సేవను సూచించింది. కొంతమంది సభ్యులు కమిటీ సమాజ సేవను నిర్వచించాలని, అది ఊహించినదంతా చేయాలని కోరారు. అంతేకాకుండా, కొంతమంది సభ్యులు ఇప్పుడు కొత్త శిక్షా చట్టం కింద ఉగ్రవాదం, అవినీతి, వ్యవస్థీకృత నేరాలను తీసుకురావడానికి అనుకూలంగా లేరు.

సమాన పనికి సమాన వేతనం

- మహిళా నిర్మాణ కార్మికుల డిమాండ్

కన్యాకుమారి : సమాన పనికి సమాన వేతనం అందజేయాలని, పని ప్రదేశంలో లైంగిక వేధింపులను అడ్డుకునేందుకు చట్టాన్ని తీసుకురావాలని మహిళా నిర్మాణ కార్మికుల జాతీయ సదస్సు డిమాండ్ చేసింది. తమిళనాడులోని కన్యాకుమారిలో భారత నిర్మాణ కార్మికుల సమాఖ్య (సిడబ్ల్యూఎఫ్ఐ) ఆధ్వర్యంలో సోమవారం జాతీయ సదస్సు నిర్వహించారు. దేశంలోని 70 లక్షల మంది మహిళా నిర్మాణ కార్మికులు తీవ్రమైన శ్రమ దోపిడీకి గురవుతున్నారని, పురుషుల కంటే తక్కువ వేతనాలు పొందుతున్నారని, పని ప్రదేశంలో లైంగిక వేధింపులు జరుగుతున్నాయని సదస్సు తెలిపింది. నిర్మాణ రంగంలో మహిళల ప్రాతినిధ్యం పెరుగుతున్న నేపథ్యంలో పురుషులతో సమానంగా వేతనాలు అందజేయాలన్న డిమాండ్ సహా మొత్తం ఎనిమిది డిమాండ్లను సదస్సు లేవనెత్తింది. జనవరిలో విడుదలైన ఓ నివేదిక ప్రకారం నిర్మాణ రంగంలో పురుషులతో పోలిస్తే మహిళలకు 30-40% తక్కువ వేతనాలు లభిస్తున్నాయి. ఎన్ని సంవత్సరాలు పనిచేసినప్పటికీ వారిని నైపుణ్యం లేని కార్మికులుగానే పరిగణిస్తున్నారు. తక్కువ వేతనాలు పొందుతున్నా ఎప్పుడు ఉపాధి కోల్పోతారో తెలియని పరిస్థితి నెలకొంది. పిల్లల విద్యాభ్యాసం కోసం మహిళా కార్మికులకు ఆర్థిక సాయం అందించాలని, వైద్య బీమా కల్పించాలని, మెటర్నరీ ప్రయోజనాలు అందజేయాలని, రిటైరైన తర్వాత పెన్షన్ ఇవ్వాలని సదస్సు రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేసింది. 2006 నాటి జాతీయ క్రెచ్ పథకాన్ని సరిగా అమలు చేయాలని కోరింది. ఈ పథకానికి కేంద్రం నిధుల కేటాయింపును తగ్గిస్తూ దానిని నీరుకారుస్తోందని విమర్శించింది. కాగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను 200 మంది మహిళా కార్మికులు సదస్సులో వివరించారు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నుండి రూ.1,600 కోట్లను వేరే పథకాలకు మళ్లించిందని ఆరోపించారు.

తెలంగాణలో సకల జనుల వ్యతిరేక ప్రభుత్వం

- హైదరాబాద్ సభలో ప్రధాని నరేంద్రమోడీ



ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో బిసి సామాజిక తరగతులకు న్యాయం జరగాలన్నా, బిసి ఎమ్మెల్యే సిఎం కావాలన్నా బిజెపిని గెలిపించాలని ప్రధాన మంత్రి నరేంద్రమోడీ పిలుపునిచ్చారు. పేదలకు వచ్చే ఐదేళ్లపాటు ఉచిత రేషన్ ఇస్తామని చెప్పారు. హైదరాబాద్‌లోని ఎల్‌బి స్టేడియంలో బిజెపి ఆధ్వర్యంలో బిసి ఆత్మగౌరవ సభను మంగళవారం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా మోడీ హాజరై మాట్లాడారు. తెలంగాణలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి వ్యతిరేక, అవినీతి ప్రభుత్వం ఉందని విమర్శించారు. నవంబర్ 30వ తేదీ తర్వాత తెలంగాణలో బిఆర్‌ఎస్ సర్కార్ కనుమరుగై కమల వికాసం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతో అధికారంలోకి వచ్చిన కెసిఆర్ సర్కార్ ఆ మూడింటినీ విస్మరించిందన్నారు. బిఆర్‌ఎస్‌కు సి టీమ్ కాంగ్రెస్ అనీ, ఆ రెండు పార్టీల డిఎన్ఎ ఒక్కటేనని విమర్శించారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో బిఆర్‌ఎస్‌కు చెందిన వారున్నారనీ, తప్పులు చేయడమే కాకుండా దర్యాప్తు సంస్థలపై కూడా విమర్శలు గుప్పిస్తున్నారని అన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ మాట్లాడుతూ... సకల జనులు ఉద్యమిస్తేనే తెలంగాణ సాకారమైందని తెలిపారు. ఏ ఆశయం కోసం ప్రజలు కొట్లాడారో అవి నెరవేరలేదన్నారు. ప్రధాని మోడీ బలమైన నాయకుడనీ, ఆయన ప్రధానిగా వచ్చిన తర్వాత దేశంలో ఉగ్రవాద దాడులు తగ్గాయని అన్నారు. మోడీ మరోసారి ప్రధాని కావాలని ఆకాంక్షించారు. సభలో బిజెపి తెలంగాణ అధ్యక్షులు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కె.లక్ష్మణ్, బండి సంజయ్, ఈటల రాజేందర్ పాల్గొన్నారు.

తెలంగాణలో మరో 3 స్థానాల్లో సిపిఎం పోటీ

5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు 2023

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 16 నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించామని, తాజాగా మరో మూడు స్థానాలకు ఎంపిక చేశామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇల్లందు నియోజకవర్గం నుంచి గిరిజన సంఘం నాయకులు దుగ్గి కృష్ణ, ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని కోదాడ నుంచి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మట్టిపల్లి సైదులు, మునుగోడు నుంచి దోనూరి నర్సిరెడ్డి బరిలో ఉంటారని తెలిపారు. కాంగ్రెస్‌తో పొత్తు ఉన్నప్పటికీ సిపిఐ మునుగోడు కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని సమర్థించట్లేదన్నారు. ఆ స్థానం నుంచి పోటీ చేసే తమ పార్టీ అభ్యర్థికి సిపిఐ మద్దతు ఇవ్వాల్సిందిగా కోరారు.

గాజాలో హరించుకుపోతున్న ఇంధన నిల్వలు !

- మూతపడుతున్న ఆస్పత్రులు, సేవల కేంద్రాలు



గాజాలోని అల్ సఫియా ఆసుపత్రిలోని శరణార్థి శిబిరంలో చిన్నారులు

గాజా, జెరూసలేం : ఎంతగానో అవసరమైన ఇంధన నిల్వలు తరిగిపోతుండడంతో యుద్ధంతో అతలాకుతలమవుతున్న గాజాలోని ఆరోగ్యం, పారిశుధ్యం, నీరు, ఆహార సర్వీసులు దాదాపు 'బ్రేకింగ్ పాయింట్' కు చేరుకుంటున్నాయని ఐక్యరాజ్య సమితి పేర్కొంది. ఇప్పటివరకు గాజా స్ట్రిప్‌కు 569 ట్రక్కుల సాయం వచ్చింది కానీ వాటిల్లో ఏ ఒక్క దాంట్లోనూ ఇంధనం లేదని ఐక్యరాజ్య సమితి మానవతా వ్యవహారాల సమన్వయ కార్యాలయ ప్రతినిధి (ఒసిహెచ్ఎ) జేన్స్ లారెకె వ్యాఖ్యానించారు. "మరిన్ని కార్యాలయాలు, సేవల కేంద్రాలు మూతపడుతున్నాయి. ప్రాణాలను కాపాడే మార్గాలు కూడా మూసుకుపోతున్నాయి." అని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధి క్రిస్టినా లిండ్‌మేరర్ వ్యాఖ్యానించారు. గాజాలోకి ఇంధనాన్ని అనుమతించే విషయమై జరుగుతున్న చర్చల్లో కొంత పురోగతి వుందంటూ గత వారం ఐక్యరాజ్య సమితి ఎయిడ్ చీఫ్ మార్టిన్ గ్రిఫిత్స్ పేర్కొన్నారు. కానీ ఆ చర్చలు విఫలమైనట్లు కనిపిస్తోంది. గాజాను పూర్తిగా దిగ్బంధించాలన్న వ్యూహంలో భాగంగా ఇజ్రాయిల్ ఆ ప్రాంతంలోకి విద్యుత్ సరఫరాను నిలిపివేసి, ఇంధనాన్ని ప్రవేశించకుండా దిగ్బంధించింది. దాదాపు రెండు దశాబ్దాలుగా గాజాపై ఇజ్రాయిల్ భూ, వైమానిక, సముద్ర ఆంక్షలను అమలు చేస్తోంది.

దాడులతో బందీలను విడుదల చేయలేకపోతున్నాం

గాజాలో బందీలుగా వున్న 12మందిని విడుదల చేయడానికి తాము సిద్ధంగా వున్నప్పటికీ ఇజ్రాయిల్ వైమానిక, పదాతి దాడుల కారణంగా విడుదల చేయలేకపోతున్నామంటూ హమస్ సాయుధ విభాగం ఖ్వాసమ్ బ్రిగేడ్స్ తెలిపింది. ఈ మేరకు టెలిగ్రామ్ చానెల్‌లో పోస్టు పెట్టింది. 241మందిని బందీలుగా చేపట్టారని ఇజ్రాయిల్ పేర్కొంటోంది.

వారిలో ఇప్పటివరకు నలుగురిని విడుదల చేవారు. వారిలో ఇద్దరు ఇజ్రాయిలీలు కాగా మరో ఇద్దరు అమెరికన్లు.

బలయ్యేది పిల్లలే !

ప్రతి రోజూ గాజాలో సగటున 134మంది పిల్లలు యుద్ధానికి బలవుతున్నారు. ఇప్పటివరకు నెల రోజుల్లో 4,237మంది చిన్నారులు మృతి చెందారని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ నెల రోజుల్లో గాజాలో 10,328మంది పాలస్తీనియన్లు మరణించగా, ఇజ్రాయిల్‌లో 1400మందికి పైగా చనిపోయారు.

ఇజ్రాయిల్‌కు ఆయుధాలు తెస్తున్న నౌక దిగ్బంధం

ఆయుధాలు, ఇతర మిలటరీ పరికరాలను తీసుకుని ఇజ్రాయిల్‌కు వెళ్ళడానికి వాషింగ్టన్‌లోని ఒక ఓడరేవులో సిద్ధంగా వున్న నౌకను వందలాదిమంది అమెరికన్ ఆందోళనకారులు అడ్డగించారు. గాజాలో తక్షణమే కాల్పుల విరమణ జరగాలని వారు డిమాండ్ చేశారు.

వీధినపడ్డ 3.9 లక్షల ఉద్యోగులు

- గాజా, వెస్ట్‌బ్యాంక్‌పై ఇజ్రాయిల్ దాడి ఫలితం
- యుద్ధం కొనసాగితే పరిస్థితి మరింత తీవ్రమవుతుందన్న ఐఎల్ఓ



గాజా స్ట్రిప్ : పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ జరుపుతున్న అమానుష దాడుల కారణంగా గాజా స్ట్రిప్, వెస్ట్‌బ్యాంక్ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పరిస్థితి దారుణంగా తయారైంది. లక్షలాది మంది ప్రజలు ఉద్యోగాలు, ఉపాధికి దూరమై అవస్థలు పడుతున్నారు. గాజా స్ట్రిప్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల్లో 61% మంది అంటే 1.82 లక్షల మంది జీవనోపాధి కోల్పోయి వీధిన పడ్డారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) తన నివేదికలో ఈ విషయాన్ని బయటపెట్టింది. హమాస్‌తో ఇజ్రాయిల్ యుద్ధం ప్రారంభించినప్పటి నుండి గాజాలో మౌలిక సదుపాయాలు దారుణంగా దెబ్బతిన్నాయని, వ్యాపారాలు మూతపడ్డాయని, ప్రజలు పెద్ద ఎత్తున నిరాశ్రయులయ్యారని, ఆహారం, తాగునీరు, ఇంధనానికి కొరత ఏర్పడిందని ఆ నివేదిక తెలిపింది. మొత్తంగా అక్కడ ఆర్థిక కార్యకలాపాలు స్తంభించిపోయాయని వివరించింది. యుద్ధం ప్రభావం వెస్ట్‌బ్యాంక్‌పై కూడా పడింది. అక్కడ మొత్తం ఉద్యోగుల్లో 24% మంది అంటే 2.08 లక్షల మంది ఉద్యోగాలు కోల్పోయారు. ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణహోమం కారణంగా ఈ రెండు ప్రాంతాల్లో 3,90,000 మందికి ఉపాధి కరువైంది. మరో మాటలో చెప్పాలంటే దినసరి వేతన కార్మికులు రోజుకు 16 మిలియన్ డాలర్ల ఆదాయాన్ని కోల్పోతున్నారు.

ఇజ్రాయిల్ తన దాడులను మరింత ఉధృతం చేస్తే ఉపాధి కోల్పోయే వారి సంఖ్య ఇంకా పెరుగుతుందని, మానవతావాద సంక్షోభం తీవ్రతరమవుతుందని ఐఎల్ఓ హెచ్చరించింది. గాజాలో నెలకొన్న పరిస్థితి కారణంగా కార్మిక మార్కెట్, ఉద్యోగావకాశాలు, ప్రజల జీవన స్థితిగతుల పైన తీవ్రమైన ప్రభావం పడింది. 'మా ప్రాథమిక అంచనాలను పరిశీలిస్తే ఆందోళనకరమైన, బాధాకరమైన ఫలితాలు వస్తున్నాయి. ఘర్షణ కొనసాగితే పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుంది' అని అరబ్ దేశాలకు సంబంధించిన ఐఎల్ఓ ప్రాంతీయ డైరెక్టర్ రూబా జరాదత్ చెప్పారు. ఈ సంక్షోభం ప్రాణనష్టానికి, కనీస మానవ అవసరాలకు మాత్రమే పరిమితం కాలేదని, సామాజిక, ఆర్థిక సంక్షోభానికి కూడా దారి తీస్తోందని ఆమె తెలిపారు. వ్యాపారాలు, ఉద్యోగాలు కోల్పోయిన వారు కోలుకోవడానికి చాలా కాలం పడుతుందని అన్నారు. గాజాకు మానవతావాద సాయాన్ని పూర్తి స్థాయిలో, ఎలాంటి అవరోధాలు లేకుండా తక్షణమే అందించాల్సిన అవసరం ఉన్నదని ఐఎల్ఓ పాలక మండలి పిలుపునిచ్చిందని ఆమె చెప్పారు. బాధిత ఉద్యోగులు, వ్యాపారులకు వెంటనే సాయం అందించేందుకు ప్రభుత్వంతో, యాజమాన్యాలతో, ఇతర ఐరాస సంస్థలతో కలిసి అవిశ్రాంతంగా కృషి చేస్తున్నామని రూబా జరాదత్ తెలిపారు. బాధితులను ఆదుకునేందుకు ఐఎల్ఓ మూడు దశలుగా కార్యక్రమాలు చేపడుతోంది. మొదటి దశలో భాగంగా తక్షణ సాయంతో సహాయక చర్యలు ప్రారంభించింది. అత్యవసర సహాయం అందజేయడానికి వీలుగా 1.1 మిలియన్ డాలర్లను సేకరించింది. జరిగిన నష్టంపై సమాచారాన్ని సేకరించి, ఉద్యోగాలు కోల్పోయిన వారికి ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తోంది.

ఇజ్రాయిల్ నుంచి దౌత్యాధికారులను ఉపసంహరించుకున్న దక్షిణాఫ్రికా

జొహానెస్‌బర్గ్: గాజాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న సామూహిక హత్యాకాండకు నిరసనగా దక్షిణాఫ్రికా టెల్ అవీవ్ నుంచి తన రాయబారులను వెనక్కి పిలిపించింది. గాజాలో పరిస్థితిపై సంప్రదింపులు జరిపేందుకు రాయబారులను వెనక్కి రప్పించాలని కేబినెట్ నిర్ణయించినట్లు మంత్రి కుంబుడో నిత్సావెహ్ని మంగళవారం నాడిక్కడ మీడియాకు తెలియజేశారు. ఇజ్రాయిల్ అంతర్జాతీయ చట్టాలను గౌరవించాలని, తక్షణమే కాల్పుల విరమణ ప్రకటించాలని దక్షిణాఫ్రికా ఇప్పటికే హెచ్చరించింది.

స్టార్మర్ వైఖరికి నిరసనగా 11 మంది లేబర్ పార్టీ కౌన్సిలర్లు రాజీనామా

కాల్పుల విరమణ డిమాండ్‌ను మొండిగా తిరస్కరిస్తూ, ఇజ్రాయిల్‌కు వత్తాసు పలుకుతున్న లేబర్ పార్టీ నేత కీర్ స్టార్మర్ తీరుపై ఆ పార్టీలోనే తిరుగుబాటు మొదలైంది. స్టార్మర్ వైఖరి పార్టీ మౌలిక లక్ష్యాలకు విరుద్ధమంటూ బర్న్లీ కౌన్సిల్‌కు చెందిన 11 మంది కౌన్సిలర్లు మంగళవారం పార్టీకి రాజీనామా చేశారు. పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా బ్రిటిష్ ప్రజలు గత నాలుగు వారాలుగా వీకెండ్లలో భారీ ర్యాలీలు జరుపుతున్నా స్టార్మర్ వైఖరిలో ఎలాంటి మార్పు లేదన్నారు. నాయకత్వ మైండ్ సెట్ ఏమిటో అర్థం కావడం లేదన్నారు. రెండు దేశాల పరిష్కారాన్ని తుంగలో తొక్కేందుకు ఇజ్రాయిల్ నిరంతరం కుట్రలు పన్నుతోందని, క్రిస్టియన్లను, ముస్లింలను తమ సొంత గడ్డ నుంచి తరిమేయాలని చూస్తోందని వారు విమర్శించారు. ఇంత జరుగుతున్నా కాల్పుల విరమణ గురించి మాట్లాడకుండా 'హ్యూమానిటేరియన్ పాజ్' గురించి స్టార్మర్ మాట్లాడుతున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి చెత్తవాగుడు వాగుతున్న ఆయన వెంటనే పార్టీ పదవి నుంచి తప్పుకోవాలని పలువురు లేబర్ పార్టీ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. స్టార్మర్ నీతి బాహ్యమైన చర్యలను భరించలేకే తాము పార్టీ నుంచి వైదొలగుతున్నామని వారు తెలిపారు.

జింబాబ్వేలో ప్రబలుతున్న కలరా

- 5 రోజుల్లో 68 కొత్త కేసులు

హరారే: జింబాబ్వేలో కలరా వ్యాధి ప్రబలుతోంది. నవంబర్ మొదటి ఐదు రోజులలో 68 కొత్త కేసులు నమోదయ్యాయి, దేశ రాజధాని హరారేకి దక్షిణాన ఉన్న చిటుంగ్విజా అనే డార్మిటరీ పట్టణం కలరా హాట్‌స్పాట్‌లలో ఒకటి. 3,71,000 దాకా జనాభా ఉన్న ఈ పట్టణం హెల్త్ ఎమర్జెన్సీ అలర్ట్ ప్రకటించారు. అధికారిక సమాచారం ప్రకారం, ఐదు రోజులలో 137 అనుమానిత కేసులు, 28 ధ్రువీకరించబడిన కేసులు నమోదయ్యాయి. దేశ రాజధాని హరారేలో 51 అనుమానిత కేసుల్లో తొమ్మిది నిర్ధారణ అయ్యాయి. హరారే మాదిరిగానే, చిటుంగ్‌విజా పట్టణం తీవ్ర తాగు నీటి ఎద్దడిని ఎదుర్కొంటోంది. మురుగు పైపుల లీకేజీల వల్ల తరచూ భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయి.ఆదివారం నాటికి, జింబాబ్వే మొత్తం మీద 6,486 అనుమానిత కలరా కేసులు నమోదు కాగా, 1,127 కేసులు నిర్ధారణ అయ్యాయి. 44 మంది కలరాతో చనిపోయారు. మరో 137 మరణాలు కలరా వల్ల సంభవించినవేనని అనుమానిస్తున్నారు. తూర్పు జింబాబ్వేలోని మణికాలాండ్ ప్రావిన్స్‌లో అత్యధికంగా 694 నిర్ధారణ అయిన కేసులు నమోదయ్యాయి. 23 మరణాలు చోటుచేసుకున్నాయి.సమాచార,ప్రసార శాఖ మంత్రి జెన్‌ఫాన్ ముస్వెరే మీడియాతో మాట్లాడుతూ, పేలవమైన పారిశుధ్యం ,సురక్షితమైన నీటిని సరిపడా అందించకపోవడం కలరా ప్రబలడానికి కారణంగా పేర్కొన్నారు.



మీ కోసం

పాలు కాచే గిన్నెలో కాసేపు నీళ్లు పోసి ఉంచాలి. తరువాత ఆ నీళ్లను పారబోసి ఆ గిన్నెలో పాలు కాస్తే, అడుగున పేరుకుపోకుండా ఉండి గిన్నెను సులభంగా శుభ్రం చేసుకోవచ్చు.

జీవన సౌరభం

లక్ష్యం అవకాశం కాదు..
ఎదురు చూడాల్సిందీ
కాదు..
ఎన్నుకోవాల్సింది.

కాకమ్మా రావమ్మా!



కాకమ్మా, రావమ్మా!
కాకమ్మా కాకమ్మా
గాల్లో ఎగురుతూ రావమ్మా
ఊళ్ళో కబుర్లు చెప్పమ్మా

గేదె మీద వాలమ్మా
చెవులు ముక్కు చూడమ్మా
శుభ్రం చేసి పోవమ్మా

మా ఇంటికి రావమ్మా
కావ్ కావ్ మని నువ్వు
తాత్తాత్తాతని నేను
తాత సరదా తీర్చేద్దాం!

కబుర్లు చెప్తూ గడిపేద్దాం
దసరా పాటలు పాడేద్దాం

– కాశీ విశ్వనాథం పట్రా యుడు,
94945 24445.

లెక్కలు చేద్దాం

1. 13 + ☐ − 7 = 8
2. 5 + 4 + 3 = ☐
3. ☐ + 6 − 4 = 5
4. 8 − 1 + ☐ = 11
5. 10 − ☐ − 3 = 0

పిల్లలూ, ఇక్కడ +, - ఉపయోగించి కొన్ని లెక్కలు ఇచ్చాం. ఖాళీ గళ్లల్లో సరైన అంకెలు వేసి సమాధానాలు రాబట్టండి చూద్దాం.

నేను గీసిన బొమ్మ





బి.వర్షిణిప్రియ,
6వ తరగతి,
జెడ్‌పిహెచ్‌ఎస్, కోన.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఆమె మన కాలం 'ఉక్కు' మహిళ

విశాఖ ఉక్కు కర్మాగారం.. త్యాగాల మణిమకుటం. వేలాది మంది ఉపాధికి కల్పతరువు. రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధిలో ఈ ఫ్యాక్టరీదే కీలకపాత్ర. నేడు విశాఖ, అందునా గాజువాక ఇంతలా అభివృద్ధి చెందాయంటే దీని చలవే. కార్మికుల కష్టంతో లాభాల బాటన నడిచిన ఈ కర్మాగారానికి 2021 నుంచి కష్టకాలమొచ్చింది. కేంద్రంలోని మోడీ సర్కారు ఈ కర్మాగారాన్ని ప్రయివేటుపరం చేయాలని నిర్ణయించింది. ఆ సమయంలో యావత్తు విశాఖ భగ్గుమంది. నాటి నుంచి ఆందోళనలు, నిరసనలు సాగుతూనే ఉన్నాయి. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. వీటిలో ఉక్కు కార్మికులు, ప్రజలు పాల్గొంటున్నా ఓ పెద్దావిడ మాత్రం ప్రత్యేకంగా నిలుస్తోంది. ఒకటీ, రెండూ కాదు.. వెయ్యి రోజులుగా జరుగుతున్న రిలే దీక్షల్లో ఆమె ప్రతి రోజూ కూర్చుని ఉద్యమ స్ఫూర్తిని నింపుతోంది. ఆమె పేరు బొడ్డ వెంకటమ్మ. ఆమె అంకితభావం, ప్రభుత్వ రంగ సంస్థ అయిన స్టీల్‌ప్లాంట్‌ను కాపాడు కోవాలన్న తాపత్రయం, భావితరాలకు ఈ ప్లాంట్‌ను అందించాలన్న ఆకాంక్ష అభినందనీయం.

బొడ్డ వెంకటమ్మ కూర్మన్నపాలెం సమీపంలోని కాశీపాలెంలో ఓ రేకుల ఇంటిలో ఉంటోంది. పేద కుటుంబం. భర్త అనారోగ్యంతో కన్నుమూశారు. కూతురు పొందూరు ధనలక్ష్మి నడుపుతున్న చిన్నపాటి దుకాణమే ఆధారం. వెంకటమ్మ నివాసం ప్రస్తుతం స్టీల్‌ప్లాంట్ ప్రాజెక్టు ఆఫీసు ఉన్న ప్రాంతంలో నాడు ఉండేది. అక్కడ వంద కుటుంబాల వరకూ అప్పట్లో ఉండేవి. వారంతా ప్రస్తుత హెచ్ఎస్ఎల్, కొవ్వొత్తుల జంక్షన్, పెట్రోల్ బంకు ఏరియాల్లో నాడు ఉండేవారు. 1984 ప్రాంతంలో స్టీల్‌ప్లాంట్ అవసరాల నిమిత్తం భారీ పైపులైను, డ్రెయినేజీ సిస్టం అవసరమయ్యాయి. దీంతో ప్రభుత్వం నాటి కాశీపాలెం గ్రామాన్ని నేటి కూర్మన్నపాలెం, వడ్లపూడి చెంతకు తరలించింది. ఈ క్రమంలో అక్కడి కాశీపాలెం వాసులంతా నిర్వాసితులుగా మిగిలారు. వారికి స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగాలిచ్చి ఆదుకోవాల్సి ఉన్నప్పటికీ 21 మందికి మాత్రమే ఉపాధి కల్పించి నాటి అధికారులు, పాలకులు చేతులు దులుపుకున్నారు. నాడు నష్టపోయిన వారిలో వెంకటమ్మ కుటుంబమూ ఒకటి. నేటికీ వీరి కుటుంబానికి ఎటువంటి ఆదరవూ లేదు. వెంకటమ్మ భర్త కామయ్య స్టీల్‌ప్లాంట్ తొలినాళ్లలో కన్‌స్ట్రక్షన్ పనులు చేసి వచ్చిన అరకొర డబ్బులతో కుటుంబాన్ని నెట్టుకొచ్చాడు. ఆ తరువాత ఆయన చనిపోయాడు. కుటుంబ భారం వెంకటమ్మపై పడింది. దీంతో ఆమె స్టీల్‌ప్లాంట్‌లోనే చిన్నచిన్న పనులు చేస్తూ బతికింది. కాంక్రీటు పనులు చేసింది. అధికారులకు నీళ్లు అందించడం, మొక్కలకు నీరు పెట్టడం వంటివి చేసేది. ఆమెకు రోజంతా కష్టపడితే రూ.80కి మించి వచ్చేది కాదు.

స్టీల్‌ప్లాంట్‌లోని ఎస్ఎంఎస్ – 2, డబ్ల్యుఆర్ఎం తదితర విభాగాల్లో ఆమె చిన్నచిన్న పనులు చేస్తే చివరకు నెలకు రూ.6700 దక్కేది.



ఆ డబ్బులే తనకు కొండంత అండగా ఉండేవని వెంకటమ్మ నేటికీ చెబుతుంది.

ప్లాంట్ పరిరక్షణ కోసం దీక్ష


కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 2021 జనవరి 27న స్టీల్‌ప్లాంట్‌ను నూరు శాతం అమ్మేస్తామని ప్రకటించింది. దక్షిణ కొరియాకు చెందిన పోస్కో కంపెనీకి అమ్మి కమీషన్ కొట్టేయాలని బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు పథకం వేశాయి. ఈ కుట్రలను గుర్తెరిగి స్టీల్‌ప్లాంట్‌లోని కార్మికులంతా ఏకమై విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన ఉద్యమానికి దిగారు. ఈ క్రమంలోనే కూర్మన్నపాలెం కూడలి వద్దనున్న స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద టెంట్ వేసి దీక్షా శిబిరాన్ని ప్రారంభించారు. దీన్ని ఎంతకాలం నడపగలమన్న భావన తొలినాళ్లలో కొందరిలో ఉండేది. అయితే ఉక్కు కర్మాగారం చరిత్రే త్యాగాలతో కూడుకున్నది. నాడు 32 మంది ప్రాణాల బలిదానంతో విశాఖ స్టీల్ ఏర్పడింది. 52 మంది కమ్యూనిస్టు ఎమ్మెల్యేలు, ఏడుగురు ఎంపీలు ప్లాంట్ కోసం రాజీనామా చేశారు. 68 గ్రామాలలో నివసించే ప్రజలు ఇళ్లను, 20 వేల ఎకరాల భూములను త్యాగం చేశారు. ప్రాణాలు ఫణంగా పెట్టి కార్మికులు ఉత్పత్తి పెంచారు. కేంద్ర ప్రభుత్వం ఆనాడు కేవలం రూ.5 వేల కోట్లలోపే పెట్టుబడి పెట్టింది. కానీ ఈనాడు స్టీల్‌ప్లాంట్ విలువ రూ.3 లక్షల కోట్లకు పైగా పెరిగింది. దీనిని కాపాడుకోవడానికి విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులు, ప్రజలు అకుంఠిత దీక్షతో ముందుకు కదిలారు. కర్మాగారం ఉంటేనే తనలాంటి వారికి ఎంతో కొంత పని దొరుకుతుందన్న భావన వెంకటమ్మనూ పోరాటానికి పురిగొల్పింది. 'ప్లాంట్ కోసం మావాళ్లు గ్రామాన్ని త్యాగం చేస్తే.. నేడు మమ్మల్ని ప్రభుత్వాలు, ఉక్కు యాజమాన్యం అనాథలను చేశాయి. భూములు వదులుకున్న మాకు ప్లాంట్‌లో చిన్నపాటి ఉద్యోగమూ ఇవ్వలేదు. చిన్నాచితకా పనులను నేనే వెతుక్కుని ప్లాంట్‌ను అంటిపెట్టుకుని బతుకుతున్నాను. ఇప్పుడేమో ఈ ప్లాంట్‌ను అమ్మేస్తామంటున్నారు. ఇదెక్కడి న్యాయం. ఇంకొకరికి అమ్మేయడానికా మేమింత త్యాగం చేసింది. ఎన్ని రోజులైనా పోరాటం చేస్తాం. మా మనవళ్లు, మనవరాళ్లకు ఈ ప్లాంట్‌ను అందించాలి' అని ఆమె చెబుతోంది. ఆమె నిబద్ధత పలువురికి ఆదర్శం.


దీక్షా శిబిరంలో కూర్చొన్న వెంకటమ్మ

వెయ్యి రోజులుపాటు సాగిన దీక్షల్లో దాదాపు ఆమె రోజూ కూర్చుంది. ఉదయాన్నే అందరికంటే ముందే శిబిరానికి హాజరయ్యేది. 'వెంకటమ్మ ఉదయం 8 గంటలకు ఇంటి నుంచి బయలుదేరుతుంది. ఎక్కడికని అడిగితే దీక్షకు అని చెబుతుంది. ఈ వయసులో ఇవన్నీ నీకు అవసరమా? అన్నవారూ ఉన్నారు. ఆ మాటలనేమీ ఆమె పట్టించుకోదు. ఆమెకు తెలిసిందల్లా ఒక్కటే. ప్లాంట్‌ను ఎలాగైనా కాపాడుకోవాలి. అందుకే వానొచ్చినా, ఎండ మండిపోతున్నా ఆమె లెక్కచేసేది కాదు. ఆమెది మంచి పోరాటం' అని కాశీపాలెం వాసులు 'ప్రజాశక్తి'కి తెలిపారు. 'అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన ఉక్కు కర్మాగారంపై మాటలకే పరిమితమయ్యాయి. ఉక్కు కర్మాగారం పీకను మోడీ సర్కారు నులిమేస్తున్నా నోరు మెదపడం లేదు. ఆయా పార్టీలకు చెందిన వారంతా వెంకటమ్మను చూసి చాలా నేర్చుకోవాలి. మనుషులుగా ఎలా ఉండాలో తెలుసుకోవాలి. స్వప్రయోజనాలు మాని జాతి సంపదను రక్షించుకోవడానికి ఏం చేయాలో ఆలోచించాలి. వారంతా ఓసారి వెంకటమ్మను చూసి సిగ్గుపడాలి' అని పలువురు అభిప్రాయపడ్డారు. ఏదేమైనా వెంకమ్మ పోరాటం అందరికీ స్ఫూర్తిదాయకం. ఆమె మన కాలం 'ఉక్కు' మహిళ.

– కోడూరు అప్పలనాయుడు,
94915 70765

కమల్ 'కల్కి 2898 ఎడి'




వైజయంతీ మూవీస్ బ్యానర్‌పై ప్రభాస్ హీరోగా 'కల్కి 2898 ఎడి' చిత్రం తెరకెక్కుతోంది. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రాబోతున్న ఈ చిత్రంలో కమల్ హాసన్ కీలక పాత్రలో నటిస్తున్నారు. మంగళవారం ఆయన పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం ఓ స్పెషల్ పోస్టర్ విడుదల చేసి కమల్‌హాసన్‌కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసింది. సైన్స్‌ఫిక్షన్, ఇతిహాసాల నేపథ్యంలో వస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్, దీపికా పదుకొనె, దిశా పటాని ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. చలనచిత్ర పరిశ్రమలో 50 ఏళ్ల ప్రస్థానం జరుపుకుంటున్న వైజయంతీ మూవీస్ ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది.

'ఆ వేడుక ప్రసారం లేదు'



వరుణ్ తేజ్, లావణ్య త్రిపాఠి పెళ్లి వేడుకకు సంబంధించిన వీడియో ఓటీటీలో ప్రసారం అవుతుందని, నెట్‌ఫిక్స్ రూ.8 కోట్లకు ఈ పెళ్లి వీడియోను కొనుగోలు చేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఇది ఒట్టి రూమర్ అని, పెళ్లి వీడియోను ఏ ఓటీటీలోనూ స్ట్రీమింగ్ చేయడం లేదని వరుణ్, లావణ్య పీఆర్ టీమ్ స్పష్టం చేసింది. 'వరుణ్-లావణ్యల పెళ్లి వీడియో ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతుందని వస్తున్న వార్తల్లో నిజం లేదు. పెళ్లి వీడియో హక్కులను ఏ ఓటీటీ సంస్థకు అమ్మలేదు. దయచేసి అలాంటి బేస్‌లెస్ రూమర్స్‌ని నమ్మకండి' అని వరుణ్, లావణ్య పీఆర్ టీమ్ ఓ ప్రకటనలో పేర్కొంది.

'భాగమతి-2'గా అనుష్క



అనుష్క కథానాయికగా రూపొందుతున్న తాజా చిత్రం భానుమతి 2. ఆమె పుట్టిన రోజు సందర్భంగా మంగళవారంనాడు 'భాగమతి 2' సినిమాని చిత్రబృందం ప్రకటించింది. 'భాగమతి'కి కొనసాగింపుగా రూపొందుతున్న చిత్రమిది. యూవీ క్రియేషన్స్ సంస్థ నిర్మించనుంది.

'దమ్ మసాలా బిర్యానీ..'



మహేశ్ బాబు హీరోగా త్రివిక్రమ్ రూపొందిస్తోన్న 'గుంటూరు కారం' చిత్రం నుండి తాజాగా లిరికల్ సాంగ్ విడుదలైంది. త్రివిక్రమ్ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం ఈ సినిమా తొలిపాటను చిత్రబృందం విడుదల చేసింది. 'దమ్ మసాలా బిర్యానీ..' అంటూ సాగే ఈ పాటకు తమన్ స్వరాలు సమకూర్చారు. రామజోగయ్యశాస్త్రి సాహిత్యం అందించారు. సంజిత్ హెగ్డే, తమన్ ఆలపించారు. శ్రీలీల, మీనాక్షి చౌదరి ఈ సినిమాలో హీరోయిన్లుగా చేస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుగుతోన్న ఈ సినిమా 2024 జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రానుంది.

కమల్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు

హీరో కమల్‌హాసన్ పుట్టినరోజు వేడుకలు చెన్నైలో మంగళవారం ఘనంగా జరిగాయి. సోషల్ మీడియా వేదికగా నటీనటులు ఆయనతో దిగిన ఫొటోలను పంచుకుంటూ శుభాకాంక్షలు తెలిపారు. 'మీలాంటి గొప్పవారు ఈ ప్రపంచంలో చాలా అరుదుగా ఉంటారు. హీరోగా, సింగర్‌గా, డ్యాన్సర్‌గా, అన్నింటికి మించి మంచి స్నేహితుడిగా.. ఇలా అన్ని విషయాల్లో మీరు ఉత్తమంగా ఉంటారు. మీలాంటి తండ్రి ఉండాలని ప్రతి అమ్మాయి కోరుకుంటుంది. మీరు నా జీవితంలో స్ఫూర్తి నింపారు. ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో చేసుకోవాలి. ఎప్పటికీ నిన్ను ప్రేమిస్తూనే ఉంటాను. మీరు నిజంగా అన్ని విషయాల్లో రాక్‌స్టార్' అంటూ అరుదైన చిత్రాలతో కూడిన ఓ వీడియోను కమల్ హాసన్ కుమార్తె శ్రుతి హాసన్ పోస్ట్‌చేశారు. దర్శకుడు శంకర్, హీరో ప్రభాస్ తదితరులు కూడా శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.



జపాన్ అలరిస్తుంది

అను ఇమ్మాన్యుయేల్



తాను నటించిన తాజా చిత్రం జపాన్ ప్రేక్షకులను విశేషంగా అలరిస్తుందని హీరోయిన్ అను ఇమ్మాన్యుయేల్ చెప్పారు. హీరో కార్తికి ఇది 25వ చిత్రం. జోకర్ ఫేమ్ రాజు మురుగన్ దర్శకత్వం వహించిన డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ఎస్ ఆర్ ప్రకాష్ బాబు, ఎస్ ఆర్ ప్రభు నిర్మించారు. అన్నపూర్ణ స్టూడియోస్ ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తోంది. 'దీపావళి' కానుకగా ఈనెల 10న విడుదల కానుంది. అను ఇమ్మాన్యుయేల్ విలేకరుల సమావేశంలో జపాన్ విశేషాలని పంచుకున్నారు. 'రాజు మురుగన్ చాలా వైవిధ్యమైన దర్శకుడు. ఆయన ప్రతి సినిమా డిఫరెంట్‌గా వుంటుంది. కార్తి, డ్రీమ్ వారియర్ పిక్చర్స్, డీవోపీ రవి వర్మన్, జీవి ప్రకాష్ కుమార్ మ్యూజిక్.. ఇలా జపాన్ టీం చాలా పెద్దది. జపాన్ కథ, పాత్ర చాలా యూనిక్. ఇలాంటి కథని గతంలో వినలేదు. ఇలాంటి సినిమాని చూడడానికి ఆడియన్‌గా కూడా చాలా ఆసక్తి చూపిస్తాను. కార్తి అద్భుతమైన నటుడు. ఆయనతో పని చేయడం ఒక గౌరవంగా భావిస్తున్నాను.

మ్యాక్స్‌వెల్ 'డబుల్'

- వన్డే ప్రపంచకప్‌లో డబుల్ సెంచరీ కొట్టిన మూడో క్రికెటర్
- గాయపడ్డా.. ఆసీస్‌ను ఓటమి అంచుల నుంచి విజయ తీరాలకు చేర్చిన గ్లెన్
- ఆఫ్ఘనిస్తాన్‌పై మూడు వికెట్ల తేడాతో గెలుపుతో సెమీస్‌కు కంగారుజట్టు


వన్డేల్లో డబుల్ సెంచరీ కొట్టిన తొలి ఆసీస్ క్రికెటర్ మ్యాక్స్‌వెల్

ముంబయి: ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో గ్లెన్ మ్యాక్స్‌వెల్ డబుల్ సెంచరీతో కదం తొక్కాడు. ఆఫ్ఘనిస్తాన్ నిర్దేశించిన 292పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఆసీస్ 91పరుగులకే 7వికెట్లు కోల్పోయి ఓటమి కోరల్లో నిలిచింది. ఆ దశలో మ్యాక్స్‌వెల్(201నాటౌట్; 218బంతుల్లో 21ఫోర్లు, 10సిక్సర్లు) ఒంటిచేత్తో మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశాడు. కెప్టెన్ పాట్ కమిన్స్(12నాటౌట్; 68బంతుల్లో 1ఫోర్)తో కలిసి 8వ వికెట్‌కి ఏకంగా 202పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. దీంతో ఆస్ట్రేలియా జట్టు మరో 19బంతుల్లో మిగిలి ఉండగానే విజయానికి చేరి సెమీస్‌కు చేరింది.

టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఆఫ్ఘనిస్తాన్‌కు ఓపెనర్ ఇబ్రహీం జద్రాన్(129నాటౌట్; 8ఫోర్లు, 3సిక్సర్లు) సెంచరీతో కదం తొక్కాడు. గుర్బాజ్(21), రామత్ షా(30), కెప్టెన్ షాహిది(26), అజ్మతుల్లా(22)కి తోడు రషీద్ ఖాన్(35నాటౌట్) బ్యాటింగ్‌లో రాణించారు. ఓపెనర్‌గా బరిలోకి దిగిన ఇబ్రహీం చివరి బంతి వరకూ క్రీజ్‌లో నిలిచాడు. దీంతో ఆఫ్ఘన్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 291పరుగుల భారీస్కోర్ నమోదు చేసింది. ఛేదనలో ఆస్ట్రేలియా ఓపెనర్ ట్రావిస్ హెడ్‌ను నవీన్ ఉల్ హక్ డకౌట్‌గా పెవిలియన్‌కు పంపగా... ఫస్ట్ డౌన్‌లో వచ్చిన మిచెల్ మార్ష్(24)తో కలిసి ఓపెనర్ డేవిడ్ వార్నర్(18) స్కోరు బోర్డును పెంచే ప్రయత్నం చేశాడు. వార్నర్‌ను ఒమర్జాయి చక్కటి బంతితో బౌల్డ్ చేశాడు. ఆ తర్వాతి బంతికే జోష్ ఇంగ్లిస్ గోల్డెన్ డక్ అయ్యాడు. ఈ క్రమంలో క్రీజ్‌లోకి వచ్చిన మ్యాక్స్‌వెల్ తొలినుంచే బ్యాట్‌ను ఝుళిపించడం మొదలుపెట్టాడు. మధ్యలో లబుషేన్(14) దురదృష్ట వశాత్తూ రనౌట్ అయ్యాడు. దీంతో ఆసీస్ పీకల్లోతు కష్టాల్లో పడింది. స్టార్ బ్యాటర్ స్టొయినిస్ (6)ను రషీద్ ఖాన్ మ్యాజిక్ బంతితో ఎల్బీడబ్ల్యూ పెవిలియన్‌కు చేరాడు. మధ్యలో మ్యాక్స్‌వెల్ గాయపడ్డా.. ఫోర్లు, సిక్సర్లతోనే మ్యాచ్‌ను ముగించడం విశేషం. ఆస్ట్రేలియా జట్టు 18.3ఓవర్లలో 91పరుగులకు 7వికెట్లు కోల్పోయి ఓటమికోరల్లో నిలిచి.. విజయ తీరాలకు చేరిన తీరు వర్ణణాతీతం. మాక్స్‌వెల్ ఇచ్చిన 2 సునాయాస క్యాచ్‌లను జారవిడవడంతో ఆఫ్ఘన్ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. నవీన్, అజ్మతుల్లా, రషీద్‌ఖాన్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ మ్యాక్స్‌వెల్‌కు లభించింది.

వన్డే ప్రపంచకప్‌లో నేడు...
ఇంగ్లండ్ × నెదర్లాండ్స్
(వేదిక: పూణే, మ.2.00గం॥లకు)

వన్డే ప్రపంచకప్‌లో డబుల్ సెంచరీ కొట్టిన బ్యాటర్లు...
237 : మార్టిన్ గుప్టిల్(న్యూజిలాండ్).. వెస్టిండీస్‌పై వెల్లింగ్టన్‌లో, 2015
215 : క్రిస్ గేల్(వెస్టిండీస్).. జింబాబ్వేపై, కాన్‌బెర్రా, 2015
201 : గ్లెన్ మ్యాక్స్‌వెల్(ఆస్ట్రేలియా)... ఆఫ్ఘనిస్తాన్‌పై, ముంబయి 2023

స్కోర్‌బోర్డు...

ఆఫ్ఘనిస్తాన్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (సి)స్టార్క్ (బి)హేజిల్‌వుడ్ 21, ఇబ్రహీమ్ జద్రాన్ (నాటౌట్) 129, రామత్ షా (సి)హేజిల్‌వుడ్ (బి)మ్యాక్స్‌వెల్ 30, షాహిది (బి)స్టార్క్ 26, అజ్మతుల్లా (సి)మ్యాక్స్‌వెల్ (బి)జంపా 22, నబీ (బి)హేజిల్‌వుడ్ 12, రషీద్ ఖాన్ (నాటౌట్) 35, అదనం 16. (50 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 291పరుగులు. **వికెట్ల పతనం:** 1/38, 2/121, 3/173, 4/210, 5/233 **బౌలింగ్:** స్టార్క్ 9-0-70-1, హేజిల్‌వుడ్ 9-0-39-2, మ్యాక్స్‌వెల్ 10-0-55-1, కమిన్స్ 8-0-47-0, జంపా 10-0-58-1, హెడ్ 3-0-15-0, స్టొయినీస్ 1-0-2-0

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: వార్నర్ (బి)అజ్మతుల్లా 18, హెడ్ (సి)ఇక్రమ్ (బి)నవీన్-ఉల్-హక్ 0, మిచెల్ మార్ష్ (ఎల్‌బి)నవీన్-ఉల్-హక్ 24, లబూషేన్ (రనౌట్)రామత్ 14, ఇంగ్లిస్ (సి)ఇబ్రహీమ్ (బి)అజ్మతుల్లా 0, మ్యాక్స్‌వెల్ (నాటౌట్), 201; స్టొయినీస్ (ఎల్‌బి)రషీద్ ఖాన్ 6, మిచెల్ స్టార్క్ (సి)ఇక్రమ్ (బి)రషీద్ ఖాన్ 3, పాట్ కమిన్స్ (నాటౌట్) 12, అదనం 15. (46.5ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 293పరుగులు. **వికెట్ల పతనం:** 1/4, 2/43, 3/49, 4/49, 5/69, 6/67, 7/91 **బౌలింగ్:** ముజీబ్-ఉర్-రెహ్మాన్ 8.5-1-72-0, నవీన్-ఉల్-హక్ 9-0-47-2, అజ్మతుల్లా 7-1-52-2, రషీద్ ఖాన్ 10-0-44-2, నూర్ అహ్మద్ 10-1-53-0, మహ్మద్ నబి 2-0-20-0

6వ ర్యాంక్‌లో భారత మహిళల హాకీ జట్టు

హాకీ ర్యాంకింగ్స్ విడుదల



లాసన్నె: అంతర్జాతీయ హాకీ సమాఖ్య(ఎఫ్ఐహెచ్) తాజా ర్యాంకింగ్స్‌లో భారత మహిళల జట్టు సత్తా చాటింది. మంగళవారం ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో భారత మహిళల హాకీ జట్టు ఏకంగా 6వ ర్యాంక్‌కు ఎగబాకింది. 2023 ఛాంపియన్స్ ట్రోఫీ టైటిల్‌ను చేజిక్కించుకోవడం, ఆసియా క్రీడల్లో కాంస్య పతకం సాధించడం ర్యాంక్ మెరుగుదలకు దోహదపడ్డాయి. జనవరి 13నుంచి రాంచీ వేదికగా జరిగే ఎఫ్ఐహెచ్ హాకీ ఒలింపిక్స్ క్వాలిఫయర్స్‌లో ఒలింపిక్స్ బెర్త్‌పై కన్నేసిన భారత మహజళల జట్టు తాజా ర్యాంకింగ్స్‌లో మెరుగవ్వడంతో మరింత ఉత్సాహంగా బరిలోకి దిగేనుంది. తాజా ర్యాంకింగ్స్‌లో నెదర్లాండ్స్ తన అగ్రస్థానానికి నిలబెట్టుకోగా.. ఆస్ట్రేలియా, అర్జెంటీనా 2, 3 స్థానాల్లో నిలిచాయి. బెల్జియం 4వ, జర్మనీ 5వ స్థానంలో ఉన్నాయి.

పాయింట్ల పట్టిక

వ.స.	దేశం	ఆ	గె	ఓ	పా	నె.ర.
1.	భారత్	8	8	0	16	+2.45
2.	దక్షిణాఫ్రికా	8	6	2	12	+1.37
3.	ఆస్ట్రేలియా	8	6	2	12	+0.86
4.	న్యూజిలాండ్	8	4	4	8	+0.39
5.	పాకిస్తాన్	8	4	4	8	+0.03
6.	ఆఫ్ఘనిస్తాన్	8	4	4	8	-0.33
7.	బంగ్లాదేశ్	8	2	6	4	-1.14
8.	శ్రీలంక	8	2	6	4	-1.16
9.	నెదర్లాండ్స్	7	2	5	4	-1.39
10.	ఇంగ్లండ్	7	1	6	2	-1.50

ఆ:ఆడినవి; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర:నెట్‌రన్‌రేట్

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68